అనుభవాల కథలు



ఆచార్య మర్రెబోయిన జయదేవ్
డి.లిట్.

అనుభవాల కథలు - ఆచార్య మర్రెబోయిన జయదేవ్

అనుభవాల కథలు

ఆచార్య మర్రెబోయిన జయదేవ్
ఎం.ఏ., పిహెచ్.డి.,డి.లిట్.

విశ్రాంతాచార్యులు
తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం
విశాఖపట్నం

అనుభవాల కథలు

రచన, ప్రచురణ - ఆచార్య మర్రెబోయిన జయదేవ్
Anubhavaala Kathalu- Short stories
Written& Published
by
Prof. M. Jaya dev

ప్రథమ ముద్రణ : జూలై, 2023

ప్రతులు : 500

ప్రతులకు :

ఆచార్య ఎం. జయదేవ్
ఫ్లాట్ నెంబర్- 402, దేవాస్ ఈస్ట్ వెస్ట్ రెసిడెన్సి
ప్రభుపాద టౌన్షిప్, మసీద్ బండ,
కొండాపూర్, హైదరాబాదు- 500084, సెల్ నెంబర్-9290102364

నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాదు
తెలుగు బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాదు
పద్మిని, సెల్ నెంబర్- 8558899478

వెల : రూ. 200/-

పేజ్ లే అవుట్

అంకుష్ గ్రాఫిక్స్, నల్లకుంట,
హైదరాబాదు, సెల్ : 9666699078

ముఖచిత్రం

కూర్మా విశ్వకళ్యాణ్ , విశాఖపట్నం, సెల్. 9030803525
ISBN Number : 978 - 93 - 5915 - 676 - 7

అంకితం



నా భార్య

మర్రెబోయిన పద్మావతి

దివ్యస్మృతికి

నామాట

కథా రచనలో ఈ "అనుభవాల కథలు" నా రెండవ పుస్తకం. మొదటి పుస్తకం "జయదేవ్ కథలు" పేరుతో 20 కథలను సెప్టెంబర్ 2022 లో ప్రచురించాను. ప్రతి వ్యక్తి జీవితంలోనూ చాలా అనుభవాలుంటాయి. వాటిలో కొన్నింటిని కథలుగా మలచవచ్చు. అలా మలిచిన కథల్లో వ్యక్తుల మనస్తత్వాలు గోచరిస్తాయి. ఏ ఇద్దరు వ్యక్తులు రూపంలో ఒకే విధంగా ఉండరు. అలాగే మనస్తత్వరీత్యా కూడా ఏ ఇద్దరు వ్యక్తులు ఒకే విధంగా ఉండరు. ఎంతో కొంత తేడా ప్రతి వ్యక్తిలోనూ కనిపిస్తూ ఉంటుంది. అంతేకాకుండా వ్యక్తులు అన్ని సందర్భాల్లోనూ ఒకే విధంగా ప్రవర్తించరు. కాలాన్ని బట్టి, సమయాన్ని బట్టి, అవసరాన్ని బట్టి వ్యక్తుల ప్రవర్తన ఉంటుంది. కథల్లో అలాంటి వ్యక్తుల భిన్న మనస్తత్వ చిత్రణ సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. అలాంటి కథలను చదివినప్పుడు పాఠకుడు అవి తన అనుభవాలుగా, లేక తనకు పరిచితమైన వ్యక్తుల అనుభవాలుగా అనుభూతి చెందుతాడు.

ఈ "అనుభవాల కథలు" పుస్తకంలో పిసినారి దాతృత్వం, ఆడపిల్ల పుట్టిందని, కూతురు, పెళ్లి వద్దు నాన్న మొదలైన ఇరవై కథలున్నాయి. మన ప్రాచీన గ్రంథాల్లో బలి చక్రవర్తి, రఘు మహారాజు, రంతీదేవుడు, కర్ణుడు మొదలైన వారు మహాదాతలుగా చెప్పబడ్డారు. వీరందరు కల్పిత పాత్రలు. సమాజంలో దాన గుణాన్ని పెంపొందింప జేయడానికి ఆనాటి కవులు ఇలాంటి మహాదాతల పాత్రలను కల్పించారు. కానీ ఈనాడు లోకంలో కొందరు త్యాగ జీవులు, నిస్వార్ధపరులు మహాదాతలు తాము పెళ్లి చేసుకోకుండా తమ సంపాదన మొత్తాన్ని సమాజ అవసరాలకు వినియోగించే వాళ్ళున్నారు. వీళ్లు కల్పిత పాత్రలు కాదు. సమాజంలో మనతోపాటు జీవించిన వ్యక్తులు. అలాంటి మహోన్నత వ్యక్తికి సంబంధించిన కథ "పిసినారి దాతృత్వం" కథ. ఈ కథలో అత్యంత పిసినారిగా ప్రసిద్ధి చెందిన ప్రధాన పాత్ర చనిపోయిన తర్వాత అతని కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు మిత్రులు అతని పిసినారితనాన్ని

గురించి కించపరుస్తూ మాట్లాడుకుంటారు. అయితే ఆ ఇద్దరు మిత్రులు మహోదాత్తమైన అతని దాతృత్వాన్ని తెలుసుకొని ఆశ్చర్యపోయి తమ సొంత డబ్బుతో అతనికి సమాధి కట్టించి అతని గొప్పతనాన్ని శిలాఫలకం మీద చెక్కిస్తారు. ఇలాంటి మహాదాతలు మానవతామూర్తులు సమాజంలో ఎందరికో స్ఫూర్తి ప్రదాతలు, ఆదర్శప్రాయులు. ఈ విధంగా ఈ కథ వ్యక్తుల అనుభవానికి సంబంధించిన కథ.

అలాగే ఆడపిల్ల పుట్టిందని, కూతురు, పెళ్లి వద్దు నాన్న, గర్భవతి, ప్రేమ కథ, మొదలైన ఈ పుస్తకంలోని కథలన్నీ చాలా వరకు వ్యక్తుల అనుభవాలకు సంబంధించినవే. అందువల్లనే ఈ గ్రంథానికి "అనుభవాల కథలు" అనే పేరు పెట్టాను. ఈ కథల్లో పాత్రల వైవిధ్య భరితమైన మనస్తత్వ చిత్రణ కూడా కనిపిస్తుంది.

నా కథల గురించి నేను ఇంతకంటే ఎక్కువగా చెప్పటం ఉచితం కాదని భావిస్తున్నాను.

హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతిగా, ఇతర అనేక విద్యా సంబంధమైన, పరిపాలనా సంబంధమైన విషయాలతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ నేను కోరిన వెంటనే నా యీ కథల మీద "మనకు తెలిసీ తెలియనట్లుండే మన జీవితాలే ఆచార్య జయదేవ్ గారి కథలు" అనే పేరుతో చాలా చక్కటి అభిప్రాయాన్ని రాసిన విద్వన్మిత్రుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ కథల్లో కొన్నింటికి మంచి సూచనలు చేసిన మిత్రులు, ప్రసిద్ధ రచయిత వి.ఆర్. రాసాని నా ధన్యవాదాలు.

నా ఈ పుస్తకానికి పేజ్ లేఅవుట్ తయారుచేసిన అంకుష్ గ్రాఫిక్స్ వారికి నా ధన్యవాదాలు.

ఈ పుస్తకానికి అందంగా ముఖచిత్రాన్ని రూపొందించిన కే. విశ్వకళ్యాణ్, విశాఖపట్నం వారికి నా ధన్యవాదాలు.

- జయదేవ్

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
తెలుగు శాఖాధ్యక్షులు
హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం
హైదరాబాదు

మనకు తెలిసీ తెలియనట్లుండే మన జీవితాలే ఆచార్య జయదేవ్ గారి కథలు

ఆచార్య మర్రెబోయిన జయదేవ్ గారు నాకు తెలిసినంతవరకు గొప్ప పరిశోధకులు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా, శాఖాధ్యక్షులుగా సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. మంచి అధ్యాపకులుగా పేరు తెచ్చుకున్నారు. ప్రాచీన, ఆధునిక, జానపద సాహిత్యాలపై లోతైన అధ్యయనం ఉన్నవారు. ఈ విషయాలు అక్కడక్కడ సదస్సులు జరిగినప్పుడు కలిసిన అధ్యాపకులు, ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థుల ద్వారా వినేవాడిని. ఆయన దగ్గర నుంచి నాకు ఒక పరిశోధన గ్రంథం వచ్చింది. అది చూసిన తర్వాత దానిలో పాటించిన పరిశోధనా పద్ధతి, ప్రతిపాదించే అంశాన్ని తార్కికంగా, శాస్త్రీయంగా ముగించే తీరు నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఆ పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించిన తర్వాత ఆయనతో మాట్లాడాను. ఆయనతో నేను మాట్లాడడం అదే మొదటిసారని గుర్తు. ఆ సిద్ధాంత గ్రంథం గురించే మాట్లాడాను. పరిశోధన చాలా బాగా చేయించారని, రిపోర్టులో అన్ని రాయలేమని, నాకు బాగా నచ్చిన అంశాల్ని ఆ సంభాషణలో ప్రస్తావించాను. ఆయన కూడా రిపోర్ట్ బాగా రాశారని మెచ్చుకున్నారు. కొన్నాళ్ళ తరువాత ఆయన రాసిన "మహాభారతంలో జానపద కథాంశ కథలు'' పరిశోధనా గ్రంథాన్ని పంపించారు. ఆ గ్రంథం ఆయనపై నాకున్న గౌరవాన్ని మరింతగా రెట్టింపు చేసింది. ఇదంతా ఎందుకంటే జయదేవ్ గారు తాను మంచి పరిశోధన చేయడమే కాకుండా

తన విద్యార్థుల చేత కూడా మంచి పరిశోధనలు చేయించిన ఉత్తమ పరిశోధకుడు అని చెప్పడానికే.

అలాంటి పరిశోధకుని కలం నుంచి ఇప్పుడు కథలు వెలువడు తున్నాయంటే కొంచెం ఆశ్చర్యానికి గురైన మాట నిజమే

జయదేవ్ గారు మహాభారతంలోని జానపద కథాంశాలను గురించి "మహాభారతంలో జానపద కథాంశ కథలు" అనే తమ గ్రంథంలో విపులంగా చర్చించారు. సంప్రదాయ సాహిత్యాన్ని జానపద సాహిత్యాన్ని ఎంతో లోతుగా పరిశీలిస్తే తప్ప అది సాధ్యం కాని విషయం. అలా పరిశీలన చేసినప్పుడే ఆచార్య జయదేవ్ గారు కథానిర్మాణంలోని మెలకువలను కూడా గుర్తించి ఉంటారనిపించింది. ఆ అధ్యయనాన్ని ఇప్పుడు రాసిన కథానికలకు బాగా ఉపయోగించుకున్నారని పిస్తుంది. తన నిత్యజీవితంలో గమనించిన అనేక జీవన సత్యాలను సుమారు 20 కథలుగా రాసి వాటిని "జయదేవ్ కథలు"అనే పేరుతో ఒక కథా సంపుటిని 2022 లో తీసుకొచ్చారు. ఇప్పుడు మళ్లీ మరో 20 కథలను "అనుభవాల కథలు" అనే పేరుతో ఒక కథా సంపుటిని తీసుకొస్తున్నారు.

పిసినారి దాతృత్వం కథలో వెంకట్రావు ఒక ఉద్యోగి, పరమ పిసినారి, పెళ్లి కూడా చేసుకోలేదు. తన జీతమంతా బ్యాంకులోనే దాచి పెట్టాడు. తన జీతంలో ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టుకోలేదు. మరి ఆ డబ్బు ఎవరికోసం దాస్తున్నాడు? ఆ డబ్బు ఏం చేశాడు అనేది ఈ కథలో ఒక ట్విస్ట్.

ఈ కథలో ఇతను ఒక రేర్ క్యారెక్టర్. తన భోజనాన్ని గుడుల దగ్గర పెట్టే ప్రసాదంతోనే సరిపెట్టుకోవడం, సెకండ్ హ్యాండ్ బట్టలు కొనుక్కోవడం, నడిచి వెళ్లడం లేదా తన పాత సైకిల్ మీదనే ఆఫీసుకు వెళ్లడం ఇవన్నీ అతని పాత్రను శాశ్వతంగా గుర్తుండిపోయేలాగా చేసే లక్షణాలు. అతని పిసినారితనాన్ని గురించి అతని సహోద్యోగులు

రకరకాలుగా చెప్పుకునేవారు. తన సంపాదనంతా ఏం చేస్తున్నాడనేది వాళ్లకు సమాధానం దొరకని ప్రశ్న అయ్యేది. అతను చనిపోయిన తర్వాత బ్యాంకు మేనేజర్ చెప్పిన విషయం విన్న ఆ సహోద్యోగులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. బ్యాంకులోని తన డబ్బు మొత్తాన్ని భారత సైనిక నిధికి దానంగా ఇచ్చిన గొప్ప దేశభక్తుడని తెలుసుకున్నారు. అతని దేశభక్తికి, భారత సైన్యం మీద అతనికున్న గౌరవానికి ఆశ్చర్యపోయిన సహోద్యోగుల్లోని ఇద్దరు మిత్రులు అతని అస్థికల మీద సమాధిని కట్టించి అతని దాతృత్వం గురించి శిలాఫలకం మీద చెక్కిస్తారు. దానం చేసే వాళ్ళుంటారు, కానీ ఇంతలా తన జీతం మొత్తాన్ని సైనికనిధికి దానం చేసే వాళ్ళుంటారా? అని ఆశ్చర్యపోయే ఒక గొప్ప కథ "పిసినారి దాతృత్వం".

"కూతురు కథ"లో రామారావు భార్య సీత ప్రసవ సమయంలో చనిపోతుంది. పిల్ల కడుపులో అడ్డం తిరగడం, ఆ బిడ్డను బయటకి తీయడానికి వైద్యులు సిజేరియన్ చేయడం, దానివల్ల విపరీతంగా రక్తస్రావం కావడంతో ఆమె అని చనిపోతుంది. భార్య చనిపోవడానికి తన కూతురే కారణమని భావిస్తున్న రామారావుకు కూతురంటే ఇష్టముండదు. తన భార్య మీద ఉన్న ప్రేమతో మళ్లీ పెళ్లి చేసుకోడు. రామారావు తల్లి అన్నపూర్ణ ఆ పిల్లను పెంచి పెద్ద చేస్తుంది. ఆ పిల్లకు చనిపోయిన కోడలు పేరుతో సీత అనే పేరు పెడుతుంది. కొన్నాళ్లకు రామారావుకు పక్షవాతం రావడం, ఆ పరిస్థితిలో అతని కూతురు సీత అన్ని సపర్యలు చేయడానికి దిక్కవడంతో తండ్రి రామారావు పశ్చాత్తాపానికి గురవుతాడు.

కొన్ని యాదృచ్ఛికంగా జరిగే సంఘటనలకు మనం ఎవరెవరినో బాధ్యులను చేస్తూ ఉంటాం. దాని వల్ల చాలామంది మానసికంగానూ భౌతికంగానూ ఎన్నో సమస్యలకు గురికావాల్సి వస్తుంది. ఆ తప్పు తెలుసుకునేసరికి జరగవలసిన నష్టం జరిగిపోతుంది. మనం తీసుకునే తొందరపాటు నిర్ణయాలు, ఆవేశంతో తీసుకుని నిర్ణయాలు, ఆలోచన లేకుండా తీసుకునే నిర్ణయాలు కొంతమంది మానసిక సంఘర్షణకు,

మానసిక అశాంతికి, అనేక సమస్యలకు ఎలా దారి తీస్తాయో తెలియాలంటే ఈ కథ చదివి తీరాలి.

ఇది ఒక సంఘటన లాగే అనిపిస్తుంది, కానీ ఆ సమస్య తీవ్రతను అనుభవించిన వాళ్లకు మాత్రమే ఆ మానసిక వేదన ఏమిటో తెలుస్తుంది.

"ఆడపిల్ల పుట్టిందని" అనే కథ కొన్ని కరుడు కట్టిన మూర్ఖపు భావాలున్న బూర్జువా మనస్తత్వాన్ని మన కళ్ళ ముందు నిలుపుతుంది. తనకు పుట్టేది ఆడపిల్లో మగపిల్లోడో తల్లికి తెలియదు. ఏ స్త్రీ అయినా తాను కావాలని అలా కనలేదు. కానీ మన సమాజంలో కొందరు మూర్ఖపు పురుషులు ఆడపిల్ల పుట్టడంలో తల్లిని బాధ్యురాలిగా చేయడం, తన భార్య కొడుకునే కనాలని పట్టుపట్టడం, కూతురును కంటే ఆమెను రకరకాలుగా భౌతిక, మానసిక హింసలకు గురి చేయడం కనిపిస్తున్న ఒక దారుణం. అలాంటి పరిస్థితి తనకు ఎదురైనప్పుడు ఒక భార్య ఎలా ప్రతిస్పందిస్తుందో ఈ కథలో రచయిత చెప్పారు. ప్రస్తుత సమాజానికి ఇలాంటి స్ఫూర్తి అవసరం.

"పెళ్లి వద్దు నాన్న కథ" లో పెళ్లికి ఉన్నత చదువులకు మధ్య నలిగిపోయే ఒక ఆడపిల్ల, తనకు తల్లిదండ్రులకు మధ్య జరిగిన సంఘర్షనే వస్తువు. యుక్త వయసులో ఉండగానే తమ కూతురు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు అనుకోవడం సహజం. ఏ వయసులో జరగవలసిన ముచ్చట ఆ వయసులో జరిగితే బాగుంటుందనేది తల్లిదండ్రుల భావన కావచ్చు. మంచి సంబంధం వస్తే అమ్మాయి సుఖపడుతుందనే ఆలోచన కూడా కావచ్చు. వయసు దాటిన తర్వాత పెళ్లి చేస్తే వచ్చే సమస్యలు ఏంటో తెలిసిన తల్లిదండ్రుల ఆలోచనలు కూడా కావచ్చు. కానీ పెళ్లి ఒక్కొక్కసారి ఆడపిల్ల ఆశయాలను చంపేస్తుంది. తన ఆశయాలను నిలబెట్టుకోవడం కోసం ఒక యువతి తీసుకున్న నిర్ణయమే ఈ కథ.

పిల్లలకు సమాజం పట్ల అవగాహన ఉండడం, అటువంటి అవగాహన తల్లిదండ్రులకు లేకపోవడం కొన్నిసార్లు సంఘర్షణలకు కారణం కావచ్చు.

కొన్నిసార్లు ఇది తిరగబడవచ్చు. అంటే తల్లిదండ్రులకు అవగాహన ఉంటుంది, పిల్లలకు అవగాహన ఉండకపోవచ్చు.

ప్రస్తుత సమాజంలో ఈ సమస్య చాలా తీవ్రంగా ఉంది. యుక్త వయసులో వివాహం జరగకపోవడం వల్ల, వాళ్లు స్థిరపడిన తర్వాత వివాహం చేసుకోవడం వల్ల, పిల్లలను కనడం వారిని పెంచడం వంటి వాటిలో చాలా సమస్యలున్నాయి. అలాగే ఎంతో తెలివితేటలున్నప్పటికీ ఆడపిల్లలైతే వెంటనే పెళ్లి చేసి తమ బాధ్యతను వదులుకోవాలనే తల్లిదండ్రుల యొక్క దురాలోచనలు కూడా ఉన్నాయి. స్త్రీకి ఆర్థిక స్వావలంబన ఎంత అవసరమో మిగతా జీవితాన్ని ఆనందంగా గడపడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటిని సమన్వయం చేసుకోవడం అనేది అంత సులభమైన విషయం కాదు. ఎంతో సాదాసీదాగా కనిపించే ఈ సమస్య చాలా తీవ్రమైంది. ఆ సమస్యను అంతే సహజంగా మన ముందు పెట్టినట్లుగానే రచయిత ఈ కథను మన ముందుంచారు.

ఒక సమస్యకు ఒకటే పరిష్కారముండదు. రకరకాలైన పరిష్కా రాలుంటాయి. అటువంటప్పుడు రచయిత పరిష్కారాన్ని చెప్పకుండా పాత్ర ఇలాంటి పరిష్కారం తీసుకున్నది, దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో పాఠకులుగా మీరే ఆలోచించండి అన్నట్లుగా కొన్ని కథలున్నాయి. అలాంటి కథల్లో ఇది కూడా ఒకటి. కొన్నిసార్లు ఫలానా సమస్యకు ఫలానా పరిష్కారం తీసుకోవాలనుకునే వాళ్లు చాలా తక్కువ మంది ఉంటారు. ఒక్కొక్కసారి అప్రయత్నంగా కొన్ని జరిగిపోతూ ఉంటాయి. దానివల్ల రకరకాల పరిస్థితులు, సంఘర్షణలు ఉత్పన్నమవుతాయి. అదే జీవితం, అంటే అదే వాస్తవం. అలాంటి వాస్తవ జీవితమే ఈ కథల నిండా ఉంది.

"గర్భవతి" కథ ఒక కల. గర్భంతో ఉన్న స్త్రీ రకరకాల ఊహాలలో విహరిస్తుంది. రకరకాల కలలు కంటుంది. ఈ కథలో రాణి కూడా ఒక సామాన్యమైన స్త్రీ లేదా యువతి. ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు మంచి కల కంటుంది. రచయిత చివర కొసమెరుపు చాలా బాగా పెట్టారు.

"కల నిజమైతే ఎంత బాగుంటుంది అని అనుకుంది'' అని ముగించారు. కలలో గర్భవతిగా ఉన్న ఆమెను ఇంట్లో వాళ్ళందరూ మహారాణి లాగా చూస్తూ ఉంటారు. ఆమెకు అన్నం తినిపిస్తున్న భర్త రాజు పొరపాటున నీళ్లు ఆమె ఒంటి మీద పోస్తాడు. వెంటనే ఆమె అతని చెంప చెల్లుమనిపిస్తుంది. ఆడవారికి కొన్ని కోరికలుంటాయి. కానీ ఆ కోరికలు తీరడం అంత సులభం కాదు. భర్తకు అన్నం తినిపిస్తూ ఆమె పొరపాటున భర్త మీద నీళ్లు పోస్తే భర్త ఆమెను కొట్టడం అత్యంత సహజం. కానీ భార్య ఆ పని చేసింది ఇక్కడ. అది సాధ్యమా? శిల్ప పరంగా కొంత పరిణతి కన్పించే మంచి కథ ఇది. కేవలం కథనంతా కలగా వర్ణించి చివరకు అలా జరిగితే బాగుండునని అనడం ద్వారా ఆమె భర్త ఎటువంటి వాడో తెలుసుకోవాలని పాఠకులు కథను మళ్ళీ వెనక్కి వెళ్లి చదువుతారు. కథలో ఆ వివరాలు ఏవీ ఉండవు. ఈ కథ శిల్ప పరంగా గొప్పది కావడానికి ఆ వివరాలు లేకపోవడమే ప్రధాన కారణం.

"ప్రేమ కథ'' సుఖాంతంగా జరిగిన ఒక కథ. కథకైనా, సినిమా కైనా, సీరియల్ కైనా, నవల కైనా సంఘర్షణ ముఖ్యం. ఆ సంఘర్షణ కోసం కొన్ని సన్నివేశాలు కల్పన చేస్తారు. కథను చెప్పడంలో జరిగిపోయిన దాన్ని ముందు చెప్పడం "ఫ్లాష్ బ్యాక్'', ముందు జరగబోయే దాన్ని ఊహించేలా చెప్పడం, ఇవన్నీ రచయిత ప్రతిభకు సంబంధించిన విషయాలు. కథను సుఖాంతం చేయాలా? కథను ముగించేటప్పుడు ఆ ముగింపును పాఠకులకే వదిలివేయాలా? కథకుడే ముగింపు ఇవ్వాలా అనే విషయాలు శిల్పానికి సంబంధించినవి. కూతురు తన కులం కాని అబ్బాయిని ప్రేమించింది. ఆ విషయం తల్లిదండ్రులకు చెప్పింది. వాళ్ళు అంగీకరించలేదు. తన కులం వ్యక్తితో ఆమెకు బలవంతంగా పెళ్లి చేశారు. ఈవిషయం ఆమె తన ప్రేమికుడికి ఫోన్ చేసి చెప్పింది. "నువ్వు పెళ్లి చేసుకున్నా పర్వా లేదు, నిన్ను నేనూ మా కుటుంబమంతా కలిసి బంగారంలాగా చూసుకుంటాం, నువ్వు నాతో రా'' అని ఆమె ప్రియుడు ఆమెకు చెప్పాడు. ఆమె ప్రయునితో వెళ్ళిపోయింది. ప్రియుని ఇంట్లో వాళ్ళందరూ ఆమెను

బాగా చూసుకున్నారు. ఈ విషయం మళ్లీ ఆమె తన కుటుంబానికి, తనను పెళ్లి చేసుకున్న వ్యక్తికి చాలా మర్యాదపూర్వకంగా ఫోన్ చేసి చెప్పింది. కూతురు జీవితం బాగుండాలని భావించిన ఆమె తల్లిదండ్రులు ఆమె ప్రియునితో వెళ్లిపోవడాన్ని అంగీకరిస్తారు. కథ సుఖాంతం.

ఈ కథ ద్వారా రచయిత యువతీ యువకులు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నా వాళ్లు సుఖసంతోషాలతో ఉండటం ముఖ్యం. తల్లిదండ్రులు వారిని అర్థం చేసుకొని సహకరించాలనే సందేశం కావచ్చు

"భార్యాభర్తలు" కథలో భార్య, భర్త ఇద్దరూ ఉద్యోగస్తులయితే ఉండే సమస్యలు వాటి పరిష్కారాలను రచయిత చెప్పారు.

"సంతానం" కథ ఒక నవలకు ఉన్నంత కాన్వాస్ ఉన్న కథ. కథ నిండా అనేక మలుపులు, సంతానం కోసం భర్త తన భార్య మరొక వ్యక్తి దగ్గరకు వెళ్ళడానికి అంగీకరిస్తాడా? మహాభారతం నాటి కథను గుర్తుచేసే కథ ఇది. మన చుట్టూ కనిపించని జీవితాలను కనిపించేలా చేసిన కథ.

"నాన్న బరువయ్యాడు" కథలో ఈనాడు తల్లిదండ్రుల పట్ల పిల్లలు వ్యవహరిస్తున్న తీరుతెన్నులను మన కళ్ళ ముందు నిలిపిన కథ. కథను ఆశావహంగా ముగించడం చాలా బాగుంది.

"అనాయాస మరణం" కూడా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పరిస్థితులను వర్ణించిన కథ. కథ పూర్తి అయ్యేసరికి పాఠకుడికి ఒక భయమేదో చుట్టుకుంటుంది. చాలా ఆధ్యాత్మిక గ్రంథాలను చదివిన ప్రధాన పాత్రకు తాను కోరుకున్న అనాయాస మరణం వచ్చిందా? లేదా? అనేది చర్చకు పెట్టేశాడు రచయిత. ఈ కథ చదివిన తర్వాత గుండె బరువెక్కి పోతుంది.

"పల్లెటూరు మనిషి" కథ చదువుతుంటే పాలగుమ్మి పద్మరాజు గారి "గాలి వాన కథ" లీలగా గుర్తుకొస్తుంది. మానవుల మనస్తత్వాలను,

వారి ప్రవర్తనను అవగాహన చేసుకోవడానికి ఈ కథ రాశారనిపిస్తుంది. చిన్నదే కానీ శిల్ప పరంగా మంచి కథ.

"నేటి ప్రొఫెసర్" విశ్వవిద్యాలయాల్లో జరుతున్న పరిశోధనల తీరుతెన్నులను ఎండగట్టిన కథ.

"దురాశ" కథ కట్నకానుకల కోసం ఎదురుచూసే యువకులను దారిలో పెట్టేలాగా రాసిన కథ.

ఆమధ్య ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)పేరుతో ప్రభుత్వం అత్యంత చౌకగా కొంతమందికి భూములను కట్టబెట్టడం, అక్కడ పరిశ్రమలు రాకపోగా వాటిని ప్రైవేటు వ్యాపారానికి వినియోగించుకున్న వైనాన్ని తెలియజేసిన కథ "మాయ సెజ్ కంపెనీ" కథ.

"వివక్ష" కథ ఒక సామాజిక సమస్యను చర్చించే ఒక మంచి కథ. సమాజంలో కొన్ని కులాల వారికి ఎక్కడలేని గౌరవాన్ని ఆపాదిస్తారు. కొన్ని కులాల వాళ్లను వాళ్ళు ఎంత ప్రతిభావంతులైనా వారిని సరిగా గౌరవించరు. జంతువుల్లోనూ పక్షుల్లోనూ కూడా ఈ వివక్ష కనిపిస్తుందని ఒక పరిశోధనాత్మక విషయాలతో కొనసాగిన కథ.

ఒక దుర్మార్గున్ని ఎదిరించలేక చస్తూ బతకడం కంటే అతన్ని చంపడమో, తాను చావడమో ఏదో ఒకటి జరగడమే దీనికి సరైన పరిష్కారం అని చెప్పే కథ "తెగింపు". దుర్మార్గుడైన ఒక రెడ్డిని ఒక మాదిగ యువతి తన భర్తతో కలిసి చంపడానికి చేసిన గొప్ప సాహసాన్ని రాయలసీమ మాండలికంలో అత్యంత సహజంగా వర్ణించిన గొప్ప కథ ఇది. కథకుడిగా ఆచార్య జయదేవ్ గారు తెలుగు కథా సాహిత్యంలో ఒక ముద్రతో తన స్థానాన్ని నిలుపుకోగలుగుతారని చెప్పడానికి ఈ ఒక్క కథ చాలు. దళితుల్లో తిరగబడే చైతన్యం రానంతవరకు తమ మాన ప్రాణాలు పోగొట్టుకోవడం తప్పదు. ఎప్పుడైతే తిరగబడే చైతన్యం వచ్చిందో అప్పుడు మాత్రమే వాళ్ళు మనుషులుగా బతకగలుగుతారనే సందేశాన్ని ఇచ్చిన మరో గొప్ప

కథ ఇది. ఈ కథలో వాడిన రాయలసీమ భాషలో సజీవత్వం తొణికిసలాడుతుంది.

ఇంట్లో ఏదైనా వస్తువు పోతే పని మనుషుల మీద యజమానులు తొందరపాటుతో అనుమానిస్తారని చెబుతుంది "తొందరపాటు" కథ. అసలు ఒకరి ఎంగిలి కంచాన్ని మరొకరు కడగడం అనేది దయనీయమైన పని. పని మనుషులు ఎంగిలి కంచాలను కడగటం వారి పనిలో భాగంగా ఉంటుంది. అలా కడగడం అనే ఒక్క పని కోసం వాళ్లను తల్లిలా భావించాలి. కానీ కొందరు యజమానులు వాళ్లను తమకు సేవ చేయడం కోసమే పుట్టారన్నట్లుగా ఎంతో అవమానకరంగా చూస్తుంటారు. ఇలా ఒక పని మనిషిని కేంద్రంగా చేసుకొని జయదేవ్ గారు ఈ కథను రాశారు.

ఈ కథలన్నీ చదివిన తర్వాత మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మనం గమనిస్తే ప్రతి జీవితమూ ప్రతి సంఘటన ఒక కథలా రాయొచ్చు అనిపిస్తుంది. అప్పుడే కథా సాహిత్యంలో ప్రవేశించిన వారికి కథలు ఎలా రాయాలో చెప్పడానికి ఈ కథలు మోడల్ గా పని చేస్తాయి. రచయిత శిల్పం కోసం ప్రాకులాడలేదు. తన చుట్టూ ఉన్న సమాజాన్ని చెప్పాలనుకున్నారు. మన చుట్టూ సమాజం ఎలా ఉందో గమనిస్తున్నారా? అని మనలను ప్రశ్నించినట్లుగా ఈ కథలున్నాయి. ఈ కథల్లోని తొలి కథలో ప్రధాన పాత్ర తన సంపాదన మొత్తాన్ని సైనికుల నిధికి త్యాగం చేసి మరణిస్తాడు. చివరి కథలో తన పిల్లలను పెంచి పెద్ద చేసి ఉద్యోగాల్లో పెట్టి పెళ్లిళ్లు చేసి చివరికి అతను ఎలాంటి స్థితిలో మరణించాడో తెలుపుతుంది.

జయదేవ్ గారు మన కుటుంబాల్లో నిత్యం జరిగే సత్యాలను, సమస్యలను కథలుగా మన ముందుంచారు. అవి కొంతమందికి పెద్ద సమస్యలుగా అనిపించవు. కానీ ఆ సమస్యల తీవ్రత అనుభవించిన వాళ్లకు మాత్రమే అవి పెద్ద సమస్యలని తెలుస్తుంది.

ఈ కథల్లో విద్యాసంస్థల్లో జరుగుతున్న లొసుగులను చెప్పి వాటికి తీసుకోవలసిన పరిష్కారాలను మనకు సూచిస్తున్నారు రచయిత. మనం ఎలాంటి విద్యావ్యవస్థలో ఉన్నామో గమనించమంటున్నారు. ప్రభుత్వాలు తీసుకునే కొన్ని నిర్ణయాలు, వేలాది మంది కుటుంబాలకు తోడ్పడవలసిన నిర్ణయాలు, ఒకటి రెండు కుటుంబాలకు ప్రయోజనకరంగా మారిపోతున్న విధాన నిర్ణయాలను పునఃసమీక్ష చేసుకోవలసిన అవసరాన్ని ఈ కథలు మనకు సూచిస్తున్నాయి. స్త్రీల సమస్యలను చిత్రించడంలో రచయిత ఒక తండ్రిగా ఎంతో ఆర్ద్రతతో చెబుతున్న అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తిగా కనిపిస్తారు. సమాజంలో ఉన్న వర్గాధిపత్యాన్ని, భూస్వామ్య స్వభావాన్ని ఈ కథల్లో రచయిత చాలా స్పష్టంగా చెప్పారు. ఎంతో ఉన్నత చదువులు చదివి ఉన్నతోద్యోగాలు చేస్తూ కూడా తనతో సమానంగా ఉద్యోగం చేస్తున్న స్త్రీల పట్ల పురుషులు వ్యవహరిస్తున్న తీరును, వాళ్లలో రావలసిన మార్పును చెప్పేటప్పుడు రచయిత ఒక స్త్రీవాదిలాగా కనిపిస్తారు. అంతలోనే అది స్త్రీవాదమో తిరుగుబాటో కాదని భార్యాభర్తల మధ్య ఉండవలసిన అవగాహన, సర్దుబాటు అని సూచిస్తారు.

ఈ కథలను చదవకముందు ఆచార్య జయదేవ్ గారిని ఒక పరిశోధకుడుగా, ఒక ఆచార్యుడిగా మాత్రమే చూశాను. కానీ ఈ కథలు చదివిన తర్వాత మన చుట్టూ సమాజంలో జరుగుతున్న సంఘర్షణలకు ఆయన ఎంతగా స్పందిస్తున్నారో, సంఘర్షణకు గురవుతున్నారో తెలుసుకోగలిగాను. విశ్వవిద్యాలయాల్లో జరిగే విషయాలను చెప్పేటప్పుడు ఎంతో సాధికారికంగా చెప్పగలిగారు. దీనికి కారణం ఆయన విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా ఉండి అక్కడ జరుగుతున్న అనేక విషయాలను బాగా గమనించిన అనుభవం కావచ్చు.

జానపద కథా నిర్మాణం ఈ కథల్లో ఉందని మొదట్లో అనుకున్నాం కదా. కథను మలుపు తిప్పడం కంటే సూటిగా చెప్పడం జానపద కథానిర్మాణంలో ఒక లక్షణం. అద్భుత విషయాలు అతిశయోక్తులతో

చెప్పడం కూడా జానపద కథానిర్మాణంలో అంతర్భాగమే. ఈ కథల్లో ఒక దళిత యువతి మహా దుర్మార్గుడైన భూస్వామిని చంపే ప్రణాళిక వేయడం ఆమె ప్రదర్శించిన అద్భుత సాహసానికి నిదర్శనం. ఈ కథ చదువుతూ ఉంటే ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి "ఊర బావి" కథలో చిదంబరం భార్య గుర్తుకొస్తుంది. మహాభారతం నర్తనశాలలో సైరంధ్రి తన భర్త భీముడితో ప్రణాళిక వేసి కీచకున్ని చంపించిన ఘట్టం గుర్తుకొస్తుంది.

ఈ కథలన్నీ చదివిన తర్వాత ఆ కథల్ని మరిచిపోయి వాటి సారాన్ని, ఆ తాత్వికతను గురించి ఆలోచిస్తే క్షణభంగురమైన జీవితాన్ని గడపడానికి మానవుడు ఎన్ని అవతారాల్లో కనిపిస్తున్నాడనిపిస్తుంది. తొలి కథలోని ఆ తాత్విక ప్రతిపాదనకు నిరూపణలుగా మిగతా కథలన్నీ చిన్న చిన్న సంఘటనలుగా ఉన్నాయేమో అనిపిస్తుంది. చివరి కథలో అన్నీ ఉండి అందరూ ఉండి అనాయాస మరణాన్ని పొందలేకపోయిన మానవుడు కథకు సంబంధించిన పాత్ర మాత్రమే కాదేమో అనిపిస్తుంది. రచయిత ఇవ్వబోయే సందేశం నిగూఢంగా పెట్టారేమో అనిపిస్తుంది.

ఈ కథల్లో కథను చెప్పడంలో బిగువు కనిపిస్తుంది. సూటిదనం కూడా ఉంది. కానీ కథలను మలుపు తిప్పడంలో, ముందు వెనుకలు పెట్టడంలో, సంఘర్షణలను చిత్రించడంలో, వర్ణనలను చేయడంలో దృష్టి సారిస్తే బాగుంటుంది.

ఆచార్య జయదేవ్ గారు ప్రచురిస్తున్న కథల్లో ఇది రెండవ సంపుటి. ఆయన భవిష్యత్తులో రాయబోయే కథల్లో మరింత శిల్ప నైపుణ్యాన్ని సాధిస్తారని ఆశిస్తున్నాను.

ఈ కథలు చదివి నాలుగు మాటలు చెప్పడానికి అవకాశం కల్పించిన ఆచార్య జయదేవ్ గారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

కథల వరుస క్రమం

పిసినారి దాతృత్వం

రామారావు రాఘవరావు మంచి మిత్రులు. చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు. ఒకే ఆఫీసులో పని చేస్తున్నారు. ఒకే దగ్గర ఇల్లు కట్టుకున్నారు. రామారావుకు కొంత సాహిత్య పరిజ్ఞానముంది. అతనికి వేమన చాలా ఇష్టమైన కవి. మాట్లాడేటప్పుడు సందర్భానుసారంగా వేమన పద్యాలను చెబుతూ ఉంటాడు. ప్రతిరోజు సాయంత్రం వాళ్ళిద్దరూ కలుసుకొని అనేక విషయాల గురించి మాట్లాడుకుంటూ ఉంటారు. వారి మాటల్లో ఊర్లో విషయాలు, కాలనీలో విషయాలు, వాళ్ళ ఆఫీసులో విషయాలు, జాతీయ అంతర్జాతీయ అంశాలు దొర్లుతూ ఉంటాయి. వాళ్ళ ఆఫీసులో పని చేస్తున్న వెంకట్రావ్ అనే వ్యక్తి అంతకు ముందు రోజే చనిపోయాడు. వెంకట్రావ్ పరమ పిసినారిగా ప్రసిద్ధి పొందినవాడు. అతనికి పెళ్లి కాలేదు, ఒంటరివాడు, అతనికి ఎవరూ లేరు, ఆఫీస్ లో వాళ్లే కలిసి అతనికి అంత్యక్రియలు నిర్వహించారు. అతన్ని గురించి మిత్రులిద్దరూ ఆరోజు సాయంకాలం మాట్లాడుకుంటున్నారు.

"మన పిసినారి వెంకట్రావ్ బ్యాంక్ అకౌంట్ లో చాలా డబ్బు ఉంటుంది. వెంకట్రావు 30 సంవత్సరాలకు పైగా కాలం నుంచి ఉద్యోగం

చేస్తున్నాడు. అతనికి పీ.ఎఫ్ గా కూడా చాలా డబ్బు వస్తుంది. ఈ డబ్బంతా ఏమైపోతుంది, ఎవరి పరమవుతుంది? నీకేమైనా తెలుసా రామారావ్'' అన్నాడు రాఘవరావ్

"ఒక విషయం మాత్రం తెలుసు, ఆ డబ్బు నీకు గానీ నాకు గానీ రాదు. మరింక ఎవరికి పోతే మనకేమిటి? ఆ డబ్బు ఎవరికి పోతుందో బ్యాంకు వాళ్ళను అడగాలి, వాళ్లే చెప్పగలరు''. అన్నాడు రామారావ్.

"నిజమే బ్యాంకు వాళ్ళను అడగాలి, కానీ ఒరే రామారావ్, వెంకట్రావ్ లాంటి పిసినారి మరింక ఎవరూ ఉండరు. నేను అలాంటి పిసినారిని గురించి ఇంతవరకు వినలేదు, కనలేదు. పిసినారి సంఘమంటూ ఒకటి ఉంటే దానికి మన వెంకట్రావ్ ను అధ్యక్షునిగా చేయవచ్చు. అంతటి మహానుభావుడు మన వెంకట్రావ్. అతని పిసినారితనం గురించి కథలు కథలుగా ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా చెప్పుకుంటూ ఉంటారు. అతని పేరుతో బ్యాంక్ అకౌంట్ లో వేసిన జీతంలో ఇంతవరకు ఒక్క రూపాయి కూడా వెంకట్రావ్ డ్రా చేయలేదట. అతని జీతం మొత్తం బ్యాంకు అకౌంట్ లోనే ఉందట. అతనికి పిత్రార్జితంగా కొంత పొలం వాళ్ళ గ్రామంలో ఉందట. ఆ పొలం మీద వచ్చిన కౌలు డబ్బుతో అతను తన రోజువారి ఖర్చులు సరిపెట్టుకుంటూ ఉంటాడట. అతనికి రోజు వారి ఖర్చంటూ ఏదీ లేదు. నెలకు ఒకసారి ఇంటి అద్దె మాత్రం కట్టాలి. అదే అతని ఖర్చు, మిగిలిన ఏ ఖర్చూ అతనికి లేదు. అతని జీతం మొత్తం అతని అకౌంట్లో ఇప్పటికి ఒక కోటి రూపాయలకు పైగా ఉంటుంది. ఇప్పుడు ఆ డబ్బు ఎవరికి పోతుందో గాని వాళ్ళు చాలా అదృష్టవంతులు రా'' అన్నాడు రాఘవరావ్.

"ఆ అదృష్టవంతులం నువ్వు నేను మాత్రం కాదు. వెంకట్రావ్ పిసినారితనం గురించి నాకు గూడా కొంత తెలుసు. వెంకట్రావ్ తాను సంపాదించిన డబ్బును తన కోసం ఖర్చు పెట్టుకోలేదు. బంధువులకు గానీ, స్నేహితులకు గానీ, ఇతరులకు గానీ ఖర్చు పెట్టలేదు, దానధర్మాలు

చేయలేదు. ఇలాంటి వాళ్ళ డబ్బు వాళ్ళు చనిపోయిన తర్వాత చివరకు ఏ దారిన పోయే దానయ్య పరమో అవుతుంది. ఇలాంటి పిసినారి వాళ్ళను గురించే వేమన ఏనాడో మంచి పద్యాల్లో ఇలా చెప్పాడు.

"ధనము కూడబెట్టి ధర్మంబు సేయక
తాను తినక లెస్స దాచు లోభి
తేనెటీగ కూర్చి తెరువరికియ్యదా
విశ్వదాభిరామ వినురవేమ"

"తాను కుడువలేడు తగవేది
యాప్తుల చేరనీయడట్టి చెనటి పశువు
చేనులోన బొమ్మ చేసి కట్టినయట్లు
విశ్వదాభిరామ వినురవేమ"

వెంకట్రావ్ తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకట, వాళ్లు తమ సొంత ఊర్లోనే ఉండి చనిపోయారు. వాళ్లు గనక వెంకట్రావ్ దగ్గరికి వచ్చి ఉంటే వృద్ధాప్యంలో వాళ్లకు సరిగ్గా తిండి గూడా పెట్టకుండా ఆకలితో మాడ్చి చంపేవాడు మన వెంకట్రావ్. వాళ్లు చనిపోయిన తర్వాత వారి అంత్యక్రియలకు కూడా అతను డబ్బు ఖర్చు పెట్టేవాడు కాదు. తల్లిదండ్రులు చనిపోయినందుకు కాకుండా వారి అంత్యక్రియలకు డబ్బు ఖర్చు చేయవలసి వస్తుందని బాధపడే రకం మన వెంకట్రావ్. ఇలాంటి వాళ్ళను గురించే వేమన చెప్పిన పద్యం ఇంకొకటి గుర్తుకు వస్తూ వుంది.

"పిసిని వాని ఇంట పీనుగు వెడలిన
కట్టె కోలలకును కాసులిచ్చి
వెచ్చమాయె ననుచు వెక్కివెక్కి మరేడ్చురా
విశ్వదాభిరామ వినురవేమ"

అన్నాడు రామారావ్.

"పిసినిగొట్టుల గురించి వేమన చెప్పిన పద్యాలు చాలా బాగున్నాయ్ రా రామారావ్. నువ్వు గుర్తుపెట్టుకొని ఆ పద్యాలను ఇప్పుడు చెప్పడం మరింత బాగుంది. వెంకట్రావ్ పిసినారితనం గురించి తెలుసుకున్న ఆడపిల్ల తల్లిదండ్రులు అతనికి పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. అందుకనే అతను పెళ్లి కాకుండా ఒంటరిగా మిగిలిపోయాడట'' అన్నాడు రాఘవరావ్.

"వెంకట్రావ్ ఏనాడు కూడా ఇంట్లో వంట చేసుకున్న పాపాన పోయిన వాడు కాదు. అతను ఆఫీస్ కు నడిచి వచ్చి నడిచి వెళ్ళేవాడు. అతను ఆఫీసుకు రెండు గంటల ముందు అంటే ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయలుదేరుతాడు. అతని దగ్గర ఉన్న చేతిసంచిలో ఒక అల్యూమినియం బాక్స్ ఉంటుంది. వెంకట్రావ్ వచ్చే దారిలో సాయిబాబా గుడి, శివాలయం, రామాలయం, ఆంజనేయ స్వామి గుడి మొదలైన గుళ్ళు ఉన్నాయి. వెంకట్రావు ఆ గుళ్ళన్నింటినీ దర్శిస్తాడు. మొదటి రెండు గుళ్ళలో అక్కడ భక్తులు, పూజారులు పెట్టే నైవేద్యాన్ని, ప్రసాదాన్ని ఉదయం పూట తీసుకునే అల్పాహారంగా (టిఫిన్ గా) స్వీకరిస్తాడు. ఆ తర్వాత రెండు లేక మూడు గుళ్ళలో పెట్టిన ప్రసాదాన్ని, నైవేద్యాన్ని తన దగ్గర ఉన్న బాక్సులో పెట్టించుకుని ఆఫీసులో మధ్యాహ్నం భోజనం గా చేస్తూ ఉంటాడు. మళ్ళీ సాయంత్రం ఆఫీసు నుంచి బయలుదేరి ఇంటికి వెళ్తూ అన్ని గుళ్ళను దర్శించి ఆ గుళ్ళలో పెట్టే ప్రసాదాన్ని , నైవేద్యాన్ని రాత్రి భోజనంగా స్వీకరిస్తాడు. ఈ విధంగా వెంకట్రావ్ తన ఇంట్లో కష్టపడి వంట చేసుకోకుండా దేవాలయాల వల్ల సులభంగా తన భోజన కార్యక్రమాన్ని కొనసాగించాడు'' అన్నాడు రామారావ్.

"వెంకట్రావ్ కనిపెట్టిన ఈ పద్ధతి చాలా బాగుందిరా, చాలా మంది భిక్షగాళ్ళు గుళ్ళలో పెట్టే నైవేద్యాలతో భక్తులు పెట్టే ప్రసాదాలతో తమ కడుపు నింపుకొంటూ ఉంటారు. అలాగే మన వెంకట్రావ్ కూడా భిక్షగాళ్ళ మాదిరిగా తన కడుపు నింపుకుంటున్నాడన్నమాట. అంతేకాదు వెంకట్రావ్

ఏనాడు సొంత డబ్బులు పెట్టి టీ గూడా తాగలేదు. ఇతరులకు తాపలేదు. ఇతరులు ఇప్పించినా తాగేవాడు కాదు.

అతని పిసినారితనాన్ని గురించి ఆఫీసులో వాళ్ళందరూ చమత్కారంగా మాట్లాడుకుంటూ ఉంటారు. అతని మీద అతని ఎదురుగా జోకులు వేస్తూ ఉంటారు. అయితే వెంకట్రావు ఏనాడు కూడా వారి మీద కోప్పడడం గానీ ఎదురు సమాధానం చెప్పడం కానీ చేయలేదు. వారి మాటలు వింటూ మౌనంగా అక్కడి నుంచి వెళ్ళిపోయేవాడు. ఆఫీసులో వాళ్లు అతని ప్రవర్తనతో విసిగిపోయి అతని గురించి అతని పిసినారితనం గురించి మాట్లాడుకోవడం మానేశారు'' అన్నాడు రాఘవరావ్.

"వెంకట్రావ్ ఏనాడు కూడా కొత్త బట్టలు కొన్నవాడు కాదు. అతను ఫుట్ పాత్ మీద అమ్ముతున్న సెకండ్ హ్యాండ్ బట్టలను తక్కువ ధరకు కొనుక్కునేవాడు. తన బట్టలను తానే ఉతుక్కునేవాడు. ఇస్త్రీ చేసుకునేవాడు కాదు. అతను స్నానానికి సబ్బు కూడా వాడేవాడు కాదట, పళ్ళు తోముకో వడానికి టూత్ బ్రష్ టూత్ పేస్టు కూడా వాడే వాడు కాదు. సాయి బాబా గుడి దగ్గర తెచ్చుకున్న బూడిదతో వేలితో పళ్ళు తోముకునేవాడు'' అన్నాడు రామారావ్.

"అతనికి ఒక డొక్కు పాత సైకిలుంది. అతను ఎక్కడికి వెళ్ళాలన్నా ఆ సైకిల్ మీదనే వెళ్ళేవాడు. ఏనాడూ బస్సు గూడా ఎక్కలేదట'' అని రాఘవరావు చెప్పాడు.

ఇలా మిత్రులిద్దరూ చనిపోయిన వెంకట్రావ్ పిసినారితనం గురించి మాట్లాడుకుని మరుసటి రోజు బ్యాంకుకు వెళ్లి వెంకట్రావ్ అకౌంట్లో ఉన్న డబ్బులు ఎవరికి వెళ్ళేది తెలుసుకోవాలని నిర్ణయించు కున్నారు.

అనుకున్నట్లుగానే వాళ్ళిద్దరూ మరుసటి రోజు బ్యాంకుకు వెళ్లి మేనేజర్ ను కలుసుకొని తమ ఆఫీస్ లో పని చేసే వెంకట్రావ్ చనిపోయాడని, తమకు తెలిసినంతవరకు అతనికి బంధువులు గానీ వారసులు గానీ

ఎవరూ లేరని, అతని అకౌంట్ లోని డబ్బులు ఎక్కడికి వెళ్తాయో తెలుసుకోవాలని ఉందని మేనేజర్ ను అడిగారు. బ్యాంకు మేనేజరు వెంకట్రావ్ గారి అకౌంట్ లోని డబ్బులు మొత్తం భారతదేశ సైనిక నిధికి వెళ్ళిపోతాయని చెప్పాడు. మిత్రులిద్దరూ ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టి కాసేపటి తర్వాత ఆశ్చర్యం నుంచి తేరుకుని అలా ఎందుకు వెళ్తాయి అని అడిగారు. దానికి బ్యాంక్ మేనేజర్ ఒక కాగితాన్ని తీసి వారికి ఇచ్చాడు. అది వెంకట్రావు రాసిన కాగితం. అందులో ఇలా ఉంది.

బ్యాంకు మేనేజర్ గారికి,

నా అకౌంట్ లోని డబ్బు మొత్తాన్ని భారతదేశ సైనిక నిధికి విరాళంగా ఇస్తున్నాను. మన సైన్యం దేశ సరిహద్దుల్లో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి దేశాన్ని రక్షిస్తున్నారు. వారి కారణంగానే దేశంలోని ప్రజలందరూ సుఖంగా సంతోషంగా ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా ఆస్తిపాస్తులతో జీవిస్తున్నారు. అలాంటివారి త్యాగం విలువ కట్టలేనిది, వారికి ఎంత డబ్బు ఇచ్చినా వారి రుణం తీర్చుకోలేనిది, నేను ఉడతా భక్తిగా నా దగ్గరున్న డబ్బు మొత్తాన్ని వారి నిధికి విరాళంగా ఇస్తున్నాను. అంతేకాకుండా నాకు వచ్చే పీ.ఎఫ్ డబ్బు మొత్తాన్ని కూడా సైనికనిదికే విరాళంగా ఇస్తున్నాను. కాబట్టి దయచేసి నా మరణానంతరం నా అకౌంట్ లోని డబ్బును, నాకు వచ్చే పీ.ఎఫ్ మొత్తాన్ని భారతదేశ సైనిక నిధికి పంపవలసిందిగా కోరుతున్నాను.

ధన్యవాదాలతో భవదీయుడు

వెంకటరావు

ఆ ఉత్తరాన్ని చదివిన తర్వాత మిత్రులిద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు. వెంకట్రావ్ పిసినారి వాడని, తల్లిదండ్రులకు కూడా పట్టెడన్నం పెట్టలేని దుర్మార్గుడని, భిక్షగాళ్ళ లాంటివాడని, పనికిమాలిన వాడని అంతవరకు అనుకుంటున్న ఆ మిత్రులిద్దరూ ఆ ఉత్తరం ద్వారా అతని గొప్పతనాన్ని తెలుసుకొని చాలా ఆశ్చర్యపోయారు. తాను సంపాదించిన

డబ్బులో ఒక్క రూపాయి కూడా తన కోసం ఖర్చు పెట్టుకోకుండా జీతం మొత్తాన్ని వెంకట్రావ్ సైనికనిధికి విరాళంగా ఇవ్వడం వారు కలలో కూడా ఊహించని పరిణామం. తాము తమ తోటి వాళ్ళందరూ తాము సంపాదించే డబ్బును తమకు తమ కుటుంబ సభ్యులకు మాత్రమే ఖర్చు పెడుతూ సమాజ అవసరాలకు విరాళాలు ఇవ్వకుండా స్వార్థంతో బతుకుతున్న తమను వెంకట్రావుతో పోల్చుకొని వాళ్ళు ఎంతో సిగ్గుపడ్డారు. డబ్బు కోసం దేశాన్ని తాకట్టు పెట్టేవారు, దేశాన్ని అమ్మేవారు ఎంతోమంది ఉన్న యీదేశంలో సైనికుల గొప్పతనాన్ని వారి త్యాగాన్ని గుర్తించి తన సర్వస్వాన్ని తృణప్రాయంగా వారి నిధికి విరాళంగా ఇచ్చిన వెంకట్రావ్ దాతృత్వానికి వారు చలించి పోయారు. వెంకట్రావ్ అకస్మాత్తుగా వారి దృష్టిలో హిమాలయ పర్వతమంత ఎత్తుకు ఎదిగిపోయాడు. అతని గురించి తక్కువ చేసి మాట్లాడుకున్నందుకు చాలా పశ్చాత్తాపం చెందారు. మిత్రులిద్దరూ మౌనంగా వెంకట్రావు రాసిన కాగితాన్ని బ్యాంకు మేనేజర్ కు ఇచ్చి అతనికి నమస్కరించి ఆఫీసుకు వచ్చి, అప్పటికప్పుడు అందరినీ సమావేశపరచి వెంకట్రావ్ తన అకౌంట్లోని డబ్బు మొత్తాన్ని భారతదేశ సైనిక నిధికి విరాళంగా ఇచ్చిన విషయాన్ని అందరికీ చెప్పారు. ఆఫీస్ లో వాళ్ళందరూ ఎంతగానో ఆశ్చర్యపోయారు. పిసినారిగా ఆఫీసులోని వారందరి హేళనకు గురి అయిన వెంకట్రావ్ గొప్పతనాన్ని గురించి అతని త్యాగాన్ని గురించి, దాతృత్వాన్ని గురించి అందరూ ప్రశంసిస్తూ ఉపన్యసించారు.

ఆ తర్వాత రాఘవరావు రామారావు లిద్దరు వెంకట్రావ్ చిన్నదినాన్ని పెద్దదినాన్ని తమ డబ్బుతో గొప్పగా చేశారు. అంతేకాకుండా అతని అస్థికల మీద సమాధి కట్టి దానిమీద “తన జీతం డబ్బులో సొంతం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా దాచిపెట్టి, ఆ డబ్బు మొత్తాన్ని, తనకు వచ్చిన పీ.ఎఫ్ మొత్తాన్ని భారతదేశ సైనిక నిధికి విరాళంగా ఇచ్చిన మహాదాత, మహాత్యాగి వెంకట్రావు గారి సమాధి ఇది” అని శిలాఫలకం మీద రాయించారు.

ఆడపిల్ల పుట్టిందని

“మొదటి కాన్పు రెండవ కాన్పు కూడా ఆడపిల్లనే కన్నావు. ఇది మూడో కాన్పు. ఈ కాన్పులో నువ్వు మొగపిల్లోన్నే కనాల. ఆడపిల్లను కనగూడ్దు. నాకు మొగపిల్లోడే కావాల, వారసుడు కావాల, మొగపిల్లోన్ని కంటేనే నువ్వు మా ఇంటికి రా. లేకపోతే రానే వద్దు, ఆడపిల్లను కంటే నువ్ అవసరమే లేదు. నిన్ను వదిలేసి నేను మల్లా పెళ్లి చేసుకుంటా. నువ్ పుట్టింట్లో ఉంటావో సచ్చావో బతుకుతావో నేను పట్టించుకోను” అని పుల్లారెడ్డి తన భార్య నాగలక్ష్మితో చాలా గట్టిగా, ఖచ్చితంగా చెప్పాడు.

ఏడో నెల గర్భంతో ఉన్న నాగలక్ష్మిని కాన్పుకు పుట్టింటికి తీసుకొని పోవడానికి వచ్చిన తండ్రితో ఆమె బయలుదేరుతున్నప్పుడు పుల్లారెడ్డి ఆమెతో పై మాటలు చెప్పాడు. ఆమె మారు మాట్లాడలేదు. భర్తకు ఏం చెప్పాలో ఆమెకు అర్థం కాలేదు. ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ అయోమయంగా తల ఆడించింది.

సుబ్బారెడ్డి వెంకటమ్మ దంపతుల కుమార్తె నాగలక్ష్మి. ఆమెకు ఒక తమ్ముడున్నాడు. గోపాల్. వాళ్ళు ఉన్నది బాగా పల్లెటూరు. చదువుకోవడానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వేరే ఊరికి వెళ్లాలి. అది ఇష్టం లేని సుబ్బారెడ్డి నాగలక్ష్మిని చదివించలేదు. నాగలక్ష్మే కాదు ఆవూర్లో దాదాపు ఏ అమ్మాయి చదువుకోలేదు. గోపాల్ సైకిల్ మీద బడికి వెళ్ళి వస్తుంటాడు.

సుబ్బారెడ్డి దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాడు. అతనికి ఐదు ఎకరాల పొలముంది. అది పూర్తిగా వర్షాధారం. అందువల్ల అది పండేది తక్కువ, ఎండేది ఎక్కువ. భార్యాభర్త ఇద్దరు తమ పొలంలో ఆరుగాలం కష్టపడి పనిచేసినా అందులో వచ్చిన ఆదాయం చాలా తక్కువ. నాగలక్ష్మి చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల కష్టాలను చూస్తూ పెరిగింది. తాను కూడా ఇంటి పని పొలం పని చిన్నప్పటి నుంచి చేస్తూనే ఉంది. ఆమె చాలా మెతక. ఎవరిని ఎదిరించి మాట్లాడేది కాదు. ఎవరేమన్నా తలదించుకుని పోయేది. ఆ ఊర్లో చాలా మంచి అమ్మాయిగా ఆమెకు చాలా మంచి పేరుంది.

నాగలక్ష్మి పెళ్ళీడుకు వచ్చిన తర్వాత తమకున్నంతలో కట్న కానుకలు ఇచ్చి సుబ్బారెడ్డి ఆమెను తమ ఊరికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుల్లారెడ్డికి ఇచ్చి పెళ్లి చేశాడు. పుల్లారెడ్డి తన తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. ఒక్కడే కొడుకు కావడం వల్ల అతన్ని తల్లిదండ్రులు గారాబంగా పెంచారు. దానితో పుల్లారెడ్డి పెంకిగా తయారయ్యాడు. చదువులేదు, వారికి పది ఎకరాల పొలం ఉంది. తల్లిదండ్రులు కష్టపడుతున్నా అతను ఏనాడు కష్టపడి పని చేసిన వాడు కాదు.

పెళ్లయిన కొత్తలో నాగలక్ష్మిని ఆమె భర్త, అత్తమామలు బాగానే చూసుకున్నారు. ఆమె వినయ విధేయతలు, కష్టపడి పనిచేసే విధానం, పొదుపరితనం వాళ్లకు బాగా నచ్చాయి. అందువల్ల వాళ్ళు ఆమెను మంచిగానే చూసుకున్నారు. రెండు సంవత్సరాల తర్వాత ఆమె గర్భవతి అయింది.

భర్త,అత్తమామలు బాగా సంతోషించారు. తమకున్నది ఒక్కడే కొడుకు కాబట్టి తమ వంశానికి వారసుడు కావాలని ఆమె అత్తమామలు తమకు మనుమడు కలగాలని కోరుకున్నారు. పుల్లారెడ్డి కూడా తనకు కొడుకు పుట్టాలని, పుడతాడని అనేక ఆశలు పెట్టుకున్నాడు. భర్త, అత్తమామల కోరికలు నాగలక్ష్మి గమనిస్తూనే ఉంది. వారి ఆశ, కోరిక చూసిన తర్వాత తనకు కుమారుడే కలగాలని నాగలక్ష్మి కూడా అనేక మంది దేవతలను వేడుకుంది. అయితే కొడుకు పుట్టడం కూతురు పుట్టడం అనేది తమ చేతుల్లో లేదని ఆమె అనుకుంటూ ఉంది. ఆ విషయం భర్తతో గాని అత్తమామలతో గాని ఆమె చెప్పలేదు. తనకు కొడుకు కాకుండా కూతురు పుడితే భర్త అత్తమామలు ఏమంటారో అని ఆమె భయపడుతూ వుంది.

నాగలక్ష్మికి ఏడు నెలలు వచ్చినప్పుడు సుబ్బారెడ్డి ఆమెను కాన్పుకు పుట్టింటికి తీసుకొని వెళ్ళాడు. ఆమెను పట్నంలో ఉన్న ఆసుపత్రికి తీసుకొని వెళ్లి అక్కడ లేడీ డాక్టర్ కు చూపించి ఆమె చెప్పిన జాగ్రత్తలన్నీ పాటించారు. మందులు వాడారు. నవమాసాలు నిండిన తర్వాత నాగలక్ష్మి భయపడు తున్నట్లుగానే ఆడపిల్ల పుట్టింది. ఆడపిల్ల పుట్టినందుకు ఆమె చాలా విచారించింది. అత్తమామల కోరిక, భర్త కోరిక ఆమె తల్లిదండ్రులకు చెప్పి ఆడపిల్ల పుట్టినందుకు వాళ్ళు ఏమంటారో అని భయపడుతూ ఉంది. తల్లిదండ్రులు ఆమెను ఓదార్చారు. సుబ్బారెడ్డి అల్లునికి, వియ్యాల వారికి ఆడపిల్ల పుట్టినట్లుగా తెలియజేశాడు. వాళ్ళు చాలా నిరాశ పడ్డారు. ఆడపిల్లను కనడం నాగలక్ష్మి తప్పన్నట్లుగా ఆమెను నిందించడం మొదలు పెట్టారు. భర్త, అత్తమామలు ఒకసారి వచ్చి పాపను చూసి వెళ్లారు. మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టినా రెండవ కాన్పుకైనా మగ పిల్లవాడు పుడతాడని వాళ్ళు ఆశిస్తూ వుండిపోయారు.

తనకు సంతానం కలిగిందన్న ఆనందం గానీ, సంతోషం గానీ లేకుండా అనాసక్తిగా పుల్లారెడ్డి అత్తవారింటికి వచ్చి నాగలక్ష్మిని పాపను తన ఇంటికి తీసుకొని వెళ్ళాడు. అంతవరకు బాగానే చూసుకున్న

అత్తమామలు, భర్త ఇప్పుడు నాగలక్ష్మిని మెల్లమెల్లగా సాధించడం మొదలు పెట్టారు. సూటిపోటి మాటలతో ఆమెను బాధ పెడుతున్నారు. నాగలక్ష్మి మారు మాట్లాడకుండా వాటిని సహిస్తూ ఉంది.

ఇలా రెండు సంవత్సరాలు గడచేటప్పటికీ నాగలక్ష్మి మళ్లీ గర్భవతి అయింది. అత్తమామలు భర్త కొంత సంతోషించి ఆమెను బాధ పెట్టడం మానేశారు. ఈసారైనా తప్పకుండా కొడుకును కనాలని ఆమెకు మళ్లీ మళ్లీ చెప్పడం ప్రారంభించారు. ఆమె అలాగే అని తల ఊపేది. కానీ కొడుకును కనాలంటే ఏం చేయాలో ఆమెకు తెలియలేదు. అత్తమామలతో భర్తతో వాదించకుండా వారు చెప్పిన మాటలకు తల ఊపటం చేస్తూ ఉంది.

నాగలక్ష్మికి ఏడవ మాసం రాగానే సుబ్బారెడ్డి ఆమెను కాన్పుకు తన ఇంటికి తీసుకొని వచ్చాడు. నవమాసాలు నిండిన తర్వాత ఆమెకు మళ్లీ అమ్మాయి పుట్టింది. నాగలక్ష్మి చాలా బాధపడింది. ఆమె తల్లిదండ్రులు కూడా చాలా బాధపడ్డారు. నాగలక్ష్మికి ఏం చేయాలో బొత్తిగా తోచలేదు. తన భర్త, అత్తమామలు తన పట్ల ఎలా ప్రవర్తిస్తారో అని చాలా దిగులుతో దుఃఖంతో ఉంది.

సుబ్బారెడ్డి ఆడపిల్ల పుట్టిన విషయాన్ని వియ్యాలవారికి,అల్లునికి భయపడుతూనే తెలియజేశాడు. వాళ్ల నాగలక్ష్మిని తిట్టడం ప్రారంభించారు. ఎన్నో రకాలుగా బ్రతిమాలుతూ సుబ్బారెడ్డి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. కానీ వాళ్ళు ఏమాత్రం సమాధానం పడలేదు. ఆడపిల్లను కనటం పూర్తిగా నాగలక్ష్మి చేసిన పెద్ద నేరం అన్నట్లుగా వాళ్ళు మాట్లాడారు. పాపను చూడ్డానికి గూడా వాళ్ళు ఎవరూ రాలేదు. నాగలక్ష్మి దుఃఖానికి అంతులేకుండా ఉంది. తనకు ఆడపిల్ల పుట్టడంలో తన తప్పు ఏమిటో ఆమెకు అర్థం కాలేదు. తనకు ఆడపిల్ల పుట్టడం తన తప్పా? అని ఆమె లేడీ డాక్టర్ ను అడిగింది. ఆడపిల్లా? లేక మగ పిల్లవాడా? అని నిర్ణయించేది

తండ్రే కానీ తల్లి కాదని, ఆడపిల్లను కనడం ఆమె తప్పు కాదని డాక్టరు స్పష్టంగా చెప్పింది. కానీ ఆ విషయాన్ని భర్తకు గాని అత్తమామలకు గాని చెప్పే ధైర్యం నాగలక్ష్మికి లేవు.

నాగలక్ష్మిని తీసుకొని పోవడానికి ఆమె భర్త గానీ, అత్తమామలు గానీ ఎవరూ రాలేదు. చిన్న పాపకు ఏడవ నెల వచ్చిన తర్వాత సుబ్బారెడ్డి నాగలక్ష్మిని పాపను తీసుకుని ఆమె అత్తవారింటికి వెళ్లాడు. పుల్లారెడ్డి గానీ అతని తల్లిదండ్రులు గానీ సుబ్బారెడ్డితో ఏమీ మాట్లాడలేదు. సుబ్బారెడ్డి తానుగా కలుగజేసుకొని ఆడపిల్ల మగ పిల్ల అనేది మనుషుల చేతిలో ఏమీ లేదని అది భగవంతుడు నిర్ణయించేదని అందువల్ల ఆడపిల్లను కన్నడంలో నాగలక్ష్మి తప్పు ఏమీలేదని సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. కానీ అతని మాటలు వాళ్ళు వినదల్చుకోలేదు. చేసేదిలేక సుబ్బారెడ్డి మౌనంగా విచారంతో తన ఊరికి వచ్చాడు.

నాగలక్ష్మి పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. అత్తమామలు ఆమెను చీటికిమాటికి తిడుతూ మాటలతో హింసిస్తూ ఉన్నారు. భర్త పుల్లారెడ్డి మగ పిల్లవాన్ని కనలేని ఆడదానివి నువ్వు ఉంటే ఎంత పోతే ఎంత అని ఆమెను కొట్టడం ప్రారంభించాడు. పెద్ద పాప పట్ల ఆమె అత్తమామలు కొంత సానుకూలంగా వున్నా, చిన్న పాప పట్ల వాళ్లు చాలా తిరస్కారంగా ఉంటున్నారు. చిన్న పాప ఆలనా పాలన పూర్తిగా నాగలక్ష్మే చూసుకోవాల్సి వచ్చింది. ఇంట్లో పని అంతా నాగలక్ష్మే చేయాలి. ఏ చిన్న పొరబాటు జరిగినా ఆమె అత్త నాగలక్ష్మిని తిడుతూ కొడుతూ ఉంది. ఈ హింసలన్నీ నాగలక్ష్మి ఎలాంటి ప్రతిఘటనా లేకుండా మౌనంగా భరిస్తూ ఉంది.

ఇలా ఉండగా ఆమె మూడోసారి గర్భవతి అయింది. నాగలక్ష్మి అత్తమామలు, భర్త ఈసారైనా తప్పనిసరిగా కొడుకును కనాలని తరచుగా ఆమెను హెచ్చరిస్తూ ఉన్నారు. నాగలక్ష్మి మౌనంగా తల ఊపుతూ ఉంది. ఆమెకు ఏడవ నెల వచ్చినప్పుడు సుబ్బారెడ్డి నాగలక్ష్మిని పుట్టింటికి

తీసుకొని వెళ్లడానికి వచ్చాడు. ఆమెను తండ్రి వెంట పంపుతూ పుల్లారెడ్డి ఎట్టి పరిస్థితుల్లోనూ కొడుకునే కనాలని లేకపోతే ఆమె తనకు అవసరం లేదని, తన ఇంటికి రానివ్వనని చాలా గట్టిగా సుబ్బారెడ్డి ఎదురుగానే చెప్పాడు. పుల్లారెడ్డి మొదటి కూతురును తమ వద్దనే ఉంచుకొని రెండవ కూతురును భార్య వెంట పంపించాడు.

నాగలక్ష్మి పుట్టింటికి వచ్చిన తర్వాత తనకు మగ పిల్లవాడు పుట్టాలని ఆమె అనేక దేవతలకు ప్రతిరోజు ప్రతిక్షణం మొక్కుకుంటూ ఉంది. నవమాసాలు నిండిన తర్వాత ఆమెకు మళ్ళీ ఆడపిల్ల పుట్టింది. నాగలక్ష్మి దుఃఖానికి అంతులేకుండా ఉంది. తన భవిష్యత్తు ఏమిటో ఆమెకు అర్థం కావడం లేదు. తనకు చావు తప్ప వేరే మార్గం లేదని అని అనుకుంటూవుంది. ఆమె తల్లిదండ్రులు కూడా మూడోసారి ఆడపిల్ల పుట్టినందుకు చాలా దుఃఖించారు. సుబ్బారెడ్డి భయపడుతూనే వియ్యంకునికి అల్లునికి ఆడపిల్ల పుట్టినట్లుగా ఫోన్ చేసి చెప్పాడు. వాళ్ళిద్దరూ తమకు నాగలక్ష్మి గానీ, పుట్టిన పాప గానీ అవసరం లేదని ఖరాకండిగా చివరి మాటగా చెప్పారు. నాగలక్ష్మికి ఏమి చేయాలో అర్థం కాక దిగులుతో దుఃఖిస్తూ వుంది. ఆమె తల్లిదండ్రులు ఆమెను అనేక రకాలుగా ఓదారుస్తూ ఆమె ఏ అఘాయిత్యానికి పాల్పడకుండా జాగ్రత్తగా చూపెట్టుకొని ఉన్నారు. ఏం చేయాలో వాళ్లకు ఏమీ తోచడం లేదు. దేవుడి మీద భారం వేసి దిగులుగా కాలం వెల్లదీస్తున్నారు.

నాగలక్ష్మి తమ్ముడు గోపాల్ ఆమె పెళ్లి నాటికి పదవ తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం అతను పట్నంలో డిగ్రీ చదువుతున్నాడు. సుబ్బారెడ్డి కొడుకును రప్పించి నాగలక్ష్మికి సంబంధించిన అన్ని విషయాలు అతనికి చెప్పాడు. గోపాల్ బాధ్యత గల వ్యక్తి, సామాజిక స్పృహ ఉన్నవాడు. అతను అక్కకు తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాడు. దిగులు పడడం, దుఃఖించడం సమస్యకు పరిష్కారం కాదని సమస్యకు పోరాటం ఒకటే మార్గమని అతను చెప్పాడు. ముఖ్యంగా అక్క నాగలక్ష్మికి అతను

ధైర్యం నూరిపోశాడు. పెద్దల పట్ల గౌరవం ఉండడం మంచిదే కానీ, దుర్మార్గుల పట్ల గౌరవం విధేయత మంచిది కాదని, అలాంటివాళ్లు విధేయతను చేతగాని తనంగా భావిస్తారని, కాబట్టి అలాంటి వారిని ధైర్యంగా ఎదిరిస్తే వాళ్ళే దారిలోకి వస్తారని అక్కకు చెప్పాడు.

నాగలక్ష్మి తమ్ముడు చెప్పిన మాటల వల్ల దిగులుపడడం మానేసింది. ధైర్యం తెచ్చుకుంది. తన సమస్యకు పోరాటం ఒక్కటే మార్గమని ఆమె గూడా అనుకుంది. దుర్మార్గులైన తన భర్తకు, అత్తమామలకు మంచితనం లాభం లేదని పోరాటం చేసి వాళ్లకు బుద్ధి చెప్పాలని ఆమె నిర్ణయించుకుంది.

అందులో భాగంగా మొదట ఆమె తనకు ఇంక పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. కూతురులో వచ్చిన మార్పుకు ఆమె తల్లిదండ్రులు సంతోషించారు. తమ్ముని సహాయంతో తల్లిదండ్రుల సాయంతో నాగలక్ష్మి భర్తతో అత్తమామలతో పోరాటానికి సిద్ధమయింది.

కూతురు

రామారావుకు కొత్తగా పెళ్లయింది. అతనికి భార్య సీత మీద వల్లమాలిన ప్రేమ. సీత అందమైనది, అణకువ గలది, భర్త మీద అతని తల్లి అన్నపూర్ణమ్మ మీద భయభక్తులు కలిగినది. సీత పరాయి అమ్మాయి కాదు, ఆమె అన్నపూర్ణమ్మ తమ్ముని కూతురు. మేనరికం, అన్నపూర్ణమ్మ అప్పుడప్పుడు తన కొడుకు సీత మీద చూపిస్తున్న ప్రేమకు అసూయ పడుతూ ఉంటుంది. అంత ప్రేమను రామారావు తన భార్య మీద చూపిస్తుంటాడు. సీత తన తమ్ముని కూతురు కావడం వల్ల అన్నపూర్ణమ్మ కూడా ఆమెను కోడలుగా కాకుండా కూతురుగా చూసుకుంటూ మురిసిపోతూ ఉంటుంది. తల్లి పైటకొంగు పట్టుకొని వెనకాల తిరిగే చిన్నపిల్ల లాగా సీత అత్తయ్య దగ్గర గారాలు పోతూ ఉంటుంది. అది అన్నపూర్ణమ్మకు రామారావుకు చాలా ఆనందంగా అందంగా ఉంటుంది. సీతా రామారావుల అన్యోన్య దాంపత్యాన్నీ, అత్తాకోడళ్ళైన అన్నపూర్ణమ్మ సీతల మధ్య గల ప్రేమానురాగాలను చూసి ఆవూర్లో వాళ్ళు ఆశ్చర్యపోతూ ఉంటారు.

అలా ఆ కుటుంబ సభ్యులు ఆనంద సాగరంలో వోలలాడుతూ ఉండగా రెండు సంవత్సరాలు ఇట్లాగే గడిచిపోయాయి.

సీత నెల తప్పింది. అన్నపూర్ణమ్మ రామారావుల ఆనందానికి హద్దు లేకపోయింది. వాళ్ళిద్దరూ సీతను ఎంతో మురిపెంగా, ముద్దుగా, జాగ్రత్తగా మంచం మీద నుంచి కాలు కింద పెట్టనివ్వకుండా చూసుకుంటున్నారు. వాళ్ళిద్దరి ప్రేమతో సీత ఉక్కిరి బిక్కిరవుతూ వుంది. ప్రాణం లాగా చూసుకుంటున్న భర్త అనురాగానికి, తల్లి కంటే ఎక్కువ ప్రేమగా చూసుకుంటున్న అత్త వాత్సల్యానికి ఆమె మురిసిపోతూ తన అదృష్టానికి పొంగిపోతూ మహదానందంగా ఉంది.

రామారావు ఉంటున్నది చిన్న పల్లెటూరు. ఆ ఊర్లో ఆసుపత్రి లేదు. రామారావు సీతను తన వూరికి కొంచెం దూరంలో ఉన్న పట్నానికి తీసుకొని వెళ్లి అక్కడి కాన్పుల ఆసుపత్రిలో ప్రతినెల చూపించి అక్కడి లేడీ డాక్టర్ చెప్పినట్లుగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటాడు. సీతకు నవ మాసాలు నిండాయి. లేడీ డాక్టర్ ఆమె ప్రసవానికి ఒక తేదీ చెప్పింది. ఆ తేదీ సమయానికి సీతను ప్రసవానికి ఆసుపత్రిలో చేర్పించాలని రామారావు అన్నపూర్ణమ్మలు నిర్ణయించుకున్నారు.

అయితే లేడీ డాక్టర్ చెప్పిన తేదీకి మూడు రోజులు ముందుగానే సీతకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. నొప్పితో ఆమె విలవిలలాడుతూ ఉంటుంది. రామారావు అన్నపూర్ణ లు ఆమె నొప్పితో బాధ పడుతూ ఉండటం చూసి తట్టుకోలేక పోతారు. అప్పటికప్పుడు రామారావు కారు ఏర్పాటు చేసుకుని సీతను పట్నంలో ఉన్న లేడీడాక్టర్ దగ్గరికి తీసుకుని వెళ్ళాడు. సీత కడుపులోని బిడ్డ అడ్డం తిరిగిందని ఆమెకు సహజమైన కాన్పు జరగదని సిజేరియన్ చేసి బిడ్డను బైటికి తీయాలని డాక్టరు చెప్పింది. అలాగే చేయమని రామారావు అన్నపూర్ణ లు డాక్టరుకు చెప్పారు. డాక్టరు సిజేరియన్ చేసి సీత కడుపులోని ఆడ శిశువును బయటికితీసింది. అయితే రక్తస్రావం ఎక్కువ కావడంతో సీత చనిపోతుంది. చనిపోయిన సీతను

చూసి రామారావు నిశ్చేస్టుడై మూర్ఛపోయాడు. కొంతసేపటికి మూర్ఛ నుంచి తేరుకున్న రామారావు చెప్పలేనంత దుఃఖానికి లోనయ్యాడు. సీత దేహం మీద పడి అతను హృదయ విదారకంగా రోదిస్తూ ఉంటాడు. ఎంతమంది ఎన్ని రకాలుగా ఓదార్చినా అతని దుఃఖానికి అంతులేకుండా ఉంటుంది. అన్నపూర్ణమ్మ కూడా ఎంతగానో బాధపడుతుంది.

సీత తల్లిదండ్రులు బంధువులు సీత పార్థివదేహాన్ని రామారావు గ్రామానికి తీసుకొని వచ్చారు. గ్రామంలోని ప్రజలు సీతను చూసి బోరున విలపించారు. సీత మంచితనాన్ని, సీతా రామారావుల ఆదర్శ దాంపత్యాన్ని, సీతా అన్నపూర్ణల సఖ్యాన్ని గురించి చెప్పుకొని బాధపడ్డారు. సీత తల్లిదండ్రులు అన్నపూర్ణమ్మ ఇంకా ఇతర బంధువులు అనేక రకాలుగా రామారావుకు చెప్పి అతని చేత సీతకు అంత్యక్రియలు నిర్వహింప జేశారు.

సీత మంచితనాన్ని సీత తన మీద చూపిన ప్రేమానురాగాలను ఆమె లేని తన జీవితాన్ని తలుచుకుని రామారావు కుమిలి కుమిలి దుఃఖిస్తుంటాడు. సీత తల్లిదండ్రులు, అన్నపూర్ణమ్మ, ఊర్లోని పెద్దలు రామారావును అనేక రకాలుగా ఓదార్చారు. వారి ఓదార్పు మాటలు రామారావును దుఃఖ సాగరం నుంచి బయటికి తీసుకుని రాలేవు. దాదాపు వారం రోజులపాటు అతను నిద్రాహారాలు లేకుండా అచేతనంగా పడి ఉంటాడు. అతని పరిస్థితిని చూసి అన్నపూర్ణమ్మ సీత తల్లిదండ్రులు ఊర్లోని వారు తల్లడిల్లిపోతారు. భార్య మీద అతనికి గల ప్రేమను, ఆమె కోసం అతను పడుతున్న దుఃఖాన్ని చూసి భార్యను ఇంత గాఢంగా ప్రేమించేవాళ్ళుంటారా అని ఆశ్చర్యపోయారు. అన్నపూర్ణమ్మ కొడుకు పరిస్థితిని చూసి అతను తనకు దక్కడేమోనని తీవ్రమైన మనస్థాపానికి గురి అవుతుంది. ఆమె కొడుకుతో ఇలా చెప్పింది.

“నాయనా సీతకు ఆయువు తీరి వెళ్ళిపోయింది. చావు పుట్టుకలు మన చేతిలో లేవు. దేవుడు ఆమె నుదుట అలా రాశాడు. విధిని ఎవరూ తప్పించలేరు. ఎంతటి వారైనా దానికి తల వొగ్గవలసిందే. చనిపోయిన

వారి వెంట మనమూ పోలేము. నువ్వు గుండె రాయి చేసుకుని మళ్లీ మామూలు మనిషివి కావాలి. ఎంతకాలమని ఇలా దుఃఖిస్తూ నీ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటావు? నువ్విలా ఉంటే నీ మీదనే ఆశలు పెట్టుకున్న నా పరిస్థితి ఏమవుతుందో ఆలోచించావా? ఈ పసిగుడ్డు, నీ కూతురు ఆలనా పాలన నువ్వు చూడాలి. చనిపోయిన సీత కోసం నువ్విలా దుఃఖిస్తూ ఉంటే పాప ఏమవుతుందో ఆలోచించు, చనిపోతూ సీత తన గుర్తుగా ఈ పాపను మనకిచ్చి వెళ్ళిపోయింది. పాప కోసమైనా నువ్వు మళ్ళీ మామూలు మనిషివి కావాలి'' అని తల్లి చెప్పింది.

“అమ్మా, ఇది పాప కాదు, నా పాలిట శని, రాక్షసి, నా దేవత సీతను నాకు దూరం చేసిన దయ్యం. పుడుతూపుడుతూ తల్లిని పొట్టన పెట్టుకున్న రాక్షసి. ఇది రాకుండా ఉంటే నేను నా సీతతో సుఖంగా ఉండేవాణ్ణి. నా యీ పరిస్థితికి కారణం ఇదే, నేను దీన్ని కూతురుగా అంగీకరించలేను'' అని రామారావు కోపంగా తల్లితో అన్నాడు.

“తప్పు నాయనా, అభంశుభం తెలియని పసిపాపను అలా నిందించకూడదు. పసిపిల్లలు దైవ స్వరూపులంటారు. దేవుడు చేసిన పనికి ఈ పాప ఎట్లా కారణమవుతుంది? అసలే ఇది తల్లి లేని పిల్ల. ఈ పసిపాపను మనం జాగ్రత్తగా పెంచితే పరలోకాన ఉన్న సీత ఆత్మ సంతోషిస్తుంది. తల్లి లేని లోటు తెలియకుండా మనం ఈ పాపను అల్లారు ముద్దుగా పెంచాలి'' అని అన్నపూర్ణమ్మ కొడుకుతో చెప్పింది.

“అమ్మా, నువ్వు ఎన్నైనా చెప్పు, నేను దీన్ని కూతురుగా భావించలేను, స్వీకరించలేను. దీని కారణంగానే నా సీత నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయింది. దీన్ని చూస్తుంటే చనిపోయిన సీత మొహమే నా కళ్ళల్లో మెదులుతూ ఉంది. దీన్ని నేను క్షమించలేను. పెంచుకుంటావో వదిలేసుకుంటావో నీ ఇష్టం. నేను మాత్రం దీన్ని స్వీకరించను. నాకు సంబంధించినంత వరకు నాకు కూతురంటూ ఎవరూ లేరు'' అని రామారావు అక్కడి నుంచి లేచి కోపంగా వెళ్లిపోయాడు.

రామారావు మాటలకు అన్నపూర్ణమ్మ హతాశురాలయింది. ఏం చేయాలో ఆమెకు ఏమీ పాలు పోలేదు. భార్య పోయిన దుఃఖంలో ఉన్నాడు కాబట్టి రామారావు అలా మాట్లాడుతున్నాడని కాలం గడిచే కొద్దీ దుఃఖం తగ్గిపోయి కూతురు మీద ప్రేమ పుట్టుకొస్తుందని ఆమె భావించింది. పాపను చూసుకోవడానికి ఒక ఆయాను ఏర్పాటు చేసింది. పాపకు ఏ లోటు లేకుండా సకల సౌకర్యాలు కల్పించింది. అన్ని జాగ్రత్తలు ఆమె తీసుకుంది. చనిపోయిన సీతకు గుర్తుగా ఉన్న పాపకు అన్నపూర్ణమ్మ సీత అని పేరు పెట్టింది. నామకరణం, ఉయ్యాల్లో వేయడం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం మొదలైన అన్ని రకాల కార్యక్రమాలను ఆ పాపకు జరిపించింది. అయితే పాపకు సంబంధించిన ఏ కార్యక్రమంలోనూ రామారావు పాలుపంచుకోలేదు, తనకేమి పట్టనట్లుగానే అతను ఉన్నాడు. కనీసం పాపను తాకను గూడా తాకలేదు. ఆమెకు దూరంగా ఉంటున్నాడు. పాప పట్ల అతని ప్రవర్తనకు అన్నపూర్ణమ్మ చాలా బాధపడేది. కొడుక్కు నచ్చజెప్పడానికి ప్రయత్నించేది. కానీ రామారావు ఆమె మాటలు వినేవాడు కాదు.

మళ్లీ పెళ్లి చేసుకోమని అన్నపూర్ణమ్మ రామారావుకు చెప్పింది. అతను చాలా నిష్కర్షగా నేను మళ్ళీ పెళ్లి చేసుకొనే అవకాశమే లేదు, మళ్లీ ఇంక ఎప్పుడూ నా పెళ్లి గురించి ప్రస్తావించవద్దు అని చాలా గట్టిగా తల్లికి చెప్పాడు. అన్నపూర్ణమ్మ అంతటితో ఊరుకోకుండా ఊర్లోని పెద్దమనుషులతోనూ సీత తండ్రితోను మళ్ళీ పెళ్లి చేసుకోమని తన కొడుక్కు చెప్పించింది. రామారావు చేసుకోనని చాలా గట్టిగా వాళ్లందరికీ చెప్పాడు. రామారావుకు మళ్ళీ పెళ్లి చేయాలన్న అన్నపూర్ణమ్మ సంకల్పం సంకల్పంగానే ఉండిపోయింది. ఆమెకు ఆ దిగులు పట్టుకుంది.

కాలం గడిచిపోతూ ఉంది. సీతకు పద్నాలుగు సంవత్సరాల వయసు వచ్చింది. ఆమె పదవ తరగతి మంచి మార్కులతో పాసయింది. కాలం గడిచే కొద్దీ సీతకు తన పట్ల తన తండ్రికి ఉన్న కోపానికి కారణం మెల్ల

మెల్లగా తెలుస్తూ వచ్చింది. తనను ద్వేషిస్తున్న తండ్రిని ఆమె ఏనాడు ద్వేషించలేదు. చనిపోయిన తల్లి పట్ల అతనికి గల ప్రేమను ఆమె అర్థం చేసుకుంది. తండ్రి తనవైపు చూస్తాడని తనతో మాట్లాడతాడని ఎంతగానో ఎదురు చూసేది. కానీ రామారావు ఏనాడు ఆమెతో మాట్లాడలేదు, ఆమె వైపు కన్నెత్తి కూడా చూడలేదు. అది సీతకు చాలా కష్టంగా ఉండేది. అయినప్పటికీ ఆమెకు తండ్రి పట్ల ఏమాత్రం కోపంగా లేదు. తండ్రి మనసు ఎప్పుడు మారుతుందా అని ఆమె ఎదురు చూస్తూ ఉంది.

రామారావు మళ్లీ పెళ్లి చేసుకోకపోవడం, మనవరాలు పట్ల అతను ద్వేషంతో ఉండడం- ఈ రెండు కారణాల చేత అన్నపూర్ణమ్మ చాలా దిగులుతో ఉండేది. ఈ దిగులు కారణంగా పెద్ద వయసు కారణంగా ఆమె మంచం పట్టింది. ఒకరోజు గుండె ఆగి అకస్మాత్తుగా చనిపోయింది.

తల్లి మరణం రామారావును బాగా కృంగదీసింది. కుటుంబానికి సంబంధించిన అన్ని విషయాలు ఆమె చూసుకునేది. ఆమె చనిపోవడంతో రామారావుకు ఏమి తోచడం లేదు. సీత చదువు మానేసి వంట పని ఇంటి పని మొదలైనవి చూసుకుంటూ ఉంది. రామారావుకు ఇష్టం లేకపోయినప్పటికీ తప్పనిసరి అయి సీత చేతి వంట తింటున్నాడు. సీత భయభక్తులతో గౌరవంతో తండ్రికి భోజనం వడ్డించేది. రామారావు అవేవీ పట్టించుకోకుండా ఆమె వైపు చూడకుండా భోజనం చేసేవాడు.

ఇలా ఉండగా అతనికి పక్షవాతం వచ్చి ఒక కాలు చేయి పడిపోయాయి. సీత వెంటనే ఆసుపత్రికి తీసుకుని వెళ్లి తండ్రికి మందులు ఇప్పించింది. ఇంటికి వచ్చిన తర్వాత అతను ఒక నెలపాటు మంచంలోనే ఉన్నాడు. సీత తండ్రికి అన్ని రకాల సపర్యలు చేసింది. అతనికి మలమూత్రాలు శుభ్రం చేయడం స్నానం చేయించడం భోజనం తినిపించడం మొదలైన పనులన్నీ చాలా శ్రద్ధగా చేసింది.

సీత ఎంతో భక్తి శ్రద్ధలతో తనకు చేస్తున్న సేవలకు రామారావు ఎంతో పశ్చాత్తాపం చెందాడు. పుట్టినప్పటి నుంచి ఆమెను కనీసం తాకను కూడా తాకకుండా తండ్రిగా ఎలాంటి ప్రేమ చూపించకుండా ఉన్నప్పటికీ

ఆవేవి పట్టించుకోకుండా ఆమె తనకు చేస్తున్న సేవలకు అతను ఎంతో కదిలిపోయాడు. తాను ఆమె పట్ల చూపిన నిర్లక్ష్యం, చేసిన అపకారం అతనికి మళ్లీ మళ్లీ గుర్తుకు రాసాగాయి. గతంలో కోపంతో శత్రుభావంతో ఆమె వైపు చూసే వాడు కాదు. ఇప్పుడు గతాన్ని తలుచుకుని సిగ్గుతో ఆమె వైపు చూడలేకపోతున్నాడు. చివరకు అతను ఒక రోజు సీతకు చేతులెత్తి నమస్కరిస్తూ తల్లీ, నువ్వు నా కూతురువు కాదు, నా తల్లివి. నా అమ్మవు. కొడుకు ఎంత అపకారం చేసినప్పటికీ తల్లి వాటిని గుర్తుంచుకోకుండా పట్టించుకోకుండా కొడుకుకు ఎంతో సేవ చేస్తుంది. అలాగే నీవు కూడా గతంలో నేను చేసిన అపకారం పట్టించుకోకుండా నాకు సేవ చేస్తూ మళ్ళీ జన్మను ప్రసాదిస్తున్నావు. నన్ను కన్న తల్లి గూడా ఇంత శ్రద్ధతో నాకు సేవలు చేసేది కాదేమో, నేను నీకు చేసిన అపకారం నాకు మరీ మరీ గుర్తుకొస్తూ నా హృదయాన్ని దహింపజేస్తూ ఉంది. నన్ను క్షమించు తల్లీ, క్షమించానని చెబితేనే నా మనసు ఊరట చెందుతుంది అని కన్నీటి ధారతో సీతతో పలికాడు.

సీత అతని రెండు చేతులు పట్టుకొని నాన్నా, మీరు నాకు నమస్కరించకూడదు, నేను మీ కూతురును, తల్లిదండ్రులకు సేవ చేయటం సంతానానికి ప్రథమ కర్తవ్యం, నేను నా కర్తవ్యాన్ని చేస్తున్నాను. ఈరోజు నాకెంతో సుధినం, మీరు నన్ను కూతురుగా గుర్తించి స్వీకరించారు. నిజానికి ఈ రోజే నేను పుట్టినట్టుగా నాకు అనిపిస్తూవుంది. నేను మీ ప్రేమ కోసం ఎంతగానో తపించాను. ఈనాడు నాకు అది లభించింది. ఇంతకంటే నాకు కావలసింది ఏమీ లేదు అని అతని కాళ్ళకు నమస్కరించింది.

రామారావు ఆమెను లేవనెత్తి కౌగిలించుకొని కన్నీటితో తల్లీ, నీ అంత ఉత్తమురాలు కూతురుగా పుట్టడం నేను పూర్వ జన్మలో చేసుకున్న సుకృతం. ఇప్పటినుంచి నిన్ను కూతురుగా కాకుండా అమ్మగా తల్లిగా చూసుకుంటాను అని రామారావు చెప్పాడు.

పెళ్లి వద్దు నాన్నా

లలిత కుమారితో ఆమె తండ్రి విజయకుమార్ చెప్పాడు.

"లలితా నిన్ను చూసుకోవడానికి ఎల్లుండి సాయంత్రం పెళ్లి వారు వస్తున్నారు. అబ్బాయి బీ.టెక్. చదివి సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఒక్కడే కొడుకు. ఆస్తి గూడా బాగానే ఉంది. మంచి సంబంధం. ఈసంబంధం కుదిరితే నీ భవిష్యత్తు చాలా బాగుంటుందని" చెప్పాడు విజయకుమార్.

"నాన్నా నేను నా కాళ్ళ మీద నిలబడి స్వతంత్రంగా జీవించాలని భావిస్తున్నాను. ఇప్పుడు పెళ్లి చేసుకొని భర్త సంపాదన మీద ఆధారపడి నాకు అవసరమైన ప్రతి చిన్న విషయానికి భర్తను అడిగి డబ్బులు తీసుకొనే జీవితం నాకు ఏమాత్రం ఇష్టం లేదు. నేను ఇంటర్మీడియట్ మంచి మార్కులతో పాసయ్యాను. నేను ఇంకా బాగా చదవాలి. బీ.టెక్. తర్వాత ఎం.టెక్. చదివి ఆతర్వాత పరిశోధన చేసి పీహెచ్. డి. సంపాదించాలని నా కోరిక. ఆ తర్వాత కూడా ఏదైనా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా

చేరి మంచి పరిశోధకురాలుగా సమాజానికి సేవ చేయాలని నేను భావిస్తున్నాను. కాబట్టి నాకు ఇప్పుడే పెళ్లి వద్దు. దయచేసి నన్ను అర్థం చేసుకొని నా పెళ్లి ప్రయత్నాలు మానండి'' అని లలిత కుమారి తండ్రికి చెప్పింది.

"అమ్మా లలితా! మన ఇంటి సంగతులు నీకు తెలియనివి కావు. నువ్వు మాకు చాలా ఆలస్యంగా పుట్టిన ఒక్కగానొక్క కూతురువు. నేను ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాను. మీ అమ్మ నేను పెద్దవాళ్ళమయ్యాం. ఎప్పుడు ఏం జరుగుతుందో ఏమీ చెప్పలేం. నేను అమ్మ ఆరోగ్యంగా ఉన్నప్పుడే నీ పెళ్లి చేస్తే మాకు మనశ్శాంతిగా ఉంటుంది. ఆ తర్వాత ఏం జరిగినా ఇబ్బంది ఉండదు. అందువల్లనే నీ పెళ్లి గురించి నేను తొందర పడుతున్నాను. మీ అమ్మ కూడా ఇదే అభిప్రాయంతో ఉంది. అందువల్ల మా మనస్సు గ్రహించి నువ్వు పెళ్లి చేసుకోవాలి. పెళ్ళయిన తర్వాత కూడా నువ్వు చదువు కొనసాగించి నీ కోరికను తీర్చుకోవచ్చు. చాలామంది అమ్మాయిలు ఆ విధంగా చేస్తున్నారు. అందువల్ల నువ్వు మరో మాట మాట్లాడకుండా ఈ పెళ్లికి సిద్ధం కావాలి'' అన్నాడు విజయ్ కుమార్.

''నాన్నా! నేను అమ్మాయిని కాబట్టి మీరు ఈ విధంగా మాట్లాడుతున్నారు. అదే నేను అబ్బాయినై వుంటే మీరు ఇలా మాట్లాడేవారా? తప్పనిసరిగా ఉద్యోగం వచ్చేవరకు చదివించేవారు. ఉద్యోగం వచ్చిన తర్వాతనే పెళ్లి ప్రయత్నాలు చేసేవారు. అయినా ఇప్పుడు మీకు ఏమంత పెద్ద వయసు వచ్చిందని మీరు భయపడుతున్నారు. మీకు అరవై దాటినాయి. అమ్మకు యాభైయేడు వచ్చాయి. ఈ రోజుల్లో ఎనభై సంవత్సరాల వరకు చాలా మంది హాయిగా జీవిస్తున్నారు. మనకు ఎలాంటి ఆర్థిక సమస్యలు లేవు. అంతేకాకుండా మీకు అమ్మకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. అలాంటప్పుడు మీరు ఎందుకు భయపడుతున్నారో నాకు అర్థం కావడం లేదు'' అన్నది లలిత కుమారి.

“అరవై సంవత్సరాల తర్వాత మనుషులు ఎప్పుడు ఏమైతారో ఏమీ చెప్పలేం. ఈరోజు ఉన్న వ్యక్తి మరుసటి రోజు ఉంటాడన్న గ్యారెంటీ ఏమీ లేదు. నువ్వు మాకు ఒక్కగానొక్క కూతురువు. నీకంటే పెద్ద వాళ్లు అన్న గానీ అక్క గానీ ఉండి ఉంటే నేను నీ పెళ్లి విషయంలో ఇంత తొందర పడేవాడిని కాదు. కానీ నువ్వు ఒక్కదానివే కూతురువు. అందువల్లనే మేము నీ పెళ్లి విషయంలో తొందర పడుతున్నాం. అబ్బాయి నీకు నచ్చితేనే పెళ్లి. లేకపోతే లేదు. కాబట్టి ఎల్లుడి వస్తున్న అబ్బాయిని చూడు, తర్వాత నీ అభిప్రాయం చెప్పు’’ అన్నాడు విజయ్ కుమార్.

“నాన్నా, అబ్బాయి నచ్చడం నచ్చకపోవడం అనేది కాదు సమస్య . నాకు జీవితంలో ఒక లక్ష్యముంది. ఆ లక్ష్యాన్ని చేరుకున్న తర్వాతనే నేను పెళ్లి గురించి ఆలోచిస్తాను. అంతవరకు వెళ్లి వద్దనేది నా గట్టి కోరిక. అయినా పుట్టిన వాళ్లంతా తప్పనిసరిగా పెళ్లి చేసుకోవాలని రూలేం లేదు. పెళ్లి ఒక ఐచ్ఛికం. ఇష్టమున్న వాళ్ళు చేసుకుంటారు. ఇష్టం లేని వాళ్ళు చేసుకోరు. ఇప్పుడు నాకు పెళ్ళి మీద ఏమాత్రం ఇష్టం లేదు. నేను బాగా చదువుకుని గొప్ప పరిశోధన చేసి మంచి పేరు సంపాదించి మీపేరు నిలబెడతాను. మీకు గానీ అమ్మకు గానీ ఏమైనా అవుతుందన్న భయం మీరు పెట్టుకోవద్దు. మీకు అమ్మకు ఏమీ కాదు. మీరిద్దరూ నిండు నూరేళ్ళు హాయిగా సంపూర్ణమైన ఆరోగ్యంతో జీవిస్తారు. అందువల్ల మీరు నా పెళ్ళి ప్రయత్నం మానేసి నిశ్చింతగా ఉండండి. పెళ్లి చేసుకోవాలని బలవంతం చేసి నన్ను బాధపెట్టవద్దు. ఈవిషయంలో మీమాట కాదంటున్నందుకు నన్ను మన్నించండి’’ అన్నది లలిత కుమారి.

లలిత కుమారి అలా మాట్లాడడంతో విజయ్ కుమార్ ఆమె పెళ్లి గురించిన సంభాషణ అంతటితో ఆపేశాడు. అయితే ఆమె కోరినట్లుగా పెళ్లిని వాయిదా వేయడం గానీ, ఆపడం గాని అతను చేయాలనుకోవడం లేదు. అతను ఆ తర్వాత తన భార్య సావిత్రితో పెళ్లి విషయంలో లలిత కుమారి మాటలను వివరంగా చెప్పాడు. లలిత కుమారి సున్నితమైన

మనస్సు కలదని ఆమె కోరికకు విరుద్ధంగా వెంటనే పెళ్లి చేయాలనుకోవడం మంచిది కాదని సావిత్రి భర్తకు చెప్పింది. కానీ విజయ్ కుమార్ ఆమె మాటలను కాదన్నాడు. లలిత కుమారి చిన్న పిల్ల, ఆమెకు అనుభవం లేదు, ఎలాగో ఒకలాగా ఆమెను ఒప్పించి పెళ్లి చేస్తే తర్వాత అన్నీ సర్దుకుంటాయని చెప్పాడు. పెళ్లిచూపుల నాడు తండ్రి మరీ మరీ చెప్పడంతో తండ్రిని బాధ పెట్టడం ఇష్టం లేక లలిత కుమారి పెళ్లి చూపులకు అంగీకరించింది. అందుకు విజయకుమార్ చాలా సంతోషించాడు.

పెళ్ళిచూపులు ఐపోయాయి. అమ్మాయి నచ్చిందని వరుని తరుపు వాళ్ళు చెప్పారు. విజయకుమార్ చాలా సంతోషించాడు. కానీ లలిత కుమారి చాలా బాధపడింది. ఆమెకు ఇప్పుడిప్పుడే పెళ్లి చేసుకోవడం ఏ మాత్రం ఇష్టం లేదు. ఇష్టం లేకుండా పెళ్ళి చేసుకోవటం ఆమె మనసుకు చాలా కష్టంగా ఉంది. పెళ్లి తనకు ఇష్టం లేదని తన నిర్ణయాన్ని ఎంతగా చెప్పినా తండ్రి తన మాటలను పట్టించుకోకుండా పెళ్లి ప్రయత్నాలు చేయటం ఆమెకు చాలా ఇబ్బందిగా ఉంది. ఎలాగైనా ఈ పెళ్లి ప్రమాదం నుంచి తప్పించుకోవాలని ఆమె ఆలోచించి తండ్రికి ఉత్తరం రాసింది.

నాన్నా,

ఇప్పుడిప్పుడే నాకు పెళ్లి వద్దని నాకంటూ ఒక లక్ష్యముందని ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకున్న తర్వాతనే పెళ్లి గురించి ఆలోచిస్తానని మీకు ఎంతగా చెప్పినా నా మాటలను పట్టించుకోకుండా మీరు నా పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. చూస్తుంటే నన్ను మీరు చాలా భారంగా ఒక గుదిబండ లాగా చూస్తున్నారనిపిస్తూ వుంది. పెళ్లి చేసుకోవడం నాకు ఏమాత్రం ఇష్టం లేదు. అలాగే మీకు భారంగా, గుదిబండ లాగా, రొమ్ముల మీద కుంపటిలాగా ఉండటం కూడా నాకు ఇష్టం లేదు. అందువల్ల నేను ఇంటి నుంచి వెళ్ళిపోతున్నాను. భవిష్యత్తులో నేనేం చేయాలి నేనేమవుతాను అనే విషయం గురించి నేను పెద్దగా ఆలోచించలేదు. ప్రస్తుతం మీరు

చేస్తున్న పెళ్లి నాకు చాలా ప్రమాదంగా అనిపిస్తూ వుంది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవడమే నేను మొదట చేయవలసింది. అందుకని నేను ఇంట్లో నుంచి వెళ్ళిపోతున్నాను. చాలామంది తల్లిదండ్రులు తమ కూతుర్లకు పెళ్లి చేసి అత్తవారింటికి పంపంపించడమే ధ్యేయంగా, బాధ్యతగా, తప్పనిసరి అయిన పనిగా చూస్తున్నారు. జీవితంలో పెళ్లి ఒక్కటే ముఖ్యమైంది ప్రధానమైంది కాదు. అది జీవితంలో ఒక భాగం మాత్రమే. అబ్బాయిలకున్నట్లుగానే అమ్మాయిలకు కూడా ఒక మనసుంటుందని వాళ్లకు కొన్ని ఇష్టాలు, లక్ష్యాలుంటాయని, ఆ లక్ష్యాలను చేరుకోవాలని వాళ్ళు తపిస్తుంటారని తల్లిదండ్రులు గమనించడం లేదు. ఈ ఆధునిక కాలంలో కూడా తల్లిదండ్రులు ఇలా సంకుచితంగా ఆలోచించడం ఏమాత్రం బాగాలేదు. కొడుకుల విషయంలో ఆలోచిస్తున్నంతగా కూతుర్ల విషయంలో ఎందుకు ఆలోచించడం లేదో నాకు అర్థం కావడం లేదు. దయచేసి తల్లిదండ్రులకు నా విజ్ఞాపన ఏమంటే కూతుర్ల ఇష్టాలను, వారి లక్ష్యాలను గమనించండి. వాటిని గౌరవించండి. ఆ లక్ష్యాలను చేరుకోవడంలో వారికి సహకరించండి.

నాన్న, నేను ఇంట్లో నుంచి వెళ్లిపోవడం అమ్మకు మీకు ఎంత బాధగా ఎంత కష్టంగా ఉంటుందో నాకు తెలుసు. కానీ నాకు వేరే మార్గం లేకపోవడం చేత ఈ పని చేస్తున్నాను. దయచేసి నన్ను నా మనసును అర్థం చేసుకోండి.

మీ కుమార్తె
లలిత కుమారి

ఉత్తరం రాసిపెట్టి లలిత కుమారి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆ ఉత్తరాన్ని చదువుకొని విజయ్ కుమార్ హతాశుడై కూలబడిపోయాడు.

గర్భవతి

రాణి మొదటిసారి గర్భవతి అయింది. రెండు నెలలు బహిష్టు రాకపోవడంతో ఆమెకు కొంత అనుమానం వచ్చి డాక్టర్ దగ్గరికి వెళ్లి పరీక్ష చేయించుకుంది. డాక్టరు ఆమె గర్భవతి అని స్పష్టంగా చెప్పింది. రాణి చాలా సంతోషించింది. ఎందుకంటే ఆమెకు పెళ్లై ఐదు సంవత్సరాలు దాటింది. సంతానం కోసం అనేక రకాల ప్రయత్నాలు చేసింది. అనేక దేవుళ్లకు పూజలు పునస్కారాలు చేసింది. ఎన్నో నోములు వ్రతాలు చేసింది. అవేవీ ఫలించలేదు. ఇక తనకు సంతానయోగం లేదని ఆమె నిరాశతో ఉంది. అలాంటి సమయంలో గర్భం ధరించటం ఆమెకు అపరిమితమైన సంతోషాన్ని కలిగించింది. ఈ విషయాన్ని మొట్టమొదట తన భర్త రాజుకు చెప్పింది. రాజు ఎగిరి గంతేసినంత పని చేశాడు. ఆమెను ఎత్తుకొని గిరగిరా తిప్పి ముద్దులతో ముంచెత్తాడు. రాజు సంతోషానికి అతను చేస్తున్న పనికి రాణి ఎంతగానో పులకించి పోయింది.

రాణి ఈ వార్తను తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. వాళ్ళు అపరిమితంగా సంతోషించారు. హార్దికమైన శుభాకాంక్షలు తెలియజేశారు. వెంటనే బయలుదేరి ఆమెను చూడ్డానికి వస్తున్నామని సంతోషంగా చెప్పారు. తర్వాత రాణి తన అన్నదమ్ములకు అక్కచెల్లెళ్లకు ఈ విషయాన్ని గురించి చెప్పింది. వాళ్లు కూడా చాలా సంతోషించి హార్థిక శుభాకాంక్షలు చెప్పడమే కాకుండా ఆమె చూడ్డానికి వస్తున్నామని చెప్పారు. రాజు ఈ వార్తను తన తల్లిదండ్రులకు అన్నదమ్ములకు అక్కచెల్లెళ్లకు చెప్పాడు. వాళ్లు కూడా ఫోన్లో హార్థికమైన శుభాకాంక్షలు చెప్పడమే కాకుండా వ్యక్తిగతంగా అభినందించడానికి వస్తున్నామని చెప్పారు.

అన్నట్లుగానే రాణి తరపు వాళ్ళు, రాజు తరపు వాళ్ళు వచ్చి ఆ దంపతులిద్దరికీ హార్థికమైన శుభాకాంక్షలు తెలపడమే గాకుండా అనేక రకాల బహుమతులు కూడా తీసుకుని వచ్చారు. ఇంచుమించు ఒక వారం రోజులపాటు వాళ్ళు ఇంట్లోనే ఉండి చాలా కోలాహాలంగా రాణి తల్లి కాబోతున్న విషయాన్ని ఊరందరికీ తెలిసేలాగా ఉత్సవాలు చేశారు. దానితో ఆ వీధిలో ఉన్న వాళ్ళు ఆ ఊర్లో ఉన్నవాళ్లు కూడా రాణి, రాజు దంపతులకు శుభాకాంక్షలు చెప్పడమే కాకుండా అనేక రకాల బహుమతులు ఇవ్వడంతో పాటు ఆ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

రాజు తన భార్యను ఎంతో అపురూపంగా చూసుకుంటూ ఆమెను ఏ పని చేయనివ్వకుండా చూసుకుంటూ అన్ని పనులు తానే చేస్తున్నాడు. ఆమె అమ్మానాన్నలు, అత్తామామలు పోటీలు బడి ఆమెకు రకరకాల సేవలు ఉపచారాలు చేస్తున్నారు. ఇంట్లో వాళ్ళందరూ ఆమెకు అనేక రకాల పళ్ళు, పళ్ళ రసాలు తీసుకొని వచ్చి ఎంతో ప్రేమతో ఆమెకు తినిపిస్తున్నారు, తాగిస్తున్నారు. వారం రోజుల తర్వాత వచ్చిన బంధు వులందరూ వెళ్ళిపోయారు.

రోజులు గడుస్తున్నాయి. రాణికి అయిదవ నెల దాటి ఆరవ నెల వచ్చింది. ఆమె గర్భవతి అనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె

ఎక్కడికి వెళ్ళినా అందరూ ఆమెను గౌరవించడం ప్రారంభించారు. ఆమె సిటీ బస్సులో వెళ్తే బస్సులో కూర్చున్న వాళ్లు లేచి చాలా గౌరవంగా తాము కూర్చున్న సీట్లు చూపిస్తూ కూర్చోమని చెబుతున్నారు. ఆమె నడుచుకుంటూ వెళ్తుంటే ఆటోవాళ్లు తమ ఆటలో ఉచితంగా ఆమె వెళ్లవలసిన చోటికి తీసుకొని వెళ్తామని మర్యాదగా చెబుతున్నారు. టాక్సీ వాళ్ళు ఆమెను మర్యాదగా ఆహ్వానిస్తూ ఆటోలో ఎందుకండీ మా టాక్సీలో మిమ్మల్ని డ్రాప్ చేస్తాం రమ్మని బతిమాలుతున్నారు. ఆమె కిరాణా షాప్ కు వెళ్ళినా, సూపర్ మార్కెట్ కు వెళ్ళినా అక్కడి షాపు యజమానులు, పనివాళ్ళు ఆమెకు అనేక రకాల అతిథి మర్యాదలు చేస్తున్నారు. ఆమె బట్టల దుకాణానికి నగలు దుకాణానికి వెళ్తే ఆ దుకాణాల యజమానులు అందులో పని చేసేవాళ్లు ఆమెను ఆహ్వానించి కూర్చోబెట్టి ప్రత్యేకంగా ఆమె కావలసిన బట్టలు నగలు చూపిస్తూ ఆమె డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదని, ఆమె ఉచితంగా తనకు కావలసిన బట్టలను నగలను తీసుకుని వెళ్లవచ్చని చాలా మర్యాదగా చెబుతున్నారు.

రాణి తాను పని చేసే ఆఫీస్ కు వెళ్తే ఆఫీసులోని మేనేజర్ తన ఛాంబర్ లోకి ఆమెను ఆహ్వానించి ఆమెకు కాఫీ కూల్ డ్రింకులు మొదలైనవి తెప్పించి తాగమని బతిమాలుతున్నాడు. తోటి ఉద్యోగస్తులు ఆమెను చాలా గౌరవంగా చూసుకుంటూ ఆమె పని చేయవలసిన అవసరం లేదని ఆమె పనిని తామందరము చేసి పెడతామని అర్థిస్తున్నారు. తల్లి కాబోతున్న స్త్రీని సమాజం ఇంత అపురూపంగా చూసుకుంటుందా అని ఆమె ఆశ్చర్యపోతూ వుంది.

ఆమెకు ఏడు మాసాలు రాగానే ఆమె వైపు చుట్టాలు భర్త వైపు చుట్టాలు ఊర్లో వాళ్ళు అందరూ ఆమె సీమంతాన్ని చాలా ఘనంగా ఉత్సవంగా వైభవంగా చేశారు.

ఇలా ఊరు ఊరంతా రాణీని ప్రత్యేకంగా చూస్తూ ఆమెను గౌరవిస్తూ అనేక రకాలుగా ఉపకారాలు ఉపచారాలు చేస్తూ ఉంటే రాణి సంతోషంతో

ఉబ్బి తబ్బిబ్బవుతూ వుంది. ఆమెకు నవమాసాలు నుండి ఇద్దరు కవల మగ పిల్లలను కనింది. రాజు, అతని తల్లిదండ్రులు, రాణి, ఆమె తల్లిదండ్రులు ఎంతగానో సంతోషించారు. ఆనందంతో ఉప్పొంగిపోయారు. రాణీని దేవతలాగా ప్రత్యేకంగా చూసుకుంటున్నారు. దీనితో రాణీ కి ఒక విధమైన గర్వం వచ్చింది. తాను అందరిలాంటి మామూలు స్త్రీ కాదని, మిగతా స్త్రీల కంటే తాను చాలా గొప్పదాన్ననీ భావిస్తూ ఇంట్లో అందరి మీద అధికారం చలాయించ సాగింది. ఒకసారి ఆమె భర్త రాజు మంచం మీద కూర్చున్న రాణీకి అన్నం తినిపిస్తూ పొరపాటున ఆమె వంటి మీద నీళ్ళు పోశాడు. దానితో రాణికి కోపం వచ్చి రాజు చెంప మీద లాగి గట్టిగా కొట్టింది.

రాణి పక్కన పడుకున్న రాజు నిద్ర నుంచి అకస్మాత్తుగా మేల్కొని రాణీతో అదేమిటే అంత గట్టిగా కొట్టావు అని కోపగించుకున్నాడు. రాణి నిద్ర నుంచి మేలుకొని ఏం జరిగిందో తెలుసుకోలేకపోయింది. కొంచెం సేపు అయిన తర్వాత అదంతా కల అని ఆమెకు అర్థమైంది. మంచి కల వచ్చిందండీ, ఆకలలో ఒకరిని కొడుతూ ఇలలో పక్కన పడుకున్న మిమ్మల్ని కొట్టాను సారీ అండీ అని భర్తకు సర్ది చెప్పింది.

చాలా మంచి కల వచ్చినందుకు ఆమె సంతోషించింది. కల నిజమైతే ఎంత బాగుంటుంది అని ఆమె అనుకుంది.

ప్రేమ కథ

ధనుంజయ రావు భూస్వామి. అతనిది విజయవాడ దగ్గర పల్లెటూరు. చండశాసనుడు, భార్య శ్యామల, ఒక్కగానొక్క కూతురు రవళి, అతని మాట వినాల్సిందే. భార్య గానీ కూతురు గానీ అతనికి ఎదురు చెప్పరు. కూతురు తండ్రితో మాట్లాడడానికే భయపడుతుంది. ఆమెకు ఏమి కావాలన్నా తల్లితో చెప్పుకుంటుంది. తల్లి కూతురు తరపున భర్తతో మాట్లాడుతుంది. అంత భయం ఆమెకు తండ్రి అంటే.

రవళి ఇంటర్మీడియట్ మంచి మార్కులతో పాస్ అయింది. ఆ తర్వాత ఇంజనీరింగ్ చదవాలని నిశ్చయించుకుంది. కానీ తండ్రి ఆమెకు పెళ్లి చేస్తానన్నాడు. అప్పుడే పెళ్లి చేసుకోవడం ఆమెకు ఇష్టం లేదు. తల్లి ద్వారా తాను ఇంజనీరింగ్ చదువుతానని తండ్రికి చెప్పించింది. తండ్రి అన్యమనస్కంగానే అంగీకరించాడు.

రవళి విజయవాడలో ఒక కళాశాలలో ఇంజనీరింగ్ లో చేరింది. నాలుగో సంవత్సరం చదువుతూ ఉండగా ఆమె రవి అనే అబ్బాయిని

ప్రేమించింది. రవి కూడా ఆమెను ప్రేమించాడు. తక్కువ కాలంలోనే వారిద్దరూ ఒకరినొకరు విడిచిపెట్టలేనంత గాఢంగా ప్రేమించుకున్నారు. రవి సొంత ఊరు విశాఖపట్నం. అతనిది వేరే కులం. సమయం చూసుకొని తల్లిదండ్రులకు తమ ప్రేమ విషయం చెప్పాలని ఇద్దరూ కలిసి నిర్ణయించుకున్నారు. రవళి ఇంజనీరింగ్ అయిపోయి ఇంటికి వచ్చింది.

ఇంటికి వచ్చినప్పటి నుంచి రవళి తన ప్రేమను గురించి తల్లిదండ్రులకు చెప్పాలని ఆలోచిస్తూ ఉంది. తండ్రికి చెప్పే ధైర్యం లేదు. తల్లికి చెప్పాలా వద్దా అని ఆలోచిస్తూ ఉంది. ఎందుకంటే తల్లి కూడ తండ్రి మాటను ఎదిరించి ఏమీ చేయలేదు. అందువల్ల ఆమె తన ప్రేమ విషయం తల్లికి చెప్పాలా వద్దా అని సందిగ్ధంలో పడింది. చివరకు ధైర్యం చేసి తల్లికి చెప్పడానికి నిశ్చయించుకుంది. చెప్పింది.

అమ్మా , నేను ఒక అబ్బాయిని ప్రేమించాను

ఒక అబ్బాయిని ప్రేమించావా? ఎవరా అబ్బాయి, మన కులమేనా?

కాదు, మన కులం కాదు, వేరే కులం

మీ నాన్న సంగతి తెలిసే వేరే కులం అబ్బాయిని ప్రేమించావా? మీ నాన్నకు అసలే కులపిచ్చి, వేరే కులం అబ్బాయిని అల్లునిగా చేసుకోడు. నువ్వు నీ ప్రేమ విషయం మర్చిపోయి మీ నాన్న చూసిన వాన్ని పెళ్లి చేసుకో. ఈ విషయం ఇంక ఎవరికీ చెప్పకు, అనవసరంగా నీకు చెడ్డ పేరు వస్తుంది.

అమ్మా, ఒకసారి నా ప్రేమ వ్యవహారం నాన్నగారికి చెప్పి, నేను ప్రేమించిన రవితో నా పెళ్లి జరిగేలాగా చూడమ్మా అని రవళి తల్లిని మరీమరీ బతిమాలింది.

శ్యామల రవళి ప్రేమ వ్యవహారాన్ని భర్తకు చెప్పి ఒక్కగానొక్కకూతురు కోరికను తీర్చడం తండ్రిగా అతని బాధ్యత అని, రవళి సంతోషంగా ఉండాలంటే ఆమె కోరుకున్న అబ్బాయితో పెళ్లి జరిపించాలని కోరింది.

రవళి ప్రేమ వ్యవహారాన్ని విని ధనుంజయ రావు కోపంతో ఊగిపోయాడు. “కులాంతర వివాహానికి నేను చచ్చినా అంగీకరించను, మన కులంలోనే నేను నిర్ణయించిన అబ్బాయినే రవళి పెళ్లి చేసుకోవాలి” అని గట్టిగా చెప్పాడు

దానితో రవళి చాలా నిరుత్సాహపడిపోయింది. తండ్రినిఎదిరించే ధైర్యం ఆమెకు లేకపోయింది. ఏమి చేయాలో పాలుపోక ఆమె చాలా దిగులుతో ఉంది.

అక్కడ రవి తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పాడు. వాళ్లు అతని ప్రేమకు సరే అన్నారు. రవి రవళికి ఫోన్ చేసి.

“రవళీ, మా అమ్మానాన్నలకు మన ప్రేమ విషయం గురించి చెప్పాను. వాళ్ళు మన పెళ్ళికి ఒప్పుకున్నారు. నువ్వు మీ అమ్మానాన్నలకు మన ప్రేమ విషయం చెప్పావా? వాళ్ళు ఏమన్నారు?'' అని అడిగాడు.

“మన పెళ్లికి మీ అమ్మానాన్నలు ఒప్పుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. నేను ఇంకా మన ప్రేమ విషయం మా అమ్మానాన్నలకు చెప్పలేదు. వీలు చూసుకుని చెబుతాను. కొద్ది రోజులు ఓపిక పట్టు'' అని రవళి చెప్పింది.

“నీకోసం ఎన్ని రోజులైనా అగుతాను. నువ్వంటే నాకు చాలా ఇష్టం, ప్రాణంతో సమానం, నిన్ను తప్ప నేను ఎవరిని పెళ్లి చేసుకోను'' రవి చెప్పాడు.

“రవీ, నువ్వంటే నాకూ చాలా ఇష్టం, నిన్ను వదులుకోవడం నాకు కూడా ఏమాత్రం ఇష్టం లేదు, చిన్నప్పటినుంచి మా నాన్నంటే నాకు చాలా భయం. మా నాన్న వేరే కులం అబ్బాయికి నన్ను ఇచ్చి పెళ్లి చేయడానికి అంగీకరించడేమో అని నేను భయపడుతున్నాను. వీలు చూసుకుని నేను మా నాన్నను మన పెళ్ళికి ఒప్పించే ప్రయత్నం చేస్తాను. కొద్ది రోజులు ఓపిక పట్టు'' అని రవళి చెప్పింది.

రవి "సరే"అన్నాడు.

రవళికి ఏం చేయాలో బొత్తిగా తోచడం లేదు. రవిని వదులుకోవడం, అతను లేకుండా తన జీవితాన్ని ఊహించుకోవడం ఆమెకు చాలా కష్టంగా ఉంది. కానీ తన తండ్రి రవిని అల్లుడుగా ఇష్టపడే అవకాశం కనబడడం లేదు. చివరకు తన నుదుట ఏమి రాసిపెట్టి ఉందో, తన జీవితంలో ఏం జరుగాలని ఉందో అదే జరుగుతుందని ఆమె దేవుని మీద భారం వేసి దిగులుగా ఉంది

ధనంజయరావ్ రవళికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. చాలా సంబంధాలు చూశాడు. రవళి వాళ్ళెవరూ నచ్చలేదని చెప్పింది. ధనంజ రావుకు కోపం వచ్చింది. ఈసారి తెచ్చే సంబంధానికి తప్పనిసరిగా ఒప్పుకోవాలని లేకపోతే కాళ్లు చేతులు కట్టేసి పెళ్లి చేస్తానని రవళికి చెప్పాడు. తల్లి కూడా అదే విషయాన్ని చెప్పింది. తప్పనిసరి అయి ధనంజయరావ్ చూసిన సంబంధాన్ని పెళ్లి చేసుకోవడానికి రవళి అంగీకరించింది.

రవళికి చంద్రరావు అనే అబ్బాయితో పెళ్లి జరిగిపోయింది. చంద్రరావుది విశాఖపట్నం, అతను విశాఖపట్నంలోనే ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి రవళి సొంత ఊర్లోనే జరిగింది. పెళ్లయిన తర్వాత వధూవరులు విశాఖపట్నంలో వరుని ఇంటికి వెళ్లారు.

విశాఖపట్నం వెళ్ళిన తర్వాత రవళి తన పెళ్లి గురించి రవికి ఫోన్ చేసి చెప్పింది.

"రవీ, నా పెళ్లి తప్పనిసరి అయిన పరిస్థితుల్లో జరిగిపోయింది. నేను ప్రస్తుతం విశాఖపట్నంలో అత్తవారింట్లో ఉన్నాను. ఇంకా శోభన కార్యక్రమం జరగలేదు. నన్ను మన్నించు, నేను ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాను. నువ్వెంత బాధ పడతావో నాకు తెలుసు. తల్లిదండ్రుల మాట కాదనలేక నేను ఈ పెళ్లి చేసుకున్నాను. పెళ్లికి ముందు నేను కావాలనే నీకు ఈ విషయం చెప్పలేదు. పెళ్లి గురించి చెబితే నువ్వు మా ఊరికి

వస్తావు, మా నాన్న నిన్ను ఏమైనా చేయవచ్చు. అందుకనే నేను నీ క్షేమం కోరి నా పెళ్లి గురించి ముందు చెప్పలేదు'' అని చెప్పింది.

రవళి చెప్పిన మాటలు విని రవి హతశుడైపోయాడు. చెప్పలేనంతగా బాధపడ్డాడు. ఆ తర్వాత మెల్లగా తేరుకొని ఆమెతో ఫోన్లో చెప్పాడు

"రవళీ, నువ్వు లేకుండా నేను బతకలేను. నీకు పెళ్లి అయినా సరే, ఇప్పటికీ నేను నిన్ను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను. ఇప్పుడు నువ్వు మీ నాన్నకు భయపడనవసరం లేదు. ధైర్యం చేసి నేను చెప్పినట్లుగా చెయ్యి, మనిద్దరం పెళ్లి చేసుకుందాం. ఈరోజు సాయంత్రం సీతమ్మదారలో ఉన్న వెంకటేశ్వర స్వామి గుడి దగ్గరికి రా, నేను అక్కడ నీకోసం కారులో ఎదురు చూస్తూ ఉంటాను. నువ్వు రాకపోతే నాకు చావే గతి, నువ్వు లేని జీవితాన్ని నేను ఊహించుకోలేను గూడా, తప్పనిసరిగా రా'' అని రవి చెప్పాడు

రవళి ధైర్యం చేసి "అలాగే తప్పకుండా వస్తాను''అని చెప్పింది.

చెప్పినట్లుగానే ఆమె గుడి వద్దకు వచ్చింది. రవి ఆమెను తన ఇంటికి తీసుకొని వెళ్ళి తల్లిదండ్రులకు విషయమంతా చెప్పాడు. రవి తల్లిదండ్రులు కూడా వాళ్ళిద్దరి పెళ్ళికి అంగీకరించారు. పెళ్లి కాకుండానే వాళ్ళిద్దరికీ రహస్యంగా ఆరోజే శోభనం జరిపించారు.

గుడికి వెళ్ళిన రవళి ఎంతసేపటికీ రాకపోవడంతో చంద్రరావు అతని తల్లిదండ్రులు, రవళి తల్లి గుడి దగ్గర చుట్టుపక్కల చాలాసేపు వెతికారు. ఆ రాత్రి చాలాసేపు అయిన తర్వాత రవళి ఇంటికి రాకపోవడంతో శ్యామల భర్త ధనంజయరావుకు రవళి కన్పించడం లేదన్న విషయాన్ని చెప్పింది. తాను వెంటనే బయలుదేరి వస్తున్నానని రవళి కన్పించడం లేదన్న విషయాన్ని ఇంక ఎవరికీ చెప్పవద్దని ధనంజరావు భార్యకు చెప్పాడు. రవళి తల్లి అదే విషయాన్ని చంద్రరావుకు అతని తల్లిదండ్రులకు చెప్పింది.

మరుసటి రోజు ధనుంజయ రావు విశాఖపట్నం లో ఉన్న వరుని ఇంటికి వచ్చితన కూతురు ప్రేమ వ్యవహారాన్ని వారికి చెప్పాడు.

"మా అమ్మాయి రవళి రవి అనే ఈ వూరి అబ్బాయిని ప్రేమించింది. ఆ అబ్బాయిది వేరే కులం. రవళిని ఆ అబ్బాయికిచ్చి పెళ్లి చేయడం ఇష్టం లేక ఈ విషయం దాచి పెట్టి చంద్రరావుకు ఇచ్చి పెళ్లి చేశాను. చాలా మంది తండ్రుల లాగానే నేనూ చేశాను. ఈ విధంగా చేయడం తప్పని అప్పట్లో నేను భావించలేదు. తప్పని ఇప్పుడు అనిపిస్తూ వుంది. మీరు నన్ను క్షమించాలి, దయచేసి నన్ను క్షమించండి. రవళి ఆ అబ్బాయితో వెళ్ళిపోయి ఉండవచ్చు" అని వారితో చెప్పాడు.

చంద్రరావు అతని తల్లిదండ్రులు ధనంజయరావు చెప్పిన విషయాన్ని విని మాట్లాడకుండా మౌనంగా ఉన్నారు.

ధనుంజయ రావు భార్యను తీసుకొని తన ఊరికి వెళ్ళిపోయాడు. అతను రవళి ప్రేమను గురించి ఆమె వెళ్లిపోయిన విషయాన్ని గురించి ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఉన్నాడు. ఎవరైనా ఈ విషయాన్ని గురించి మాట్లాడానికి ప్రయత్నించి సానుభూతి చూపించే ప్రయత్నం చేస్తే వారికి నమస్కరించి దాని గురించి మాట్లాడవద్దని చెప్పాడు. రవళి ప్రేమను నిరాకరించి తప్పు చేశానని అతను ఆలస్యంగానైనా గ్రహించాడు.

మూడు రోజుల తర్వాత రవళి చంద్రరావుకు ఫోన్ చేసింది.

"చంద్రరావు గారూ, మీరు నన్ను క్షమించాలి. మా తల్లిదండ్రులు నా ప్రేమను అంగీకరించకుండా, నా ప్రేమ విషయాన్ని మీకు చెప్పకుండా దాచిపెట్టి మీకు మోసం చేశారు. నేను తల్లిదండ్రులను ఎదిరించలేక వారి మాటకు కట్టుబడి ఇష్టం లేకపోయినా మిమ్మల్ని పెళ్లి చేసుకున్నాను. నేను ప్రేమించిన రవి చాలా మంచివాడు. మేమిద్దరమూ ఒకరినొకరు విడిచిపెట్టి ఉండలేక పోయాం. నేను విశాఖపట్నం వచ్చిన తర్వాత రవి

చెప్పిన మాటలకు ధైర్యం తెచ్చుకొని అతనితో వెళ్ళిపోయాను. మిమ్మల్ని బాధపెట్టినందుకు, మోసగించినందుకు మనస్ఫూర్తిగా క్షమాపణ కోరుకుంటున్నాను. దయచేసి నన్ను క్షమించండి'' అని రవళి చెప్పింది

"రవళి గారూ, ఇందులో మీ తప్పేమీ లేదు. తప్పంతా మీ నాన్నగారిది. తల్లిదండ్రుల చాటు అమ్మాయిలెందరో తల్లిదండ్రుల మాటను కాదనలేక తమ ప్రేమను సఫలం చేసుకోలేక బాధపడుతూ ఉన్నారు. మీరు ప్రేమించిన రవితో వెళ్లిపోయి మంచి పని చేశారు, మీకు నా శుభాకాంక్షలు'' అని చంద్రరావు రవళితో చెప్పాడు.

రవళి, రవి ఇద్దరు చంద్రరావు ఉన్నత సంస్కారానికి అతని విశాల హృదయానికి నమస్కారాలు అర్పించారు.

తర్వాత రవళి తన తల్లికి ఫోన్ చేసింది.

"అమ్మా , నేను రవితో ఉన్నాను, రవి తల్లిదండ్రులు నన్ను కోడలుగా సంతోషంగా అంగీకరించారు. నేను చాల సంతోషంగా ఉన్నాను. మీరు నా గురించి ఎలాంటి దిగులు పెట్టుకోవద్దు. నన్ను క్షమించమని నాన్నగారికి చెప్పు'' అని చెప్పింది.

రవళి ఫోన్ చేసిన విషయాన్ని , ఆమె చెప్పిన విషయాన్ని శ్యామల ధనంజయరావుకు చెప్పింది. ధనంజయరావు "సరే'' అన్నాడు.

భార్య

"నేను షాపింగ్ కు వెళ్తున్నాను మీ ఏటీఎం కార్డు ఇవ్వండి'' అన్నది రామలక్ష్మి భర్త రమేష్ తో

"ఎందుకూ? ఏం కొంటావేంటి? మనకు అన్నీ ఉన్నాయి కదా, కొత్తగా కొనవలసిన అవసరం ఏముంది'' అన్నాడు రమేష్.

"సంసారానికి కావలసిన అవసరాల గురించి, వస్తువుల గురించి మీబోటి వాళ్ళకు ఏం తెలుస్తుంది? ఇంట్లో ఏమున్నాయో ఏమి లేవో మీరు ఏనాడైనా కనుక్కున్నారా? మీకు మీ ఆఫీస్ పనితోనే సరిపోతుంది. ఇంటికి వచ్చిన తర్వాత కూడా మీ ఆఫీస్ పని చేసుకుంటూ ఉంటారు. కుటుంబం గురించి పట్టించుకునే తీరిక మీకు ఎక్కడుంది? మీకేం కావాలో కూడా మీకు తెలియదు, ఇంక ఇంట్లోకి ఏం కావాలో మీకు తెలుస్తుందా? అయినా ఏనాడైనా మీరు ఏదైనా వస్తువు కొన్నారా? ఇంట్లోకి కావలసినవి, నాకు కావలసినవి, మీకు కావలసినవి అన్నీ నేనే కదా తెచ్చేది. రెండు

మూడు సార్లు కూరగాయలకు వెళ్లి పుచ్చిపోయిన వంకాయలు ముదిరిపోయిన బెండకాయలు సొరకాయలు తెచ్చారు. ఏనాడైనా మంచివి తెచ్చారా? మీ అమాయకమైన మొహం చూడగానే షాపు వాళ్లకు మిమ్మల్ని మోసం చేయాలనిపిస్తుంది. అది కాకుండా మీ మతిమరుపు ఒకటి, ఆరు వస్తువులు తెమ్మంటే రెండే తెస్తారు. నాలుగు వస్తువులు మరిచిపోతారు. వాటి కోసం నేను మళ్ళీ వెళ్లి తెచ్చుకోవాలి. ఇలా రెండు మూడు సార్లు చూసిన తర్వాత మిమ్మల్ని పంపించకుండా అన్నీ నేనే తెచ్చుకుంటున్నాను గదా. అది కాకుండా మీకు డబ్బు ఖర్చు పెట్టడమంటే ప్రాణం పోయినట్టుగా ఉంటుంది. మీ పిసినారితనం మీరూ, నేను ఏం కొంటానో మీకు చెప్పనవసరం లేదు గానీ కార్డు ఇవ్వండి'' అని గట్టిగా అడిగింది రామలక్ష్మి.

"ఏం కొంటావో చెప్పమంటే నా ఆఫీసు గురించి, నా తీరిక గురించి, నా పిసినారితనం గురించి, మతిమరుపు గురించి మాట్లాడుతావెందుకు? పిసినారితనం నేరమేమీ కాదు, అలా పిసినారిగా ఉండబట్టే ఇంత మంచి ఇల్లు కట్టుకున్నాం. నీలాగా నేను కూడా షాపింగులు చేసేవాన్నే అయితే అద్దె ఇంట్లో ఉండవలసి వచ్చేది. ఇప్పుడు నువ్వు షాపింగ్ కి వెళ్లి ఏం కొంటావో చెప్పు, అంతే నేను అడిగేది'' అన్నాడు రమేష్

"ఇప్పుడు నేను ఏమీ చెప్పలేను, అన్నీ కొనుక్కొని వచ్చిన తర్వాత మీకు చూపిస్తాను, వాటిల్లో అనవసరమైనది ఏమైనా ఉంటే అప్పుడు చెప్పుదురు గానీ, వాటిని వెనక్కి ఇచ్చి వస్తాను, ఇప్పుడు ఇంకో మాట మాట్లాడకుండా కార్డు ఇవ్వండి'', అని దబాయించింది రామలక్ష్మి.

రమేష్ మారు మాట్లాడకుండా ఏటీఎం కార్డు తీసి రామలక్ష్మికి ఇచ్చాడు.

రామలక్ష్మి వెళ్ళిపోయింది. ఆమె వెళ్లిపోయిన తర్వాత రమేష్ తన భార్య ఎన్ని చీరలు నగలు విలువైన వస్తువులు కొంటుందో అని భయపడసాగాడు. సంక్రాంతి పండుగ దగ్గర్లోనే ఉంది, తమ ఇంటి చుట్టుపక్కల ఆడవాళ్ళందరూ వేల రూపాయలు ఖర్చుపెట్టి షాపింగులు

చేస్తూ ఉన్నారు. అలాగే రామలక్ష్మి కూడా వేల రూపాయలు ఖర్చు పెట్టి షాపింగ్ చేస్తుందని అతని గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. తాను డబ్బులు ఖర్చు పెట్టకుండా జాగ్రత్తగా ఆదా చేస్తూ ఉంటే రామలక్ష్మి మాత్రం అనవసరంగా డబ్బులు ఖర్చు పెట్టి ఇంట్లోకి వస్తువులు కొని తెచ్చిపెడుతుందని ఆమె మీద రమేష్ విసుక్కున్నాడు. రామలక్ష్మి షాపుల్లో వస్తువులు కొంటూ ఆమె చెల్లించిన డబ్బులకు సంబంధించిన బిల్లులు రమేష్ సెల్ కు మెసేజ్ ల రూపంలో వస్తూ ఉంటాయి. వాటిని చూసి అతను దిగులు పడుతూ ఉంటాడు. పండుగ సందర్భంగా రామలక్ష్మి ఎన్ని కొంటుందో ఎంత డబ్బులు ఖర్చు పెడుతుందో అని అతను బెంబేలు పడసాగాడు.

రమేష్ భయపడుతున్నట్లుగానే ఒక షాపులో తన ఏటీఎం కార్డు నుంచి పదివేల రూపాయలు బిల్లు చెల్లించినట్లుగా అతని సెల్ కు మెసేజ్ వచ్చింది. రమేష్ ఆ బిల్లు చూసి కంగారు పడిపోయాడు. కాసేపైన తర్వాత మరొక షాపులో 5000 బిల్లు చెల్లించినట్లుగా మరొక మెసేజ్ వచ్చింది. రమేష్ లో తత్తరపాటు మొదలైంది. కాసేపైన తర్వాత మరొక షాపులో 20000 బిల్లు చెల్లించినట్లుగా అతనికి ఇంకొక మెసేజ్ వచ్చింది. దానితో రమేష్ కు బీ.పి పెరిగిపోయింది. అలాగా రమేష్ కు ఇంకా రెండు మూడు బిల్లులు చెల్లించినట్లుగా అతని సెల్ కు మెసేజ్ లు వచ్చాయి. వాటిని చూసిన తర్వాత రమేష్ తన భార్య కొంచెం కూడా ముందు జాగ్రత్త లేకుండా బ్యాంకులోని తన డబ్బంతా ఆమె చీరల కోసం నగల కోసం ఖర్చు చేస్తూ ఉందని ఆమెను తిట్టుకుంటూ భయపడుతూ బాధపడుతూ ఉన్నాడు.

కాసేపైన తర్వాత రామలక్ష్మి ఆటోలో వచ్చి కిందికి దిగింది. ఆమె రెండు చేతుల్లోనూ షాపింగ్ పాకెట్ లు ఉన్నాయి. ఇంట్లోకి వచ్చిన తర్వాత భర్తను పిలిచి ఒక్కొక్కటి చూపించసాగింది. మొదటి ప్యాకెట్ లో ఆమె రమేష్ కు కొన్న మూడు జతల బట్టలను తీసి చూపిస్తూ

"మీరు బయట తిరుగుతూ ఉంటారు కదా, మంచి బట్టలు వేసుకోకపోతే ఎలా? ఈ బట్టలు మీకోసమే'' అని అతనికిచ్చింది.

వాటిని చూసి అతను "బాగున్నాయి కానీ, నాకు బట్టలు ఉన్నాయి కదా, ఇవన్నీ ఎందుకు అనవసరమైన ఖర్చు'' అన్నాడు.

"అనవసరమైన ఖర్చు ఏమీ కాదు, ఇది అవసరమైన ఖర్చే. మీరు ఆఫీసుకు పాత బట్టలు వేసుకుని వెళ్తూవుంటే నాకు చాల నామోషీగా వుంది. అందుకనే కొత్త బట్టలు కొన్నాను. రేపటి నుంచి ఈ కొత్త బట్టలు వేసుకుని వెళ్ళండి. నేను తెచ్చినవన్నీ ఒక్కొక్కటి చూపిస్తూ ఉంటాను, వాటిని చూసి మీరు ఇదెందుకు అదెందుకు అని చెప్పవద్దు'' అని చెప్పింది.

ఆ తర్వాత రామలక్ష్మి మరొక ప్యాకెట్ తీసి చూపిస్తూ "మీ లుంగీలు బనియన్లు డ్రాయర్లు అన్నీ పాతబడిపోయి చిరిగిపోయి ఉన్నాయి. వాటిని వాడొద్దు. ఇప్పుడు నేను ఆరు బనియన్లు ఆరు డ్రాయర్లు, ఆరు లుంగీలు తెచ్చాను. రేపటి నుండి ఈ కొత్త వాటినే వాడండి'' అని చెప్పింది

తర్వాత రామలక్ష్మి చిన్న ప్యాకెట్ తీసి అందులో నుంచి టైటాన్ చేతి గడియారం తీసి రమేష్ చేతికి కడుతూ'' ఇంతవరకు మీకు చేతి గడియారం లేదు. అందువల్ల మీరు బయటికి వెళ్ళినప్పుడు టైం తెలుసుకోలేకుండా ఉంటున్నారు. ఇందులో టైం తో పాటు తేదీ, వారం కూడా కనిపిస్తాయి. మీకు తేదీ వారం గుర్తుండవు. అవి తెలియడానికి మీకు ఈ గడియారం తెచ్చాను. గడియారంలో వాటిని చూసుకుంటూ తేదీని వారాన్ని గమనిస్తూ ఉండండి. బయటకు వెళ్ళినప్పుడు టైం ఎంతయిందో చూసుకుంటూ ఉండండి'' అని చెప్పింది.

ఆ తర్వాత ఆమె ఒక బంగారు ఉంగరాన్ని తీసి రమేష్ వేలికి పెడుతూ "ఇంతవరకు మీ ఒంటిమీద ఎలాంటి బంగారం లేదు, మీరు వేలికి బంగారు ఉంగరాన్ని పెట్టుకొని, చేతికి గడియారం పెట్టుకొని మంచి

బట్టలు వేసుకొని ఆఫీసుకు వెళ్తూ ఉంటే చూడాలన్నది నా కోరిక, నా కోరిక తీర్చడం మీ కనీస ధర్మం కదా'' అని చెప్పింది

తర్వాత ఆమె రమేష్ కోసం కొన్న చెప్పులు గొడుగు మొదలు అన్నీ వస్తువులను చూపించి "ఇవన్నీ అవసరమైనవే, వీటిలో అనవసరమైనవి ఏవీ లేవు'' అని చెప్పింది.

ఆమె తెచ్చిన వస్తువులన్నింటినీ చూసిన తర్వాత ఆమెకు తన మీద గల ప్రేమకు ఎంతో మురిసిపోయాడు రమేష్. బాగా సంతోషించాడు. అంతవరకు ఆమె పెట్టిన ఖర్చంతా తన చీరలు నగల కోసం ఖర్చు చేసిందని ఆమెను తిట్టుకున్నందుకు మనసులో బాధపడ్డాడు. ఆమె తన కోసం ఏమి తెచ్చుకోనందుకు మరింత బాధపడుతూ

"అన్నీ నాకే తెచ్చావు, నీకోసం ఏమీ తెచ్చుకోలేదు, నీకు ఉన్న చీరలన్నీ చాలా మామూలు చీరలు, ఖరీదైన చీరలు ఏవీ లేవు, రెండో మూడో పట్టు చీరలు తీసుకో, అలాగే ఆ చేతికి రెండు ఈచేతికి రెండు బంగారు గాజులు కూడా తీసుకో'' అని చెప్పాడు.

"నేనేమైనా ఆఫీసుకు పోతున్నానా? సభలకు సన్మానాలకు పోతున్నానా? ఇంట్లో ఉండేదానికి నాకెందుకు అంత ఖరీదమైన బట్టలు? నాకు ఏమీ అవసరం లేదు'' అని చెప్పింది

"నువ్వు తీసుకోకపోతే నేనే తెస్తాను'' అన్నాడు రమేష్

"మహానుభావా మీరు తీసుకొని రావద్దు, మీరు తెస్తే ఎలా ఉంటాయో నాకు తెలుసు, రేపు మనిద్దరం వెళ్లి మీరు చెప్పినట్లుగా నాకోసం మంచి చీరలు బంగారు గాజులు కొందాం'' అని రామలక్ష్మి సంతోషంగా పలికింది.

భార్యాభర్తలు

శకుంతల రమణారావులు భార్యాభర్తలు. ఉన్నత విద్యావంతులు. పిహెచ్.డి. చేసి వేరు వేరు విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ లుగా పని చేస్తున్నారు. శకుంతల విశాఖపట్నంలో ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ ప్రొఫెసర్ గా పని చేస్తూ ఉంది. రమణారావు గుంటూరులో ఉన్న నాగార్జునా విశ్వవిద్యాలయంలో జువాలజీ ప్రొఫెసర్ గా పని చేస్తున్నాడు. విశ్వవిద్యాలయాల్లో పనిచేసే వారికి బదిలీలు ఉండవు. ఉద్యోగంలో చేరిన విశ్వవిద్యాలయంలో ఉద్యోగ విరమణ చేసేవరకు పని చేయవలసి ఉంటుంది. ఒకవేళ వేరే విశ్వవిద్యాలయానికి వెళ్లాలనుకుంటే చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి అక్కడ మళ్ళీ కొత్తగా ఉద్యోగం పొందవలసి ఉంటుంది.

శకుంతలా రమణారావులు ఒకే చోట ఉండడానికి అవసరమైన ప్రయత్నాలు అన్నీ చేశారు. రమణా రావు శకుంతల పని చేసే ఆంధ్ర

విశ్వవిద్యాలయంలో కొత్తగా ఉద్యోగం పొందడానికి చాల ప్రయత్నించాడు. కుదరలేదు. శకుంతల కూడా రామణారావు పని చేసే నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగం పొందడానికి ప్రయత్నం చేసింది. అది గూడా కుదరలేదు. ఇద్దరూ ఒకచోట ఉండాలంటే ఎవరో ఒకరు ఉద్యోగాన్ని వదులుకోవాలి. ఉన్నత విద్యాభ్యాసం చేసి మంచి జీతం వచ్చే సుఖవంతమైన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదులుకోవడానికి ఇద్దరికీ ఇష్టం లేక పోయింది. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగం చేస్తేనే కుటుంబం వృద్ధిలోకి వస్తుందని, పిల్లలకు మంచి చదువులు చెప్పించి వారికి మంచి భవిష్యత్తును ఇవ్వవచ్చుననే ఉద్దేశంతో ఇక చేసేది లేక వాళ్ళిద్దరూ వేరువేరు నగరాల్లో ఉన్న విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తూ ఉన్నారు.

రమణా రావు వారానికి ఒకసారి అంటే శనివారం రాత్రికి విశాఖపట్నం వచ్చి మళ్లీ ఆదివారం గుంటూరుకు వెళ్ళిపోతూ ఉంటాడు. అలా తిరగడం అతనికి కొంచెం కష్టంగానే ఉంది. అయినప్పటికీ తప్పనిసరి కాబట్టి కష్టమైనా రమణారావు తిరుగుతూ ఉన్నాడు. అప్పుడప్పుడు ఒకటి రెండు రోజులు సెలవు పెట్టి రెండు రోజులు పాటు విశాఖపట్నంలో ఉంటాడు. విశ్వవిద్యాలయాల్లో పనిచేసే వారికి దసరా సెలవులు సంక్రాంతి సెలవులు వేసవి సెలవులు ఉంటాయి. ఆ సెలవుల్లో రమణారావు విశాఖపట్నంలోనే ఉంటాడు.

రమణారావు విశాఖపట్నంలో భార్యతో కలిసి ఉన్నప్పటికీ ఇంటి పనుల్లో ఆమెకు సాయం చేసే వాడు కాదు. మగవాడు ఇంటి పనుల్లో భార్యకు సహాయం చేయడం నామోషీగా చిన్నతనంగా అతను భావించేవాడు. ఇంటి యజమాని హుందాగా ఇంట్లో ఉంటూ పర్యవేక్షణ చేస్తూ ఉండాలి కానీ పనివాడి లాగా పని చేయకూడదు అనే మనస్తత్వం కలిగిన పురుషాహంకార కుటుంబంలో పుట్టి పెరిగిన వాడు కావడం చేత రమణా రావు శకుంతలకు ఇంటి పనుల్లో సాయం చేయడానికి ఇష్టపడేవాడు కాదు. శకుంతల ఇంట్లోకి కావలసిన వస్తువుల జాబితా రాసి ఇస్తే సూపర్

బజార్ కి వెళ్లి వాటిని తీసుకొచ్చి ఇంట్లో పడేయడం మాత్రం అతను చేసేవాడు.

అతను ఉదయం లేచి వాకింగ్ కు వెళ్ళి వచ్చేవాడు. ఆతర్వాత అతను దర్జాగా కుర్చీలో కూర్చుని పేపరు చదువుతూ ఉంటే శకుంతల అతనికి కాఫీ తెచ్చి ఇచ్చేది. శకుంతల టిఫిన్ తయారుచేసి తొమ్మిది గంటల ప్రాంతంలో రమణారావుని పిలిచి టిఫిన్ పెట్టేది. అలాగే మధ్యాహ్నం భోజనం టైంలో భోజనానికి ఆహ్వానించి భోజనం పెట్టేది. రాత్రిపూట కూడా ఆమే పిలిచి రాత్రి భోజనం పెట్టేది. ఇలా రమణారావు దొర లాగా ఏ పని చేయకుండా కూర్చుని అన్ని సౌకర్యాలు శకుంతల ద్వారా పొందేవాడు. అతను విశాఖపట్నంలో ఉంటే శకుంతల చేసే సేవలతో చాలా సంతోషంగా ఆనందంగా సౌకర్యంగా ఉండేవాడు.

గుంటూరులో ఉన్నప్పుడు రమణారావు అన్ని పనులు తానే చేసుకోవలసి వచ్చేది. తప్పనిసరి అయి ఆ పనులన్నీ తానే చేసుకునేవాడు. భోజనం హెూటల్లో చేసేవాడు. ప్రతిరోజు హెూటల్లో తినటం వల్ల హెూటల్ భోజనం అతనికి మొహం మొత్తేది. అంతేకాకుండా కొంత అనారోగ్యంగా కూడా అప్పుడప్పుడు ఉండేది. అలాంటి సమయంలో అతను కష్టపడి వంట చేసుకునేవాడు. అది అతనికి చాలా ఇబ్బందిగా కష్టంగా ఉండేది. అందువల్ల అతను విశాఖపట్నం ఎప్పుడు వెళ్దామా అని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాడు.

శకుంతల కూడా పురుషాహంకారం ఉన్న కుటుంబంలో పుట్టి పెరిగినదే, కాబట్టి ఆమె తన భర్తకు అన్ని రకాల సేవలు చేసేది. అతను ఇంటి పనుల్లో తనకు సహాయం చేయాలని కోరుకునేది కాదు. భర్తకు సేవ చేయడం భార్యగా తన విద్యుక్తధర్మంగా ఆమె భావించేది. ఉదయమే లేచి టిఫిన్ చేసి, వంట చేసి బాక్స్ కట్టుకొని 9:30 కల్లా యూనివర్సిటీకి వెళ్ళవలసి ఉంటుంది. యూనివర్సిటీలో బోధన, ప్రాక్టికల్స్ , పరిశోధనలతో

ఆమెకు ఏమాత్రం తీరిక ఉండేది కాదు. సాయంత్రం ఐదు దాటిన తర్వాత ఇంటికి వచ్చి కాసేపు విశ్రాంతి తీసుకొని మళ్ళీ వంట పనిలో నిమగ్నమయ్యేది. ఇంట్లో పని యూనివర్సిటీలో పని ఆమెకు చాలా కష్టంగా ఉండేది.

సెలవు రోజుల్లో రమణారావు ఇంట్లో ఉండేవాడు. అతనికి అన్ని రకాల సేవలు చేయటానికే ఆమెకు సరిపోయేది . విశ్రాంతి తీసుకోవడానికి అవకాశం ఉండేది కాదు. అయినప్పటికీ ఆమె కష్టపడుతూ భర్తకు అన్ని రకాల సేవలు చేసేది.

ఈలోగా వారికి మొదట అబ్బాయి పుట్టాడు. బాబు ఆలనా పాలన, ఇంట్లో పని, యూనివర్సిటీలో పని శకుంతలకు మరింత కష్టంగా ఉండేది. ఊపిరి తీసుకోవడానికి కూడా ఆమెకు సమయం ఉండేది కాదు. దీనితో ఆమె బాబును చూసుకోవడానికి ఒక ఆయాను ఏర్పాటు చేసుకుంది. తర్వాత రెండు సంవత్సరాలకు పాప పుట్టింది. ఇద్దరు పిల్లల ఆలనా పాలనా, వారి పెంపకం, పిల్లలను స్కూల్లో చేర్పించడం, వాళ్ళని స్కూల్లో దిగబెట్టడం, ఇంటికి తీసుకుని రావడం, వారి హోం వర్క్ చూడడం, ఇంటి పని, విశ్వవిద్యాలయంలో పనితో శకుంతల తీరిక లేకుండా చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆమె జీవితం పైన చెప్పిన విధంగా గానుగెద్దు జీవితం లాగా అయింది.

పిల్లలు పెరిగే కొద్దీ శకుంతలకు కొంత శ్రమ తగ్గింది. పిల్లలు వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటూ తల్లికి కొంత చేదోడువాదోడుగా ఉంటున్నారు.

కాలం గడిచే కొద్దీ శకుంతల ఆలోచనల్లో మెల్లమెల్లగా మార్పు రాసాగింది. విశ్వవిద్యాలయాల్లో తనతో పాటు పని చేసే స్త్రీల జీవితం తనలాగా కాకుండా భిన్నంగా ఉండడం ఆమె గ్రహించింది. వారి భర్తలు భార్యలకు అన్ని పనుల్లోనూ సాయం చేస్తూ చేదోడువాదోడుగా ఉంటున్నారు. కానీ తన భర్త అలా ఉండడం లేదు. ఏవిషయంలోనూ తనకు సాయం

చేయడం లేదు. తాను కూడా అతన్ని సాయం చేయమని కోరలేదు. అతను వేరే ఊర్లో ఉండటం, వారానికి ఒకసారి వచ్చి ఒక్కరోజు మాత్రమే ఉండడం, ఉన్న ఒక్కరోజు అతన్ని శ్రమ పెట్టడం ఎందుకులెమ్మని ఆమె భర్తకు ఏ పని చెప్పేది కాదు.

కాలం గడిచిపోతూవుంది. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళై ఉద్యోగాల్లో చేరారు. వాళ్లకు పెళ్లిళ్లు కూడా చేశారు. కొడుకు బెంగళూరులో కూతురు హైదరాబాదులో ఉద్యోగాలు చేసుకుంటూ హాయిగా ఉంటున్నారు.

కాలం గడిచే కొద్దీ శకుంతల ఆలోచనల్లో చాలా మార్పు రాసాగింది. భార్య భర్తల్లో ఒకరు ఎక్కువ కాదు, ఒకరు తక్కువ కాదు, ఇద్దరూ సమానమే అనే భావం ఆమెలో కలుగసాగింది. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు భార్యాభర్తలు ఇద్దరు కలిసి అన్ని పనుల్లోనూ పరస్పరం సాయం చేసుకోవాలని ఆమె భావించింది. చాలామంది పురుషులు ఆ విధంగా భార్యలకు సాయం చేస్తున్నారని ఆమె గ్రహించింది.

ఇలా ఉండగా రమణారావు ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాడు. అతను శకుంతల కంటే మూడు సంవత్సరాలు పెద్దవాడు. అందువల్ల అతను శకుంతల కంటే మూడేళ్ల ముందుగా ఉద్యోగ విరమణ చేసి విశాఖపట్నానికి వచ్చాడు. వచ్చినప్పటి నుంచి అతను ఖాళీగా ఉంటున్నాడు.

రమణారావు ఉద్యోగ విరమణ చేసి వచ్చినప్పటి నుంచి శకుంతల ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. ఆమె రమణారావుకు ఎలాంటి సేవలు చేయడం లేదు. ఆమెకు భర్త మీద ఒక రకమైన అసూయ ఏర్పడింది. తాను భర్తతో సమానంగా చదువుకొని అతనితో సమానంగా యూనివర్సిటీలో ఉద్యోగం చేస్తూ తాను మాత్రమే కుటుంబం కోసం కష్టపడుతూ ఇంతకాలం అతనికి పిల్లలకు మొత్తం కుటుంబానికి అనేక రకాలుగా సేవలు చేసి అలసిపోయానని, అతను మాత్రం ఏ పని చేయకుండా కాలు మీద కాలు వేసుకుని దర్జాగా తనతో అనేక రకాల సేవలు పొందాడని, ప్రస్తుతం

అతను రిటైర్ అయి వచ్చి ఖాళీగా ఉన్నాడు కాబట్టి గతంలో తాను చేసిన సేవలన్నీ అతను తనకు చేయాలని ఆమె భావిస్తూ ఉంది. తనకు విశ్రాంతి చాలా అవసరం అని కూడా భావిస్తూ ఉంది. అదే విషయాన్ని ఆమె భర్తకు చెప్పింది.

"నేను గత 30 సంవత్సరాలుగా పిల్లల పెంపకం, కుటుంబ నిర్వహణ బాధ్యతలతో, యూనివర్సిటీ విధి నిర్వహణతో అష్ట కష్టాలు పడుతూ విశ్రాంతి లేకుండా చాలా అలసిపోయి ఉన్నాను. ఇంతవరకు మీరు కుటుంబ నిర్వహణలో పాలు పంచుకోలేదు. మీరు వారానికి ఒకసారి వచ్చి అతిథి లాగా ఉంటూ నా చేత అన్ని సపర్యలు సేవలు చేయించుకున్నారు. కుటుంబ నిర్వహణలో నాకు ఎలాంటి సాయం చేయలేదు. నేను మీతో సమానంగా చదువుకొని సమానమైన ఉద్యోగం చేస్తూ మీకు అవసరమైన అన్ని సేవలు చేసి అలసిపోయి ఉన్నాను. ప్రస్తుతం నాకు చాలా విశ్రాంతి అవసరం. ప్రస్తుతం మీరు ఖాళీగా ఉన్నారు కాబట్టి కుటుంబ నిర్వహణ మొత్తం మీరే చేయాలి. అంతేకాదు గతంలో నేను మీకు చేసిన సేవలు నాకు మీరు చేయాలి. నేను ఉదయమే లేచి వాకింగ్ కి వెళ్లి వస్తాను. మీరు ఉదయమే లేచి టిఫిన్ తయారు చేసి నాకు వడ్డించాలి. మధ్యాహ్నం రాత్రి వంట చేసి నాకు భోజనం వడ్డించాలి. మార్కెట్ కి వెళ్లి కూరగాయలు మొదలైనవి అన్నీ మీరే తీసుకొని రావాలి'' అని భర్తతో చెప్పింది.

"శకుంతలా, నువ్వేనా ఇలా మాట్లాడుతున్నది, నీ మాటలు వింటూవుంటే నాకు చాలా ఆశ్చర్యం కలుగుతూవుంది. గతానికి ఇప్పటికీ నీలో చాలా మార్పు కనిపిస్తూవుంది. నువ్విలా మాట్లాడుతావని నేను ఎప్పుడూ ఊహించలేదు. మన పెళ్లి అయినప్పటి నుంచి నువ్వు చాలా కష్టపడిన మాట నిజమే, నేను నీ కష్టంలో పాలుపంచుకోని మాట నిజమే, కానీ నేను దూరంగా ఉన్నాను కాబట్టి సంసార నిర్వహణలో నీకు ఎలాంటి సహాయం చేయలేకపోయాను. పైగా నువ్వు సాయం చేయమని ఎప్పుడూ నన్ను అడగలేదు. నువ్వు చెప్పినట్లుగా నీకు విశ్రాంతి అవసరమే, నువ్వు

విశ్రాంతి తీసుకో, మనకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు. నాకు పెన్షన్ బాగానే వస్తుంది. నువ్వు ఇంకా ఉద్యోగం చేస్తున్నావు. మన పిల్లలు ఉద్యోగాలు చేసుకుంటూ హాయిగా ఉన్నారు. మనం వారికి డబ్బులు పంపనవసరం లేదు. మనం డబ్బుల గురించి పెద్దగా ఆలోచించనవసరం లేదు. ఒక వంట మనిషిని ఇంట్లోనే పెట్టుకుందాం, ఆమె మన ఇద్దరికీ వంట చేసి పెడుతుంది. నువ్వు కోరినట్లుగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం ఆమె నీకు వడ్డిస్తుంది. నువ్వు పూర్తిగా విశ్రాంతి తీసుకోవచ్చు'' అన్నాడు రమణారావు.

"అవును, మీరన్నట్లుగా నేను పూర్తిగా మారిపోయాను. మనుషులు ఎప్పుడూ ఒకేలాగా ఉండరు కదా, కాలాన్ని బట్టి అవసరాన్ని బట్టి మనుషులు మారిపోతుంటారు. నేను సంసార నిర్వహణలో అష్ట కష్టాలు పడుతూ ఉంటే మీరు చూస్తూ ఉన్నారే గానీ నాకు కొంచెం కూడా సహాయం చేయలేదు. సహాయం చేయమని నేను మిమ్మల్ని అడగాలా? మీకు మనసుంటే హృదయముంటే మీఅంతట మీరే వచ్చి నాకు సహాయం చేసేవారు. మీకు మనసు అనేది లేదు, హృదయమనేది లేదు. మీకు సేవలు చేయమని నన్ను మీరు అడిగారా, నా అంతట నేనే చేశాను. అలాగే మీరు కూడా మీ అంతట మీరే నాకు సహాయం చేసివుండవచ్చు కదా. మీరు ఏనాడు నాకు సహాయం చేయలేదు. నేను చేసే సేవలు మాత్రం దర్జాగా దొర లాగా చేయించుకున్నారు. మనకు ఆర్థిక సమస్యలు లేని మాట నిజమే. గతంలో కూడా మనకు ఆర్థిక సమస్యలు లేవు. అప్పుడు నేను వంట మనిషిని పెట్టుకొని వంట చేయించలేదు. నేనే వంట చేశాను, వంట మనిషితో వంట చేయించడం నాకు ఏమాత్రం ఇష్టం లేదు. అలాగే ఇప్పుడు కూడా వంట మనిషి మనకు అవసరం లేదు. గతంలో నేను సొంతంగా వంట చేసి ఎలాంటి సేవలు మీకు చేశానో ఇప్పుడు మీరు నాకు సొంతంగా వంట చేసి అలాంటి సేవలన్నీ చేయాలి'' అన్నది శకుంతల.

"నీ మాటలు ఏమాత్రం సమంజసంగా లేవు. గతంలో నువ్వు నాకు సేవలు చేశావు కాబట్టి ఇప్పుడు నేను నీకు సేవలు చేయాలనడం నా దృష్టిలో వితండవాదం లాగా ఉంది. నేను వంట తప్ప మిగిలిన అన్ని పనులు చేయగలను. ఇంటికి అవసరమైన వస్తువులు తెస్తాను. మార్కెట్ కి వెళ్లి కూరగాయలు తెస్తాను. కానీ వంట చేయటం నాకు చేతకాదు. గతంలో నేను గుంటూరులో ఉన్నప్పుడు నేను అప్పుడప్పుడు వంట చేసుకునేవాడిని. కానీ నేను చేసిన వంట నాకే నచ్చేది కాదు. ఇప్పుడు నేను వంట చేస్తే ఆ వంట నువ్వూ తినలేవు నేనూ తినలేను. మన ఇద్దరి ఆరోగ్యాలు పాడవుతాయి. ఈ వయసులో ఇలా పంతాలకు పోయి మన ఆరోగ్యాలు పాడు చేసుకోవటం అవసరమా? మిగతా అన్ని పనులు నేను చేస్తాను. వంట చేయడానికి మాత్రం వంటమనిషిని పెట్టుకుందాం. నువ్వు ఏ పని చేయనక్కర్లేదు, పూర్తిగా విశ్రాంతి తీసుకో" అన్నాడు రమణారావు

"అదేం కుదరదు, మన ఇంటికి సంబంధించిన అన్ని పనులతో పాటు వంట కూడా మీరు చేయవలసిందే, నాకు వడ్డించవలసిందే, వంట చేయడం మీ దృష్టిలో ఆడవాళ్ళ పని, మగవాళ్ళ పని కాదు, వంట చేయడానికి మీకు ఈగో అడ్డు వస్తూవుంది. వంట చేయడం రాదని వంక పెట్టి మీరు వంట చేయడం నుంచి తప్పించుకో చూస్తున్నారు. అలా ఎన్నటికీ కుదరదు. మీరు ఎట్లా వంట చేసినా నేను తినగలను. కాబట్టి మీరు వంట చేయవలసిందే" అని శకుంతల ఖచ్చితంగా చెప్పింది.

"నేను వంట చేయను, నాకు ఈగో అంటున్నావ్, నాకంటే నీకే ఎక్కువ ఈగో ఉంది. ఆ ఈగో తోనే ఇలాంటి మాటలన్నీ మాట్లాడు తున్నావు. నేను వంట మాత్రం చేయను, నువ్వేం చేసుకుంటావో చేసుకో" అని రాఘవరావు కోపంగా మాట్లాడాడు.

"సరే అయితే, రేపటి నుంచి నేను నా వరకు మాత్రమే వంట చేసుకుని తిని వెళ్లిపోతాను. మీరు వంట చేసుకుంటారో హొటల్లో తింటారో మీ ఇష్టం" అని శకుంతల కూడా కోపంగా చెప్పింది.

చెప్పినట్లుగానే శకుంతల మరుసటి రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం తన వరకే చేసుకుని, టిఫిన్ తిని భోజనం బాక్స్ లో పెట్టుకొని యూనివర్సిటీకి వెళ్ళిపోయింది. మళ్లీ సాయంత్రం వచ్చి తన వరకు మాత్రమే రాత్రి భోజనం తయారు చేసుకుని తిని పడుకుంది.

రమణారావు కూడా పంతం పట్టి ఆరోజు హెూటల్లో తిన్నాడు. అలా నాలుగు రోజులు గడిచాయి. హెూటల్ లో భోజనం తినడం వల్ల రమణారావుకు కడుపులో గడబిడ మొదలయింది. మరి రెండు రోజులు గడిచేటప్పటికి రమణారావుకు హెూటల్ భోజనం పడక కడుపులో నొప్పి ప్రారంభమైంది. అతనికి ఏం చేయాలో పాలు పోలేదు. బాగా ఆలోచించి తనకు తెలిసిన మానసిక వైద్యుని దగ్గరికి వెళ్లి తన సమస్య చెప్పుకున్నాడు. వైద్యుడు అతని సమస్యకు తగిన సలహా ఇచ్చాడు.

"భార్యాభర్తలు ఇద్దరూ సమానమే. ఒకరు ఎక్కువా కాదు ఒకరు తక్కువా కాదు. భార్య మాట వినటం అవమానం కాదు. మీ భార్య గతంలో మీకూ మీ కుటుంబానికి చేసిన సేవను గుర్తించండి. ప్రస్తుతం ఆమె ఒక చిన్న మానసిక సమస్యతో ఉన్నది. అది చాలా చిన్న సమస్య. మీరు ఆమె చెప్పినట్లు చేస్తే ఆమె సమస్య తీరిపోతుంది. ఆమె సంతోషంగా ఉంటుంది. మీరూ సంతోషంగా ఉంటారు. మీరు ఎంతో కాలం ఆమె చెప్పిన పనులన్నీ చేయనక్కరలేదు. ఆమె చెప్పినట్లుగా చేస్తే ఒక నెల రోజుల్లో ఆమె మళ్లీ మామూలు స్థితికి వస్తుంది. భార్యలు చాలా మంచి వాళ్ళు సార్. భర్తలు కష్టపడుతూ ఉంటే చూడలేరు. కాబట్టి మీరు ఏమీ ఆలోచించకుండా ఆమె చెప్పినట్లుగా అన్ని పనులు చేయండి. ఇంటికి వెళ్ళగానే ఒకసారి ఆమెకు "సారీ" చెప్పి ఆమె చెప్పిన పలన్నీ చేయండి. ఇదే మీ సమస్యకు పరిష్కారం" అని మానసిక వైద్యుడు రమణారావుకు చెప్పాడు.

ఆరోజు సాయంత్రం శకుంతల యూనివర్సిటీ నుంచి రాగానే రమణారావు ఆమెను కలుసుకొని గతంలో తాను ఆమెకు ఇంటి పనుల్లో

సహాయం చేయనందుకు సారీ చెప్పాడు. ఆ రోజు నుంచి ఆమె చెప్పినట్లుగా వంటతో పాటు అన్ని పనులు చేస్తానని ఆమెకు దగ్గరుండి వడ్డిస్తానని కూడా చెప్పాడు. చెప్పినట్లుగానే మరుసటి రోజు రమణారావు ఉదయమే లేచి కాఫీ చేసి శకుంతలను లేపి ఆమెకు గుడ్ మార్నింగ్ చెప్పి కాఫీ కప్పు అందించాడు. అతనిలో వచ్చిన మార్పుకు శకుంతల చాలా సంతోషించింది. ఆమెకు ఇష్టమైన టిఫిన్ చేసి ప్లేటులో వడ్డించి టిఫిన్ పెట్టాడు. ఆమెను అడిగి ఆమె చెప్పిన కూరలతో మధ్యాహ్నం వంట చేసి ఆమెకు భోజనం వడ్డించాడు. అలాగే రాత్రి కూడా చేసి ఆమెకు వడ్డించాడు. కొత్తగా కారు కొని ఆమెను యూనివర్సిటీలో దింపి మళ్ళీ ఆమెను యూనివర్సిటీ నుంచి ఇంటికి తెచ్చాడు. రమణారావు శకుంతలను ఒక్క పని కూడా చేయనివ్వకుండా నెల రోజులపాటు అన్నీ తానే చేశాడు. నెల రోజుల్లో శకుంతల మామూలు మనిషి అయింది. భర్త తనకోసం కష్టపడుతున్నందుకు ఆమె బాధపడింది. తానే మాట్లాడి వంట మనిషిని కుదుర్చుకుంది. వంట ఏమి చేయాలో ఎలా చేయాలో అన్నీ వంటావిడకు చెప్పింది. శకుంతల మామూలు మనిషి అయినందుకు రమణా రావు ఊపిరి పీల్చుకున్నాడు, చాలా సంతోషించాడు.

అప్పటినుంచి రమణారావు శకుంతలను ఇంటికి సంబంధించిన ఏ పని చేయనివ్వకుండా అన్ని పనులు తానే చేస్తూ ఆమెకు పూర్తి విశ్రాంతినిచ్చాడు. ఆమె మాత్రమే చేయవలసిన పనులు ఏమైనా ఉంటే వాటిలో కూడా ఆమెకు సాయం చేస్తూ చేదోడువాదోడుగా ఉన్నాడు. అప్పటినుంచి దంపతులిద్దరూ సుఖంగా సంతోషంగా ఉన్నారు.

సంతానం

మేముంటున్న అద్దె యింటి ఆవరణలో నాలుగు పోర్షన్లు ఉన్నాయి. అన్ని పోర్షన్లకు కలిపి ఒకటే ప్రహరీ గోడ. అన్ని పోర్షన్లు రైలు పెట్టెల మాదిరిగా ఒక గది తర్వాత మరొక గది వరుసగా మొత్తం మూడు గదులున్నాయి. మొదటి గది డ్రాయింగ్ రూం, రెండవ గది బెడ్ రూమ్, మూడవది వంటగది. చివర స్నానం గది, లెట్రిన్ ఉంటాయి. అటువైపు నుంచి మొదటి పోర్షన్ లో ఇల్లు గలవారుంటారు. మిగిలిన మూడు పోర్షన్లు అద్దెకిస్తారు. మేము ఇటువైపు చివరి పోర్షన్లో ఉన్నాం.

మా వారు పాండురంగారావు గారికి సొంత వ్యాపారముంది. ఉదయం టిఫిన్ చేసి 9 గంటలకు ఆఫీస్ కు వెళ్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనానికి వచ్చి మళ్లీ మూడు గంటలకు ఆఫీస్ కు వెళ్తారు. రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి వస్తారు. ఇది వారి దినచర్య. మావారి వ్యాపారం బాగానే సాగుతుంది. మాకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు.

ఇంటికి సంబంధించిన అన్ని పనులు నేనే చేసుకుంటాను. అంట్లు తోమడం, వంట చేసుకోవడం, ఇల్లు శుభ్రం చేయడం, బట్టలుతకడం, ఇంటికి సంబంధించిన సామానులు కొనుక్కురావడం, కూరగాయలు కొనుక్కోవడం మొదలైన అన్ని పనులు నేనే చేసుకుంటాను. మా వారు ఆయన వ్యాపారానికి సంబంధించిన పనులతో బిజీగా ఉంటారు. అందువల్ల ఇంటికి సంబంధించిన విషయాలు పూర్తిగా నాకు వదిలేశారు. నాకు కూడా ఖాళీగా ఉండటం ఇష్టముండదు. ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూ ఉంటాను. పని మనుషులతో పని చేయించడం నాకు అసలు ఇష్టముండదు. పని మనుషులు పని శుభ్రంగా చేయరు. వారు చేసే పని నాకు అసలు నచ్చదు, అందువల్ల మా ఇంటికి సంబంధించిన అన్ని పనులు నేనే చేసుకుంటాను. ఖాళీగా ఉండడం నాకు ఏమాత్రం ఇష్టముండదు. ఏదో ఒక పని చేసుకుంటూనే ఉంటాను. ఏ పని లేకపోతే చేసిన పనే మళ్ళీ మళ్ళీ చేస్తూ ఉంటాను. అందువల్ల నన్ను తెలిసినవారు నన్ను గురించి పని రాక్షసి అంటూ ఉంటారు. అది నాకు ఒక రకంగా కితాబు లాంటిది.

ఇంటర్మీడియట్ అయిపోగానే మావాళ్ళు నాకు పెళ్లి చేశారు. నాకు పెళ్లై ఆరు సంవత్సరాలయింది. ఇంతవరకు పిల్లలు కలగలేదు. నాకు పిల్లలంటే చాలా ఇష్టం. పెళ్లి అయిన రెండవ సంవత్సరం నుంచి సంతానం కోసం ప్రయత్నిస్తున్నాను. మా వూర్లో ఉన్న అన్ని దేవాలయాలకు వెళ్లి సంతానం కలిగించుమని ఆ దేవతలను వేడుకున్నాను. చుట్టుపక్కల దగ్గర్లో ఉన్న అన్ని పుణ్యక్షేత్రాలకు వెళ్లి సంతానం కలిగించమని ప్రార్థించాను. ఫలితం లేదు. ఇంకా పక్కింటివారు, చుట్టాలు బంధువులు చెప్పిన దూరంగా ఉన్న తిరుపతి, అన్నవరం మొదలైన పుణ్యక్షేత్రాలకు వెళ్లి ఆయా దేవుళ్ళకు మొక్కుకున్నాను. సంతానం కలిగితే మొక్కు తీరుస్తానని ముడుపు చెల్లిస్తానని అనేక రకాలుగా మొక్కుకున్నాను. కానీ ఫలితం లేదు. అనేక రకాల నోములు నోశాను. దానధర్మాలు చేశాను. ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా నాకు సంతానం కలగలేదు.

మా వారికి కూడా పిల్లలంటే బాగా ఇష్టమే. అయితే ఆయనకు దేవుళ్ళ మీద పెద్దగా నమ్మకం లేదు. అయినప్పటికీ పిల్లల కోసం నేను చేసే నోములు వ్రతాలు మొదలైన వాటి విషయంలో ఆయన అడ్డు చెప్పరు. నాకు పిల్లలంటే ఎంత ఇష్టమో ఆయనకు బాగా తెలుసు. నా ఇష్టాన్ని బాగా గౌరవించేవారు కావడం చేత నోములు వ్రతాలు చేయడం ఆయనకు ఇష్టం లేకపోయినప్పటికీ నా ఇష్టాన్ని కాదనలేక నాకు సహకరిస్తూ ఉంటారు. ఆయన తన వ్యాపారం పనులతో బిజీగా ఉండడం చేత ఆయనకు పిల్లలు లేరన్న దిగులు పెద్దగా లేదు.

చంటి పిల్లలను ఇంట్లో ఉంచుకొని వారిని ప్రేమతో పెంచితే సంతానం కలుగుతుందని ఎవరో చెప్పగా ప్రతిరోజు ఉదయం మామరిది యింటికి వెళ్లి అతని రెండేళ్ళ కూతురును మా ఇంటికి తీసుకొని వచ్చి సాయంత్రం వరకు నా దగ్గరనే ఉంచుకొని ఎంతో ప్రేమగా సొంత కూతురు లాగా ఆపాప ఆలనా పాలనా చేశాను. ఆ పాప గూడా నన్ను ధరణమ్మా అని ఎంతో ప్రేమగా పిలిచేది. పాప నా దగ్గరున్నంత సేపు నాకు చాలా సంతోషంగా ఉండేది. సాయంత్రం కాగానే మా మరిది గాని నా తోడుకోడలు గాని వచ్చి పాపను తీసుకొని వెళ్లేవారు. పాప వెళ్ళిపోగానే నాకు ఏమీ తోచేది కాదు. చాలా బాధగా ఉండేది. పాప మీద నాకు రోజు రోజుకు ప్రేమాభిమానాలు పెరుగుతూ వచ్చాయి. చివరకు మా వారిని ఒప్పించి పాపను దత్తత తీసుకుందాని చెప్పాను. మా వారు కూడా అంగీకరించారు. కానీ మాతోడుకోడలు పాపను మాకు దత్తత ఇవ్వడానికి అంగీకరించలేదు. మా మరిదికి కూడా ఒకటే కూతురు. అయితే వాళ్లకు ఇంకా పిల్లలు పుట్టే అవకాశం ఉంది. వాళ్లు పాప ఒక్కతే చాలనుకున్నారు. ఆ పాపను మాకు ఇచ్చి ఇంకొకరిని కనమని నేను మావారి ద్వారా మా మరిదితో మా తోడుకోడలికి చెప్పించాను. నేను పిల్లలను కనే యంత్రాన్ని కాను అని చెప్పి ఆమె అంగీకరించలేదు. దానితో నాకు చాలా నిరాశ కలిగింది ఎంతో బాధపడ్డాను. ఆ బాధ నుంచి బయటపడడానికి నాకు చాలా రోజులు పట్టింది.

సంతానం కోసం భక్తి మార్గం ద్వారా ప్రయత్నం చేస్తూనే ఆధునిక వైద్యం ద్వారా కూడా నేను మా వారు ప్రయత్నించాం. సంతాన సాఫల్య కేంద్రాల్లో నేను మా వారు పరీక్షలు చేయించుకున్నాం. మా ఇద్దరిలో ఎలాంటి లోపం లేదు. ఆడాక్టర్లు చెప్పిన మందులు సర్జరీలు చేయించుకున్నాను. చాలా కాలం ఆ మందులు వాడాను. ఎన్ని మందులు ఎన్ని సర్జరీలు చేయుచున్నప్పటికీ నాకు సంతానం కలగలేదు. ఐ.యు.ఐ, ఐ.వీ.ఎఫ్ ల ద్వారా కూడా చాలా ప్రయత్నాలు చేశాం. అయినప్పటికీ ఏ ప్రయత్నం ఫలించలేదు. సంతానం లేదన్న దిగులు నాకు రోజు రోజుకు పెరుగుతూ వచ్చింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

చివరకు అనాథ శరణాలయంలో ఒక అమ్మాయిని దత్తత చేసుకుందామని నేను మా వారిని అడిగాను. దానికి ఆయన అంగీకరించలేదు. ఆ పిల్లలు ఎవరికి పుట్టారో, పెరిగి పెద్దయిన తర్వాత ఆపిల్లల ప్రవర్తన ఎలా ఉంటుందో, మనం తెచ్చుకున్న పాప పెరిగి పెద్దయిన తర్వాత మన కులం వాళ్ళు ఆ పాపను పెళ్లి చేసుకోవడానికి అంగీకరించకపోవచ్చు మొదలైన కారణాలు చెప్పి ఆయన అనాథ శరణాలయంలోని పిల్లను దత్తత తీసుకోవడానికి అంగీకరించలేదు. పిల్లల కోసం నేను చేసిన అన్ని ప్రయత్నాలు విఫలం కావడంతో నేను చాలా నిరాశతో దిగులుతో ఉండవలసి వచ్చింది. ఆ నిరాశ నుంచి దిగులు నుంచి బయటపడడానికి నేను అంతకుముందు కంటే ఎక్కువగా అస్తమానం ఏదో ఒక పనిలో నిమగ్నమవుతూ వచ్చాను. అప్పుడప్పుడు మా మరిది కూతురును తెచ్చుకొని ఆ అపాపతో కొంతకాలం కాలక్షేపం చేస్తూ ఉన్నాను.

ఇలా ఉండగా ఆ ఊర్లోని డిగ్రీ కళాశాలలో లెక్చరర్ గా కొత్తగా ఉద్యోగంలో చేరిన సత్యప్రసాద్ అనే ఆయన మా పక్క పోర్షన్ లోకి వచ్చారు. ఆయనకు కొత్తగా పెళ్లి అయిందట. మంచి రోజులు లేకపోవడం చేత భార్యను ఇంకా కాపురానికి తీసుకురాలేదు. ఇంట్లో చేరిన మొదటి రోజు ఆయన మా ఇంటికి వచ్చి మా వారితో పరిచయం చేసుకున్నారు.

సుమారు ఆరు అడుగుల ఎత్తు, చామన చాయను మించిన రంగు అమాయకమైన ముఖం కలిగిన ఆయన ఎంతో హుందాగా గంభీరంగా ఉండేవారు. ఎలాంటి భేషజాలు లేకుండా చాలా సర్వసాధారణంగా కనిపిస్తారు. మితభాషి అయిన సత్యప్రసాద్ గారు ఉదయం **8:30** కి ఇంటి నుంచి బయలుదేరి మళ్ళీ సాయంత్రం ఐదు తర్వాత ఇంటికి వచ్చేవారు. సైకిల్ మీద కాలేజీకి వెళ్లి వచ్చేవారు. ఇంటర్మీడియట్ తో చదువు ఆపేసిన నాకు కాలేజీ లెక్చరర్ అయిన సత్యప్రసాద్ గారిని ఆశ్చర్యంతో చూసేదాన్ని. చదువు అంటే నాకు చాలా ఇష్టం, బాగా చదవాలని నాకు ఎంతో కోరిక ఉండేది. నా కోరికను మన్నించకుండా మా అమ్మానాన్న ఇంటర్మీడియట్ అయిపోగానే నాకు ఇష్టం లేకపోయినప్పటికీ పెళ్లి చేశారు.

నెల రోజుల తర్వాత సత్యప్రసాద్ గారు తన భార్యను తీసుకొని వచ్చారు. ఆమె చాలా అందంగా ఉంది, పేరు కమల, నాకంటే సుమారు నాలుగు సంవత్సరాలు చిన్నది. మంచి కలుపుగోలు మనిషి, మా ఇల్లు పక్క పక్కన ఉండడం చేత మేము త్వరలోనే మంచి స్నేహితులమయ్యాం. కొత్త కాపురం కావడం చేత ఇంట్లోకి కావలసిన ముఖ్యంగా వంటకు కావలసిన పాత్రలు మొదలైనవి కొనడంలో నేను ఆమెకు సహాయం చేశాను. ఆమెకు వంట చేయడం పెద్దగా రాదు. ఏ కూర ఎలా చేయాలో నేను చెప్పాను. నేను చేసిన కూరలు సాంబారు మొదలైనవి ఆవిడకు ఇచ్చేదాన్ని. నేను చేసిన వంటను బాగా మెచ్చుకునేది. కొద్ది రోజుల్లోనే ఆమె అన్ని రకాల వంటలను చక్కగా చేయడం నేర్చుకుంది.

సత్యప్రసాద్ గారు కాలేజీ నుంచి నవలలు కథల పుస్తకాలు కమల గారి కోసం తెచ్చేవారు. ఆమె వాటిని కాలక్షేపం కోసం చదివేది. ఆమె దగ్గర నుంచి నేను ఆ పుస్తకాలను తీసుకొని చదివేదాన్ని. అలా చదవటం వల్ల నాకు చదువు మీద ఇంకా ఆసక్తి పెరిగింది. దూరవిద్య ద్వారా డిగ్రీ చదవడానికి అవకాశం ఉంటుందేమో తెలుసుకోమని నేను కమల గారికి చెప్పాను. ఆవిడ చదువు మీద నాకు గల ఆసక్తిని గురించి భర్తకు చెప్పింది.

ఆయన తాను చదివిన ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం నుంచి బీ.ఏ. డిగ్రీ దరఖాస్తు ఫారం తెప్పించి ఇచ్చారు. అంతేకాకుండా దాన్ని ఎలా నింపాలో దానికి అవసరమైన ఇతర సర్టిఫికెట్లు ఏవేవి పంపాలో అన్ని వివరంగా చెప్పి దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి దూరవిద్యా కేంద్రానికి పంపించారు.

పదిహేను రోజుల్లో దూరవిద్యా కేంద్రం నుంచి బీ.ఏ. మొదటి సంవత్సరం చదవడానికి అవసరమైన స్టడీ మెటీరియల్ మొత్తం నాకు వచ్చింది. నేను అది చదవడం ప్రారంభించాను. అర్థం కాని అంశాలను సత్యప్రసాద్ గారి ద్వారా తెలుసుకోవడం మొదలుపెట్టాను. ఆయన అన్ని విషయాలను చాలా ఓపిగ్గా చక్కగా అర్థమయ్యేలాగా చెప్పేవారు. నా పట్ల చాలా మర్యాదగా హుందాగా వ్యవహరించేవారు. ఆయన ప్రవర్తన చూసిన తర్వాత నాకు ఆయన మీద చాలా గౌరవం ఏర్పడింది.

ఇలా సుమారు ఆరు నెలలు గడిచింది. అప్పుడు కమల గారు తనకు మూడో నెల అనే విషయాన్ని చెప్పింది. నేను చాలా సంతోషించాను. సత్యప్రసాద్ గారు గర్భవతి అయిన భార్య పట్ల చాలా శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు డాక్టర్ దగ్గరికి తీసుకొని వెళ్లి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. నేను నా పనులన్నీ త్వరగా ముగించుకొని కమల గారి ఇంట్లోకి వెళ్లి ఆవిడకు అన్ని రకాల సహాయం చేసేదాన్ని. మా రెండిళ్ళనూ కలుపుతూ మధ్య గదిలో వాకిలి వుంది. ఆ వాకిలి తలుపులు తెరిచి మేమిద్దరం వాళ్ళింట్లోకి మా ఇంట్లోకి రాకపోకలు చేసేవాళ్ళం. తనకు నేను చేసిన సహాయానికి కమల గారు నన్ను బాగా మెచ్చుకునేవారు, చాలా సంతోషించేవారు.

ఏడవ నెలలో కమల గారి పుట్టింటి వాళ్ళు వచ్చి ఆమెను కాన్పుకు తీసుకొని వెళ్ళారు. వెళ్ళే ముందు ఆమె నేను చేసిన సహాయాన్ని గురించి మరీ మరీ ప్రస్తావించి ధన్యవాదాలు తెలియజేశారు. కమల గారు వెళ్లిపోయిన తర్వాత నేను మా వారు సత్యప్రసాద్ గారిని మా ఇంట్లోనే భోజనం

చేయమని చాలా రకాలుగా కోరాం. కానీ ఆయన చాలా మర్యాదగా తిరస్కరిస్తూ తనని ఇబ్బంది పెట్టవద్దని, ఇతరులకు ఏమాత్రం అసౌకర్యం కలిగించడం తనకిష్టం లేదని చాలా వినయంగా మా కోరికను తిరస్కరించారు. ఆయన సొంతంగా వంట చేసుకునేవారు. నేను అప్పుడప్పుడు కూరలు ఇచ్చేదాన్ని.

కమల గారు వెళ్ళిపోయిన తర్వాత నేను ఒంటరితనంతో చాలా ఇబ్బంది పడ్డాను. ఆ సమయంలో పిల్లలు లేరన్న దిగులు నన్ను మరింతగా వేదించ సాగింది. పిల్లల గురించి నేను ఆలోచిస్తున్నప్పుడు నా మనసుకు ఒక ఆలోచన వచ్చింది. అది ఎంతవరకు ఆచరణ సాధ్యమో అని నేను తీవ్రంగా ఆలోచించాను. అలా ఆలోచించిన తర్వాత నా ఆలోచనను కార్యాచరణలో పెడితే నాకు సంతానం కలుగుతుందని గట్టిగా నమ్మకం కలిగింది. నా ఆలోచనను కార్యాచరణలో పెట్టడం నా ఒక్కదాని వల్ల అయ్యే పని కాదు. అందుకు మా వారి సహకారం, సత్యప్రసాద్ గారి సహకారం అవసరం. అయితే ఈ సహకారం మామూలుది కాదు. వారిని అడగడానికి కూడా చాలా ఇబ్బందికరమైన విషయం. సంతానం కావాలన్న నా కోరిక చాలా తీవ్రమైనది కావడం చేత ఎంత ఇబ్బంది నైనా ఎదుర్కోవడానికి నేను సిద్ధపడి మొదట మా వారి సహకారాన్ని కోరాను. మా వారు పెద్దగా ఆలోచించకుండానే నేను అడిగిన దానికి అంగీకరించారు. మా వారు అంత త్వరగా నా కోరికను అంగీకరిస్తారని నేను అసలు అనుకోలేదు. అంతేకాదు నేను అలా అడిగిన వెంటనే ఆయన కోపంతో ఊగిపోయి నన్ను చెడమడా తిట్టి, కొడతారని అనుకున్నాను. ఆయన అలా అంగీకరించగానే నేను చాలా ఆశ్చర్యంతో ఆనందంతో ఆయన పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాను. ఆయన నన్ను లేవనెత్తి "సంతానం కావాలన్న కోరిక నీకు ఎంత తీవ్రంగా ఉందో నాకు తెలుసు, నీ కోరిక తీర్చడం భర్తగా నా బాధ్యత. అందువల్ల నేను ఏమాత్రం సంకోచించకుండా నువ్వు కోరిన దానికి అంగీకరిస్తున్నాను'' అని చెప్పారు.

రెండవది సత్యప్రసాద్ గారి సహకారం. ఆయన కాలేజీ నుంచి వచ్చిన తర్వాత మా ఇంటికి వారి ఇంటికి మధ్యలో ఉన్న తలుపు తెరుచుకుని ఆయన దగ్గరికి వెళ్లి నా కోరికను గురించి వారికి వివరించి ఆయన వల్ల కావాల్సిన సహకారాన్ని గురించి అభ్యర్థించాను. దానికి ఆయన ఆశ్చర్యపోయి కొంతసేపటి తర్వాత తేరుకొని అది చాలా అనైతికమని ఆ పని చేయటం తన వల్ల కాదని చెప్పారు. నేను అతను చెప్పిన దానికి ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే ఆయన మనస్తత్వం నాకు బాగానే తెలుసు. నేను అడిగింది ఆయన మనస్తత్వానికి పూర్తిగా విరుద్ధమైన కోరిక. అందువల్ల నా కోరిక తీర్చడానికి ఆయన తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ నేను నిరుత్సాహ పడకుండా సంతానం కోసం నేను చేసిన ప్రయత్నాలు విఫలం కావడం గురించి వివరించాను. సంతానం పట్ల నాకున్న తీవ్రమైన కోరికను వివరించి వేరే దారి లేక ఈ దారిలో ఆయన సహకారాన్ని కోరుతున్నానని దానికి సహకరించి నాకు సంతాన బిక్ష పెట్టాలని మరీ మరీ ప్రార్థించాను. చివరికి నా ప్రార్థనకు ఆయన అంగీకరిస్తూనే అందుకు నా భర్త అంగీకారం కావాలని షరతు పెట్టారు. నా భర్త అంగీకారం తీసుకున్న తర్వాతనే నేను ఆయన సహకారం కోరానని చెప్పాను. నేను చెప్పింది విన్న తర్వాత ఆయన చాలా ఆశ్చర్యపోయి మా వారి మంచితనాన్ని వారి సహృదయతను, హృదయవైశాల్యాన్ని, నా మీద వారికి గల ప్రేమను ఎంతగానో ప్రశంసించారు.

ఆ రోజు నుంచే నేను ఆయనతో పక్కను పంచుకున్నాను. ఆయనతో సంభోగం నాకు చాలా సుఖాన్ని ఆనందాన్ని సంతృప్తిని ఇచ్చింది. నేను కోరినప్పుడల్లా ఆయన నా కోరికను తీర్చారు. ఇది నైతికమా అనైతికమా అని నేను ఆలోచించలేదు. నాకు కావలసింది సంతానం, మా వారికి నా కడుపున పుట్టిన సంతానం కావాలి. వీటిని గురించి మాత్రమే నేను ఆలోచించాను. నా ఆలోచన ప్రకారం నేను నడుచుకున్నాను. దీనికి మా వారి సహకారం సంపూర్ణంగా లభించింది.

ఆ రోజు నుంచి నేను సత్యప్రసాద్ గారిని వంట చేసుకోనివ్వలేదు. నేను చేసిన వంటను ఆయనకు ఇస్తూ వచ్చాను. మా యీ సంబంధం

ఎవరికీ తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే మా రెండిళ్ల మధ్యలో ఉన్న తలుపు ద్వారా నేను నా కార్యక్రమాలన్నీ చేస్తూ వచ్చాను. సత్యప్రసాద్ గారికి నాతో ఆ విధమైన చనువున్నప్పటికీ వారు నన్ను "మీరు అని, ధరణి గారు" అని ఎంతో గౌరవంగా పిలిచేవారు. నన్ను ఏనాడు ఏకవచనంతో పిలువలేదు. వారి ఈ సంస్కారం వారి పట్ల నాకు మరింత గౌరవాన్ని కలిగించింది. ఆయన మా సంబంధాన్ని గురించి ఎవరికీ చెప్పలేదు, చివరకు తన భార్యకు కూడా.

తొమ్మిదో నెల గడిచి పదో నెల ప్రారంభమైన పది రోజులకు కమల గారు మగ పిల్లవాణ్ణి కన్నారు. నేను చాలా సంతోషించాను, సత్యప్రసాద్ గారి సంతోషానికి హద్దులు లేవు. మా వారు కూడా చాలా సంతోషించారు. సత్యప్రసాద్ గారు వెళ్లి తన కుమారుని చూసి వచ్చారు. బాబుకు మూడో నెల ముగుస్తున్నప్పుడు కమల గారు బాబును తీసుకొని వచ్చారు. బాబు చాలా అందంగా ముచ్చట గొలుపుతూ ఉన్నాడు.

అప్పటికి నేను సత్యప్రసాద్ గారితో నా సంబంధాన్ని ఐదు నెలల పాటు కొనసాగించాను. నేను నెలతప్పి రెండు నెలలు అయింది. డాక్టర్ దగ్గరికి వెళ్లి పరీక్ష చేయించుకున్నాను. నాకు రెండు నెలల గర్భం ఉందని డాక్టర్ చెప్పారు. నా సంతోషానికి మేరలేదు. నా ప్రయత్నం ఫలించినందుకు నేను ఎంతగానో ఆనందించాను. మా వారు కూడా చాలా సంతోషించారు. సత్యప్రసాద్ కూడా సంతోషించారు.

అదే సమయంలోనే సత్యప్రసాద్ గారికి వైజాగ్ లో ఉన్న విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా ఉద్యోగం వచ్చింది. వారు కుటుంబంతో సహా వైజాగ్ వెళ్లిపోయారు. కమల గారితో అప్పుడప్పుడు ఫోన్ లో మాట్లాడేదాన్ని. అరుదుగా సత్యప్రసాద్ గారితో కూడా మాట్లాడేదాన్ని. వారు అబ్బాయికి సత్యప్రకాశ్ అని పేరు పెట్టారు.

తొమ్మిది నెలలు నిండిన తర్వాత నాకు అమ్మాయి పుట్టింది. అమ్మాయికి ఎక్కువగా నా పోలికలే వచ్చాయి. నేను మా వారు ఎంతగానో

సంతోషించాము. పాపకు రాగమాల అనే పేరు పెట్టాము. పాప ఆలనా పాలనతో నాకు కాలం తెలియలేదు. చూస్తూ ఉండగానే పాప స్కూల్ కు వెళ్లడం, కాలేజీకి వెళ్ళి బీ.టెక్. పూర్తి చేయడం, అమెరికాకు వెళ్లి ఎమ్.ఎస్. చేసి ఉద్యోగంలో చేరిపోవడం గూడా జరిగింది. పాపకు అమెరికా సంబంధం చూసి పెళ్లి కూడా చేశాం. అమ్మాయి పెళ్లికి సత్యప్రసాద్ గారు కమల గారితో కలిసి వచ్చారు.

సత్యప్రసాద్ గారి రూపంలో పెద్దగా మార్పు లేదు. ఆయన క్రమం తప్పకుండా నడక, యోగాసనాలు ఇతర వ్యాయామాలు చేసేవారు. ఆయనకు యాభై సంవత్సరాల వయసు వచ్చింది. కానీ ఆయన నలభై సంవత్సరాల యువకుని లాగా చాలా ఆరోగ్యంగా ఉన్నారు. ఆయనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. మా ఊర్లో ఉన్నప్పుడు ఆయన కమల గారిని కూడా వాకింగ్ కు రమ్మని ప్రోద్బలం చేసేవారు. కానీ కమల గారు వెళ్లేవారు కాదు. ఆమెకు ఇంటి పనులతో సరిపోయేది. కమల గారిలో చాలా మార్పు వచ్చింది. ఆమెకు షుగరు బీ.పి థైరాయిడ్ మొదలైన ఆరోగ్య సమస్యలు చాలా వచ్చాయి. చాలా కాలం బ్లీడింగ్ సమస్యతో బాధపడ్డారు, చివరకు గర్భసంచి తొలగించవలసి వచ్చింది. నేను అప్పుడప్పుడు ఫోన్ లో మాట్లాడినప్పుడు ఆవిడ తన అనారోగ్యం గురించి చెప్పేవారు. ఆవిడ బాగా చిక్కిపోయి ఉన్నారు. చాలా మందులు వాడుతున్నారు. మా అమ్మాయి పెళ్లికి వచ్చినప్పుడు కమల గారిని చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను. ఆమె వయసు కేవలం నలభై అయిదు సంవత్సరాలు. అనారోగ్యం కారణంగా అరవై సంవత్సరాలు పైబడిన ముసలమ్మ లాగా చాలా బలహీనంగా ఉన్నారు.

వారి అబ్బాయి సత్య ప్రకాష్ కూడా బీ.టెక్. పూర్తి చేసి అమెరికాకు వెళ్లి ఎం.ఎస్. చేసి ఉద్యోగం చేస్తున్నాడు. ఆ అబ్బాయికి అమెరికాలోనే ఉద్యోగం చేస్తున్న అమ్మాయితో పెళ్లి చేశారు. పెళ్లికి నేను మా వారు వెళ్ళాం.

మా వారు వ్యాపారంలో బాగానే సంపాదించారు. ఆయన చేసే వ్యాపారంలో మానసిక ఒత్తిడి ఉంటుంది. ఆయన చాలా కాలంగా మధుమేహం, బీ.పీ జబ్బులతో చాలామందులు వాడుతున్నారు. వ్యాపారం చేయడం కష్టంగా ఉండడం చేత మా వారు తన వ్యాపారాన్ని మంచి గుడ్విల్ కు వేరే వాళ్లకు అమ్మేసి విశ్రాంతి తీసుకుంటున్నారు. అకస్మాత్తుగా మా వారు హార్ట్ ఎటాక్ చేత చనిపోయారు. ఆయన చనిపోయినప్పుడు సత్య ప్రసాద్ గారు కమల గారు వచ్చి నన్ను ఓదార్చారు. మావారు చనిపోయిన తర్వాత కొంతకాలం నేను అమెరికాలో మా అమ్మాయి దగ్గరికి వెళ్లాను. అక్కడ జీవితం నాకు ఏమాత్రం నచ్చలేదు. అందువల్ల ఎక్కువ కాలం అక్కడ ఉండలేకపోయాను. ఇండియాకు తిరిగి వచ్చాను.

నా జీవితం ఒంటరిగా కొంత బరువుగా గడుస్తూ వుంది. అప్పుడప్పుడు సత్య ప్రసాద్ గారు కమల గారు నాకు ఫోన్ చేసి నన్ను ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారు. మా అమ్మాయి అమెరికా నుంచి ప్రతి రోజు నాకు ఫోన్ చేసి నా ఒంటరితనాన్ని పోగొట్టే ప్రయత్నం చేసేది. అమెరికాకు వచ్చి తనతో పాటు ఉండమని గొడవ చేసేది. కానీ అక్కడ జీవితం గురించి నాకు తెలుసు కాబట్టి నేను అక్కడికి వెళ్ళలేదు. చివరకు మా అమ్మాయి నన్ను వేరే పెళ్లి చేసుకోమని కోరింది. అది తప్పు కాదని, మారుతున్న కాలాన్ని బట్టి మనుషులు కూడా మారాలని ఒంటరితనంతో బాధపడే కంటే తోడు కోసం మరో పెళ్లి చేసుకోవడం మంచిదని మా అమ్మాయి చెప్పడం ప్రారంభించింది. నేను దానికి అంగీకరించలేదు.

అనారోగ్యంతో కమల గారు కన్నుమూశారు. నేను వెంటనే వైజాగ్ వెళ్లి సత్య ప్రసాద్ గారిని ఓదార్చే ప్రయత్నం చేశాను. వారి అబ్బాయి కోడలు బంధువులు అందరూ వచ్చారు. కమల గారికి అంత్యక్రియలు చేసిన తర్వాత నేను మా ఊరికి వచ్చాను. పెద్దకర్మకు సత్య ప్రసాద్ గారు వర్తమానం పంపించారు. నేను వెళ్ళాను. పెద్దకర్మ అయిన తర్వాత వారి అబ్బాయి కోడలు అమెరికాకు వెళ్లిపోయారు. సత్య ప్రసాద్ గారు ఒంటరిగా మిగిలిపోయారు. నేను వారిని ఓదార్చి మా ఊరికి వచ్చాను.

నేను మా ఊరికి వచ్చిన తర్వాత తరచుగా సత్యప్రసాద్ గారికి ఫోన్ చేసి అతన్ని ఓదార్చే ప్రయత్నం చేసేదాన్ని. అలాగా ఆరు నెలలు గడిచాయి. ఆ తర్వాత ఒక రోజు నేను మా అమ్మాయి నన్ను మళ్ళీ పెళ్లి చేసుకోమంటూ బలవంతం చేస్తూ ఉందని సత్యప్రసాద్ గారితో చెప్పాను. ఆయన కూడా దానికి వత్తాసు పలుకుతూ నన్ను మళ్ళీ పెళ్లి చేసుకోమన్నారు. అప్పుడు నేను వారితో మనిద్దరం పెళ్లి చేసుకుందామని చెప్పాను. దానికి ఆయన అంగీకరించలేదు. మళ్లీ పెళ్లి చేసుకుంటే నేను ఆయనను తప్ప మరొకరిని పెళ్లి చేసుకోనని ఆయనకు గట్టిగా చెప్పాను. దానికి ఆయన మౌనంగా ఫోన్ పెట్టేశారు.

నేను ఈ విషయమంతా మా అమ్మాయికి చెప్పాను. మా అమ్మాయి సత్యప్రసాద్ గారితో మాట్లాడతానని చెప్పింది. మా అమ్మాయి మొదట సత్యప్రసాద్ గారి అబ్బాయి ప్రకాశ్ తో మాట్లాడింది. ప్రకాశ్ కూడా సత్యప్రసాద్ గారు మళ్ళీ పెళ్లి చేసుకోవడానికి అంగీకరించడమే కాకుండా సత్య ప్రసాద్ గారికి ఫోన్ చేసి ఒంటరిగా జీవితాన్ని భారంగా గడపడం కంటే తోడు కోసం మళ్ళీ పెళ్లి చేసుకోవడం మంచిదని, బాగా పరిచయమున్న ధరణి గారిని పెళ్లి చేసుకోమని చెప్పాడు. ఆయన మొదట అంగీకరించలేదు. ప్రకాశ్ చాలాసార్లు ఫోన్ చేసి బలవంతం చేసేవాడు. మా అమ్మాయి కూడా సత్యప్రసాద్ గారికి ఫోన్ చేసి మా అమ్మను పెళ్లి చేసుకుని ఒంటరితనం నుంచి ఆమెను రక్షించమని కోరింది. దానితో ఆయన నన్ను పెళ్లి చేసుకోవడానికి అంగీకరించారు.

అమెరికా నుంచి సత్యప్రసాద్ గారి అబ్బాయి, కోడలు, మా అమ్మాయి అల్లుడు వచ్చి రిజిస్ట్రార్ ఆఫీసులో మా వివాహం చేశారు. ఆ యువ జంటలు విశాఖపట్నంలో మాతోపాటు కొన్ని రోజులుండి సంతోషంగా అమెరికాకు వెళ్ళిపోయారు. సత్యప్రసాద్ గారితో నా జీవితం సుఖంగా సంతోషంగా సాగుతూ వుంది.

ఇదీ నా జీవిత ప్రస్థానం.

నాన్న బరువయ్యాడు

ఆ కొడుకులిద్దరికీ ముసలాయన, వాళ్ళ నాయన బరువైనాడు. పెద్దకొడుకు పెద్ద డాక్టర్, చిన్న కొడుకు పోలీస్ శాఖలో పెద్ద అధికారి. ఇద్దరూ చాలా డబ్బులు సంపాదించారు, సంపాదిస్తున్నారు. అలాంటి వారికి వాళ్ళ ముసలి తండ్రిని సాకడం చాలా బరువైపోయి ఆ పల్లెటూరిలోనే ఒంటరిగా వదిలేశారు. వినడానికి ఇది చాలా విడ్డూరంగాను నమ్మశక్యం కాని విధంగానూ ఉన్నప్పటికీ అది వాస్తవం, కాబట్టి నమ్మి తీరాల్సిందే. బీదవాళ్లు తిండికి లేని వాళ్ళు ముసలి తల్లిదండ్రులను వదిలివేయడం చాలా చోట్ల జరుగుతూ ఉంది. కానీ కోట్లకు పడగలెత్తిన ధనవంతులు భార్య చనిపోయిన ముసలి తండ్రిని వదిలిపెట్టడం తప్పనిసరిగా ఆశ్చర్యంగానూ నమ్మడానికి కష్టంగానే అనిపిస్తుంది. అయినప్పటికీ అది పచ్చి నిజం, కాబట్టి నమ్మి తీరాల్సిందే.

మస్తాన్ రెడ్డి చదువుకోలేదు. ఒక పల్లెటూర్లో పుట్టి పెరిగాడు. అతనికి 15 ఎకరాల పొలముంది. దాంట్లో కష్టపడి వ్యవసాయం చేసి తన ఇద్దరు

కొడుకులను బాగా చదివించాడు. వాళ్లు కూడా బాగా కష్టపడి చదివి మంచి ప్రయోజకులయ్యారు. పెద్ద కొడుకు సాగర్ ఎం.బి.బి.ఎస్ పూర్తి చేసి ఆ తర్వాత ఎమ్.ఎస్ కూడా చేసి పెద్ద గుండె డాక్టర్ అయ్యాడు. చిన్న కొడుకు సంజయ్ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత కష్టపడి గ్రూప్-1 పరీక్ష పాసై డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ అయ్యాడు. తన కొడుకులిద్దరూ బాగా ప్రయోజకులైనందుకు మస్తాన్ రెడ్డి అతని భార్య చాలా సంతోషించారు. అంతే కాదు తమకు ఇద్దరూ కొడుకులే పుట్టినందుకు వాళ్ళు మరీ ఆనందించారు. కూతురుంటే ఆమెకు పెళ్లి చేయడానికి కట్నం ఇవ్వాలి. కట్నం ఇచ్చి కూతురు పెళ్లి చేయవలసిన బాధ్యత తమకు లేదని ఆ దంపతులు బాగా సంతోషించారు. కొడుకులకు చాలా పెద్ద సంబంధాలు చూసి పెళ్లి చేశారు. కొడుకుల పెళ్లి చేయడంలో దంపతులిద్దరికీ ఎలాంటి కష్టం కలగలేదు. కొడుకులిద్దరూ బాగా ప్రయోజకులు కావడంతో వారి మామలే వారిని తమ కూతుళ్లకు ఇచ్చి అల్లుళ్ళను చేసుకున్నారు.

డాక్టర్ సాగర్ భార్య కూడా పెద్ద డాక్టర్. ఆమె తండ్రి డాక్టర్ గా చాలా డబ్బులు సంపాదించాడు. నగరంలో కూతురు కోసం పెద్ద హాస్పిటల్ కట్టించి ఇచ్చాడు. ఆ హాస్పిటల్లో సాగర్ భార్యతో కలిసి ప్రాక్టీస్ మొదలు పెట్టాడు. ఇంట్లో పూర్తిగా ఆమె పెత్తనమే. పల్లెటూరు వాళ్లైన చాలా మామూలు స్థాయిలో ఉన్న అత్తమామలు అంటే ఆమెకు ఏమాత్రం ఇష్టం లేదు. వాళ్లను ఏనాడు తన ఇంటికి రానివ్వలేదు. భార్య మాట కాదని తల్లిదండ్రులను ఇంటికి తీసుకొని వెళ్లే ధైర్యం సాగరకు లేదు.

సంజయ్ భార్య ఒక ఐపీఎస్ ఆఫీసర్ కూతురు. ఐపీఎస్ ఆఫీసర్ తన సర్వీసులో విచ్చలవిడిగా డబ్బు సంపాదించాడు. కూతురును అల్లారుముద్దుగా నవనాగరికంగా పెంచాడు. ఆమెకు మామూలు స్థాయిలోని మనుషులు మనుషులుగా కనిపించరు. బీదవాళ్లంటే చాలా అసహ్యం. అలాంటి ఆమెకు చాలా సాధారణ స్థాయిలో ఉన్న మస్తాన్ రెడ్డి అతని

భార్య మనుషులుగా కనిపించలేదు. అందుకని వాళ్ళని ఏనాడు తన ఇంటికి రానివ్వలేదు. భార్యను కాదని తల్లిదండ్రులను తన ఇంటికి ఆహ్వానించే స్థితి సంజయ్ కి లేదు

కొడుకులిద్దరూ అలాగా తల్లిదండ్రుల చేతులను వదిలేసి భార్యల చేతుల్లోకి వెళ్లిపోయారు. ఆ దిగులుతోనే మస్తాన్ రెడ్డి భార్య కన్ను మూసింది. ఆమె చనిపోయినప్పుడు కొడుకులు ఇద్దరు మాత్రమే వచ్చారు. కోడళ్ళు రాలేదు. తల్లికి అంత్యక్రియలు నిర్వహించిన తర్వాత కొడుకులిద్దరూ తండ్రిని ఆయన కర్మకు వదిలిపెట్టి వెళ్లిపోయారు.

అప్పటి నుంచి మస్తాన్ రెడ్డి బతుకు దుర్భరమైపోయింది. రెండు చేతులు తెగిపోయిన అవిటి వాడిలాగా అతను అయిపోయాడు. భార్య బతికుండగా ఏనాడు అతను వంట గదిలోకి వెళ్లినవాడు కాదు. వంట గురించి అతనికి ఏమీ తెలియదు. రెండు మూడు రోజులు చుట్టుపక్కల వాళ్ళు అతనికి భోజనం పంపించారు. ఆ తర్వాత పంపలేదు. ఒకవైపు భార్య చనిపోయిన దుఃఖం, రెండో వైపు భోజన సమస్య. భోజనానికి ఏం చేయాలో అతనికి ఏమీ అర్థం కాలేదు. అతను మంచి తిండిపుష్టి ఉన్నవాడు. అతని భార్య జొన్నరొట్టెలు, ఉప్మా, దోశెలు, ఉగ్గాని, పులగం మొదలైన వంటలు ఉదయం పూట చేసేది. అవన్నీ మస్తాన్ రెడ్డికి చాలా ఇష్టం, అతని భార్య చాలా రుచిగా వాటిని చేసేది. అతను చాలా ఇష్టంగా వాటిని బాగా తినేవాడు. భార్యను ఆమె చేసిన వంటలను తలుచుకుంటూ అతను మరింతగా దిగులు పడ్డాడు. ఉదయం లేవగానే అతనికి ఆహారం పెద్ద సమస్యగా మారింది. అతనికి డబ్బు సమస్య లేదు. తన పొలం వల్ల వచ్చే కౌలు డబ్బులు అతనికి సరిపోతాయి.

అతను పట్నంలో వుంటే హెూటల్ కు వెళ్లి భోజనం చేసేవాడు. కానీ అతను ఉన్నది చిన్న పల్లెటూర్లో, ఆ ఊర్లో భోజన హెూటల్ లేదు. చివరకు వంట నేర్చుకోవడం తప్పనిసరి అని అతనికి అర్థమయింది.

మెల్లగా వంట నేర్చుకోవడం ప్రారంభించాడు. అయితే అతను చేసుకున్న కూరలు ఏమాత్రం రుచిగా ఉండేవి కాదు. అతనికి తినబుద్ధి అయ్యేది కాదు. ఒక కూతురుంటే బాగుండేదని అప్పుడు అతనికి అనిపించింది. అంతేకాదు కొడుకులు మరీ గొప్ప ప్రయోజకులు కావడం కూడా తల్లిదండ్రులకు సమస్యే అని అతనికి తెలిసివచ్చింది.

మస్తాన్ రెడ్డి తన ఆహార సమస్యను గురించి కొడుకులకు ఫోన్ చేసి చెప్పాడు. వాళ్లు పెద్దగా స్పందించలేదు. అయినా అతను తన కుమారులను తప్పు పట్టలేదు. వారిని నిందించలేదు. కొడుకుల మీద ప్రేమ అది. ఒక రకంగా అది గుడ్డి ప్రేమ. చాలా మంది తండ్రుల్లో అది ఉంటుంది. తన సమస్యను తానే పరిష్కరించుకోవాలని అతను నిర్ణయించుకున్నాడు. బాగా ఆలోచించి దగ్గర్లో ఉన్న చిన్న పట్టణం లాంటి ఊర్లోకి తన నివాసం మార్చాడు. అక్కడ ఒక చిన్న గదిని అద్దెకు తీసుకున్నాడు. అందులో ఒక స్టవ్ కొనుక్కొని అన్నం మాత్రమే వండుకునేవాడు. కూరలు హొటల్లో తెచ్చుకునేవాడు. ఉదయం పూట టిఫిన్ కూడా హొటల్ నుంచి తెచ్చుకునేవాడు. ప్రస్తుతానికి ఆహారం అనే పెద్ద సమస్య నుంచి అతను బయట పడ్డాడు. అప్పుడప్పుడు దగ్గరలో ఉన్న తన సొంత ఊరికి వెళ్లి ఇంటిని శుభ్రం చేసి వచ్చేవాడు.

మస్తాన్ రెడ్డికి తాత్కాలికంగా ఊరట లభించింది. అతనికి పెద్ద సమస్య ఆహారమే. అది ప్రస్తుతానికి తీరిపోయింది. భవిష్యత్తు ఏమిటనేది అతను పెద్దగా ఆలోచించలేదు. అతను నిరాశావాది కాదు, ఆశావాది. భవిష్యత్తులో తన కుమారుల ఆలోచనలు మారవచ్చు. మనుమలు, మనుమరాళ్ళు పెరిగి పెద్దవారై తన పట్ల ప్రేమను చూపించవచ్చు. ముసలి ముప్పున తనకు ఏదైనా అనారోగ్యం కలిగితే వాళ్ళు చూసుకుంటారన్న ఆశతో అతను ఉన్నాడు. మనిషి ఆశాజీవి కదా !

పల్లెటూరు మనిషి

ఒకసారి నేను వేరే పని మీద అకస్మాత్తుగా రైల్లో తాడేపల్లిగూడెం వెళ్ళాను. అక్కడ పని చూసుకొని అక్కడి నుంచి హైదరాబాదుకు వెళ్ళవలసి ఉంది. ప్రయాణం అకస్మాత్తుగా పెట్టుకోవడం వల్ల ట్రైన్ రిజర్వేషన్ చేయించుకోలేదు. తాడేపల్లిగూడెంలో పని పూర్తి అయ్యేటప్పటికీ రాత్రి పది గంటలయింది. అప్పుడు రైల్వే స్టేషన్ కు వచ్చి ఏదైనా ట్రైన్ లో హైదరాబాద్ కు వెళ్లాలని స్టేషన్లో ఉన్నాను.

నేను ఎక్కవలసిన రైలు రావడానికి ఇంకా సమయముంది. చుట్టూ చూస్తూ కూర్చున్నాను. రాత్రి పది గంటలు అయినప్పటికీ స్టేషన్లో ప్రయాణికులు వస్తూ పోతూ ఉన్నారు. వైజాగ్ వైపు వెళ్లే రైళ్ళు, విజయవాడ వైపు వెళ్లే రైళ్లు వస్తూ పోతూ ఉన్నాయి. టికెట్ చెకింగ్ చేసే ఒకతను స్టేషన్ గేట్ దగ్గర నిలబడి ట్రైన్ దిగిన వాళ్లను టికెట్లు చూపించమని అడుగుతున్నాడు. టికెట్ ఉన్నవాళ్లు టికెట్ చూపించి బయటికి వెళ్లి పోతున్నారు. టికెట్ లేని ముగ్గురు ప్రయాణికులు దూరంగా వెళ్లిపోతున్నారు. అలా వెళ్ళిపోతున్న వారిని టికెట్ చెకింగ్ చేసే వ్యక్తి పరిగెత్తుకొని వెళ్లి వాళ్ళని ఆపి టికెట్ చూపించమని అడుగుతున్నాడు. టిక్కెట్లు లేని ఆ

ప్రయాణికులు చెకింగ్ చేసే టిటిసి ని బతిమాలుతూ ఏదో మాట్లాడుతున్నారు. టిటిసి ముగ్గురు ప్రయాణికులను తీసుకొని వచ్చి తన స్థానంలో కూర్చొని పెనాల్టీ డబ్బులు కట్టమని చెబుతున్నాడు. ఆ ముగ్గురిలో ఒక ఆయన కొంత డబ్బులు టిటిసి కి ఇచ్చి వెళ్లిపోయాడు. ఇద్దరు వ్యక్తులు మాత్రమే మిగిలారు.

ఆ ఇద్దరూ తల్లి కూతుర్లు. తల్లికి నలబై సంవత్సరాల వయసుంటుంది. ఆమె చూడటానికి బాగానే ఉంది. మరీ బీదరాలు లాగా లేదు. మధ్యతరగతికి చెందిన వ్యక్తి లాగా కనిపిస్తూ వుంది. కూతురుకు పది సంవత్సరాలు వయసుంటుంది. ఆ పాప భయం భయంగా అటుఇటు చూస్తూ ఉంది. నేను వాళ్లకు దగ్గరగా ఉన్న ఒక కుర్చీలో కూర్చుని గమనిస్తున్నాను. తల్లి టిటిసితో చెబుతూవుంది.

“సార్ మాది రాజమండ్రి దగ్గర పల్లెటూరు. ఇక్కడికి దగ్గర్లో ఉన్న పల్లెటూరులో మాకు అత్యవసరంగా పని పడింది. నేను మా అమ్మాయి రాజమండ్రి స్టేషన్ కు వచ్చేటప్పటికి ఇప్పుడు మేము ఎక్కి వచ్చిన రైలు కదలడానికి సిద్ధంగా ఉంది. టికెట్ తీసుకునే సమయం లేకపోవడం చేత మేమిద్దరం టికెట్ లేకుండానే రైలు ఎక్కి వచ్చాం. టికెట్టు డబ్బులు కడతాం మమ్మల్ని వదిలేయండి సార్” అని టిటిసి తో చెప్పింది.

“టికెట్ లేకుండా రైలు బండి ఎక్కడ నేరం. దానికి జరిమానా మీకు అయిదు వందల రూపాయలు. ఈ పాపకు రెండు వందల రూపాయలు. మొత్తం జరిమానా ఏడు వందల రూపాయలు. దానితో పాటు టికెట్ డబ్బులు కట్టాలి. మొత్తం ఏడు వందల యాభై రూపాయలు కట్టాలి. టికెట్ డబ్బులు ఒకటే కడితే సరిపోదు. మొత్తం ఏడు వందల యాభై రూపాయలు కట్టండి” అని టిటిసి ఆమెతో అన్నాడు.

“నా దగ్గర అంత డబ్బులు లేవు సార్, మేము పేదవాళ్లం, అనుకోకుండా అత్యవసరంగా బయలుదేర వలసి వచ్చింది. అంత డబ్బులు నేను తీసుకొని రాలేదు. నేను అంత డబ్బులు కట్టలేను. దయచేసి మమ్మల్ని వదిలిపెట్టండి. నేను ఆడ మనిషిని, చిన్న పాపతో ఉన్నాను. మీరు నన్ను వదిలేస్తే మిమ్మల్ని

ఎవరూ అడగరు. అందువల్ల దయచేసి మమ్మల్ని వదిలిపెట్టండి'' అని ఆమె టిటిసి తో బతిమాలుతూ పలికింది.

"నేను దయవలచి మిమ్మల్ని వదిలేయటానికి రైలు నా సొంత ఆస్తి కాదు. ప్రభుత్వం ఆస్తి, నేను ప్రభుత్వ ఉద్యోగిని. ప్రభుత్వం నాకు జీతం ఇస్తున్నది డ్యూటీ సక్రమంగా చేయడానికి, టికెట్ లేకుండా ఎవరూ రైలు ఎక్కకుండా చూడడం నా డ్యూటి. అలా ఎవరైనా ప్రయాణం చేస్తే వారికి జరిమానా విధించాలి. నేను మీ విషయంలో అదే చేస్తున్నాను. అదే మీకు చెబుతున్నాను. మాట్లాడకుండా మొత్తం 750 రూపాయలు కట్టి వెళ్లిపోండి'' అన్నాడు.

"సర్, నేను మిమ్మల్ని అడుక్కుంటున్నాను. అంత డబ్బులు నా దగ్గర లేవు. నేను కట్టలేను, నా దగ్గర డబ్బులుంటే నేను కట్టేదాన్నే, నా దగ్గర లేవు కదా నన్నేం చేయమంటారు? దయచేసి నన్ను నా బిడ్డను వదిలేయండి. దేవుడు మీకు మేలు చేస్తాడు'' అని ఆమె చేతులు జోడించి టిటిసి ని ప్రాధేయపడింది.

"మీరు ఇలాంటి మాటలు మాట్లాడకూడదు. డబ్బులు కట్టకుండా మీరు వెళ్లి అవకాశమే లేదు. నేను డ్యూటీలో చాలా స్ట్రిక్ట్. తప్పకుండా 750 రూపాయలు కట్టవలసిందే'' అని ఆమెతో అన్నాడు.

ఇలా ఆమె బతిమాలూతూ ఉండటం, అతను కాదని చెబుతూ ఉండటం, అరగంట వరకు సాగుతూనే ఉంది. టిటిసి కి యాభై సంవత్సరాల వయస్సు ఉంటుంది. అతను ఆమెతో మాట్లాడుతూ ఆమె వైపు కోరికతో కూడిన కళ్ళతో చూస్తూ ఉన్నాడు. ఆమె అది గమనించి గమనించనట్టుగా మాట్లాడుతూ ఉంది. నేను ఇదంతా చూస్తూ ఆమెకు డబ్బులు సాయం చేద్దామా? వద్దా? అని ఆలోచిస్తూ ఉన్నాను. నేను ఏమైనా సాయం చేస్తానని ఆమె అప్పుడప్పుడు నా వైపు ఆశగా చూస్తూ ఉంది. నేను అది గమనించి గమనించనట్లుగానే ఉన్నాను. ఆమె మరీ పేదరాలుగా కనిపించడం లేదు. ఆమె కట్టగలిగిన స్థితిలో ఉండి డబ్బులు కట్టడం లేదని నా అనుమానం. అందుకనే నేను ఆమెకు సాయం చేయలేదు.

అప్పుడు నేను చుట్టుపక్కల పరిసరాల వైపు చూసాను. కొంతమంది ఆమెను, టిటిసిని గమనిస్తున్నారు. అప్పుడు 60 సంవత్సరాల వయసున్న ఒక పల్లెటూరి వ్యక్తి ఆమె దగ్గరికి వచ్చాడు. "ఎంత డబ్బు కట్టాలమ్మ" అని ఆమెను అడిగాడు. ఆమె 750 రూపాయలు కట్టాలని చెప్పింది. వెంటనే అతను 750 రూపాయలు తీసి ఆమెకు ఇచ్చి డబ్బులు కట్టమని చెప్పాడు. ఆమె మారు మాట్లాడకుండా ఆ డబ్బులు తీసుకొని టిటిసికి ఇచ్చింది. టిటిసి ఆశ్చర్యంతో నోరెల్లబెట్టి చూస్తున్నాడు. ఆమె ఇచ్చిన డబ్బులు తీసుకొని రసీదు రాసి ఆమెకు ఇచ్చాడు. ఆమె తనకు సాయం చేసిన పెద్ద మనిషికి చేతులెత్తి నమస్కరించి ధన్యవాదాలు తెలిపింది. అతను అది పెద్దగా పట్టించుకోకుండా అక్కడి నుంచి ఏమీ తెలియనట్లుగా వెళ్ళిపోయాడు. నేను ఆశ్చర్యపడి అతని వైపు మెచ్చుకోలుగా చూశాను. నేనే కాదు ఆ దృశ్యాన్ని చూస్తున్న చాలామంది అతని వైపు మెచ్చుకోలుగా చూశారు.

నేను అప్పుడు వెళ్ళిపోతున్న అతన్ని పరిశీలనగా చూశాను. అతను పంచ కట్టుకొని అంగి తొడుక్కున్నాడు. తలకు తువ్వాలు చుట్టుకొని ఉన్నాడు. గడ్డం కొంత పెరిగింది. బట్టలు మాసిపోయి ఉన్నాయి. చదువుకున్నట్లుగా లేడు. పూర్తి పల్లెటూరి వ్యక్తి లాగా ఉన్నాడు. అయితేనేమి మనసున్న మారాజు. ఆడబిడ్డ కష్టపడుతుంటే చూడలేక సాయం చేసిన సంస్కారవంతుడు, మానవతా మూర్తి, గుణవంతుడు. అంత సాయం చేసి ఆమె నుంచి ఏమీ ఆశించకుండానే కనీసం కృతజ్ఞతలు కూడా ఆశించకుండా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

నేను చదువుకొని ఆమె బాధను చూస్తూనే ఉన్నాను. కానీ ఆమెకు సాయం చేద్దామా వద్దా అని ఆలోచిస్తూ కాలయాపన చేశాను. చివరికి ఆమెకు సాయం చేయలేకపోయాను. ఈ సంఘటన గుర్తుకు వచ్చినప్పుడల్లా అయ్యో అవసరంతో ఉన్న స్త్రీకి సాయం చేయలేక పోయానే అని బాధపడుతూ ఉంటాను.

నేటి ప్రొఫెసర్

జగదీశ్వర్ రావు పేరుపొందిన విశ్వవిద్యాలయంలో ఎం.ఎస్సీ చేసి ఆ తర్వాత పీహెచ్.డి. కూడా చేశాడు. విశ్వవిద్యాలయాల్లో పీహెచ్.డి. చేయడం అనేది ఒక మాయ. పరిశోధన పర్యవేక్షకులను బట్టి వారి మనస్తత్వాన్ని బట్టి ఉంటుంది.

విశ్వవిద్యాలయంలో పర్యవేక్షకులు అనేక రకాలుగా ఉంటారు. కొందరు చాలా మంచివారు, వీరు తమ దగ్గర పరిశోధన చేసే పరిశోధక విద్యార్థులకు అన్ని రకాల సలహాలు ఇస్తూ వారి చేతనే పరిశోధన చేయించి థీసిస్ గూడా వారి చేతనే రాయిస్తారు. ఇలాంటి పర్యవేక్షకుల వల్ల పరిశోధక విద్యార్థులు మంచి పరిశోధకులుగా తయారవుతారు. వీరు పరిశోధక విద్యార్థుల నుంచి ఎలాంటి డబ్బు ఆశించరు. వారితో తమ సొంత పనులు ఏవీ చేయించుకోరు. కొందరు పర్యవేక్షకులు పూర్తిగా డబ్బు మనుషులు. తమ వద్ద చేరిన పరిశోధక విద్యార్థుల నుంచి డబ్బులు

తీసుకొని పరిశోధన పూర్తిగా తామే చేసి థీసిస్ గూడా తామే రాసి విద్యార్థుల పేరుతో విశ్వవిద్యాలయానికి థీసిస్ సబ్మిట్ చేయిస్తారు. ఇలాంటివారు నాలుగు అయిదు థీసిస్ లు చూసి మరొక థీసిస్ ను తయారు చేస్తారు. ఇదంతా చేసినందుకు వాళ్ళు చాలా డబ్బులు తీసుకుంటారు. డబ్బులు ఎంత అనేది విద్యార్థికి పర్యవేక్షకునికి మధ్య ఉన్న సంబంధాన్ని బట్టి, పరిశోధనాంశాన్ని బట్టి ఉంటుంది. వీళ్ళు పరిశోధక విద్యార్థులను తమ సొంతపనులకు ఉపయోగించుకుంటారు. మరి కొందరు పర్యవేక్షకులు తమ దగ్గర చేరిన పరిశోధక విద్యార్థులకు పరిశోధనకు సంబంధించిన ఎలాంటి సలహాలు ఇవ్వరు. సహాయం చేయరు. పరిశోధక విద్యార్థులే కష్టపడి పరిశోధన చేసి థీసిస్ రాసుకోవాలి. చివర పర్యవేక్షకునిగా థీసిస్ లో సంతకం చేయడానికి వీరు డబ్బులు తీసుకుంటారు. వీళ్ళు పరిశోధక విద్యార్థులను పని మనుషుల లాగా తమ సొంత పనులకు ఉపయోగించుకుంటారు. ఇలాగా విశ్వవిద్యాలయంలో పర్యవేక్షకులు అనేక రకాలుగా ఉంటారు.

జగదీశ్వర్ రావు పర్యవేక్షకుడు డబ్బులు తీసుకొని జగదీశ్వరరావుకు థీసిస్ రాసి ఇచ్చాడు. జగదీశ్వరరావు దాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించి పీహెచ్.డి. డిగ్రీ పొందాడు.

జగదీశ్వరరావుకు ఒక అనుబంధ కళాశాలలో లెక్చరరుగా ఉద్యోగం వచ్చింది. విశ్వవిద్యాలయంలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం లో చేరాలనేది అతని లక్ష్యం. అందుకోసం అతను కళాశాలకు లెక్చరరుగా వెళ్లలేదు.

ఒక సంవత్సరం తరువాత విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సంబంధించిన ప్రకటన వచ్చింది, జగదీశ్వరరావు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసి చాలా గట్టిగా ప్రయత్నం చేశాడు. అతనికి పలుకుబడి బాగానే ఉంది. పైగా ఆ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్

అతని కులానికి చెందినవాడే. అది అతనికి బాగా కలిసి వచ్చింది. అతని కంటే సీనియర్ పరిశోధక విద్యార్థులు పీహెచ్.డి. పొందిన వాళ్లు చాలా మంది ఉన్నప్పటికీ వారందరినీ కాదని జగదీశ్వరరావుకు ఉద్యోగం వచ్చింది.

జగదీశ్వర్ రావు ఉద్యోగంలో చేరిన తర్వాత అతను మొదట చేసిన పని పెళ్లి చేసుకోవడం. చాలా మంచి కట్నంతో అతను పెళ్లి చేసుకున్నాడు. అత్తగారు అతనికి కారు కూడా కొనిచ్చారు.

తర్వాత జగదీశ్వరరావు అత్తగారు ఇచ్చిన డబ్బుతో భార్య పేరుతో వడ్డీ వ్యాపారం మొదలుపెట్టాడు. నెలకు నూటికి నాలుగు రూపాయలు,అయిదు రూపాయలు చొప్పున అతను వడ్డీకి ఇచ్చేవాడు. దానికోసం ప్రత్యేకంగా ఒక ఆఫీసు ముగ్గురు ఉద్యోగులను ఏర్పాటు చేసుకున్నాడు. జగదీశ్వరరావు సాయంత్రం వెళ్లి దాని సంబంధించిన పనులు చూసుకునేవాడు. వడ్డీ వ్యాపారం బాగా సాగింది. అలాగా అతను చాలా డబ్బులు సంపాదించాడు. ఆ తర్వాత అతను కొంతమంది ప్రొఫెసర్ల దగ్గర నెలకు నూటికి రూపాయి నర్ర చొప్పున తీసుకొని దాన్ని తన పద్ధతిలో ఎక్కువ వడ్డీకి ఇచ్చేవాడు. ఇలాగ కూడా అతను చాలా డబ్బులు సంపాదించాడు.

జగదీశ్వర్ రావు వడ్డీ వ్యాపారం చేస్తూనే భార్య ప్రిన్సిపాల్ గా ఒక స్కూల్ ప్రారంభించాడు. మొదట్లో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ప్రవేశపెట్టాడు. అది కార్పొరేట్ ఎలిమెంటరీ స్కూల్, జగదీశ్వరరావు ఫీజులు బాగా వసూలు చేసేవాడు. 4 సంవత్సరాల తర్వాత దాన్ని హైస్కూల్ గా మార్చాడు. అందులో పని చేసే టీచర్లకు కార్యాలయ సిబ్బందికి అతను తక్కువ జీతాలు ఇచ్చేవాడు. విద్యార్థుల దగ్గర చాలా ఎక్కువ ఫీజు వసూలు చేసేవాడు. దీనితో స్కూల్ వల్ల అతనికి చాలా డబ్బులు మిగిలాయి. అతను విద్యా వ్యాపారంలో కూడా చాలా డబ్బులు సంపాదించాడు.

జగదీశ్వర్ రావు ఐదు సంవత్సరాల తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ గా ప్రమోషన్ పొందాడు. అప్పటి నుంచి అతనికి కొంత మంది పరిశోధక విద్యార్థులను పరిశోధన కోసం ఇచ్చారు. పరిశోధక విద్యార్థుల్లో చాలా మందికి ఫెల్లోషిప్ వచ్చేది. జగదీశ్వరరావు వాళ్ళకు వచ్చే ఫెలోషిప్ లో సగం తీసుకునేవాడు. విశ్వవిద్యాలయంలో పర్యవేక్షకులను ధిక్కరించేంత ధైర్యం ఏ పరిశోధక విద్యార్థికి ఉండదు. అతని దగ్గర పనిచేసే పరిశోధక విద్యార్థులు లోపల తిట్టుకుంటూనే తమ ఫెలోషిప్ లో సగం డబ్బులు తప్పనిసరి అయి జగదీశ్వరరావుకు ఇచ్చేవారు. జగదీశ్వర్ రావుకు తన దగ్గర పని చేసే పరిశోధక విద్యార్థులకు పరిశోధనకు సంబంధించిన సలహాలు ఇచ్చే తీరిక ఓపిక లేదు. పరిశోధకులు సొంతంగా కష్టపడి పరిశోధన చేసేవాళ్ళు. థీసిస్ పూర్తయిన తర్వాత దానిమీద పర్యవేక్షకునిగా సంతకం చేయడానికి జగదీశ్వరరావు డబ్బులు తీసుకునేవాడు. ఇలా కూడా అతను డబ్బులు సంపాదించడం నేర్చుకున్నాడు.

జగదీశ్వరరావు వడ్డీ వ్యాపారం బాగా జరుగుతూ వుంది. ఆ డబ్బులతో అతను భార్య పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించాడు. నగర శివారులో ఉన్న భూములు చాలా ఎకరాలు కొన్నాడు. ఆ భూముల్లో ఇళ్ల స్థలాలను వేసి అమ్మటం మొదలుపెట్టాడు. ఈ వ్యాపారం బాగా లాభసాటిగా సాగింది. ఈ వ్యాపారంలో అతను బాగా డబ్బులు సంపాదించాడు. చాలామంది విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు జగదీశ్వర్ రావుకు నెలకు నూటికి రూపాయి నర్ర చొప్పున వడ్డీకి ఇచ్చేవారు. ఆ డబ్బులతో జగదీశ్వరరావు చాలా ఎకరాలు కొని అందులో ఇళ్ల స్థలాలు వేసి అమ్మడం మొదలుపెట్టాడు.

ఆ తర్వాత అతను బాగా ధనవంతులు ఉండే ప్రాంతంలో పెద్ద బంగ్లా లాంటి ఇల్లును కట్టుకున్నాడు. అతనికి ఒక కొడుకు కూతురు. వాళ్లను చాలా పెద్ద స్కూల్లో ఇంగ్లీష్ మీడియం లో చదివిస్తున్నాడు.

మరొక ఐదు సంవత్సరాల తర్వాత జగదీశ్వర్ రావు అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్ గా ప్రమోషన్ పొందాడు. జగదీశ్వర్ రావు వడ్డీ వ్యాపారం, స్కూల్ వ్యాపారం, రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా సాగుతున్నాయి. అతను డబ్బులు బాగా సంపాదిస్తున్నాడు. ప్రొఫెసర్ అయిన తర్వాత అతను విశ్వవిద్యాలయానికి వెళ్లి పాఠాలు చెప్పడం మానేశాడు. అతను చెప్పవలసిన పాఠాలను తన దగ్గర పరిశోధన చేస్తున్న పరిశోధక విద్యార్థుల చేత చెప్పించేవాడు. రోజులో ఎప్పుడో ఒకసారి వెళ్లి హాజరు పట్టికలో సంతకం మాత్రం చేసేవాడు. విశ్వవిద్యాలయానికి సంబంధించిన రాజకీయాల్లో అతను వేలు పెట్టేవాడు కాదు. అందువల్ల అతని జోలికి వైస్ ఛాన్సలర్ గానీ రిజిస్ట్రార్ గానీ వచ్చేవారు కాదు.

జగదీశ్వరరావు వ్యాపారం అతని జీవితం ఇలా సుఖంగా సాగుతూ ఉండగా అతను ఒక భూమి వ్యవహారంలో ప్రసిద్ధి పొందిన రియల్ ఎస్టేట్ వ్యాపారితో తగాదా పెట్టుకున్నాడు. ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి జగదీశ్వరరావుకు నయంగా భయంగా చెప్పి చూశాడు. కానీ జగదీశ్వరరావు వినకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారి జగదీశ్వరరావును హత్య చేయించాడు.

డబ్బుతో ముడిపడిన జగదీశ్వర్ రావు జీవితం చివరికి అలా ముగిసింది.

దురాశ

ఈశ్వర రావు బీ.ఎస్సీ చదివిన తర్వాత టీచర్ ఉద్యోగంలో చేరాలని బీ.ఈడి చేశాడు. ఆ సంవత్సరం డీ.ఎస్సీ ప్రకటన రాలేదు. అందువల్ల అతను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎస్సీ కోర్సులో చేరాడు. ఎం.ఎస్సీ చేస్తున్నప్పుడు డీ.ఎస్సీ ప్రకటన వచ్చింది. అతను దానికి దరఖాస్తు చేసి బాగా చదివాడు. కానీ టీచర్ ఉద్యోగం రాలేదు. దానితో అతను అదే యూనివర్సిటీలో పిహెచ్.డి. కోర్సులో చేరాడు. నాలుగు సంవత్సరాలు కష్టపడి పిహెచ్.డి. పూర్తి చేసాడు. అదే సమయంలో విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు ప్రకటన వచ్చింది. ఈశ్వరరావు ఆ ఉద్యోగానికి దరఖాస్తు చేశాడు. అయితే ఆ ఉద్యోగం వస్తుందని అతను పెద్దగా ఆశపెట్టుకోలేదు. అదృష్టవశాత్తు విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం వచ్చింది.

మంచి పేరున్న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం వచ్చినందుకు అతను ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. తాను చదువుకున్న విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా ఉద్యోగం వస్తుందని అతను ఎప్పుడూ ఊహించలేదు. అంత గొప్ప పేరున్న విశ్వవిద్యాలయంలో తానూ ఒక ప్రొఫెసర్ అయినందుకు అతను చాలా గర్వించాడు. గర్వంతో

ఉప్పొంగిపోయాడు, నా అంతటివాడు ఎవరూ లేరు అని అనుకున్నాడు. అంతవరకు పరిశోధక విద్యార్థుల్లో ఒకడుగా ఉన్న ఈశ్వర రావుకు ఉద్యోగం రాగానే పరిశోధకులందరినీ దూరం పెట్టేశాడు. వాళ్లతో కలవడు సరి కదా వారి మొహం వైపు చూడటం కూడా మానేశాడు. అప్పుడు అతని వయసు 27 సంవత్సరాలు.

ఉద్యోగం వచ్చాక అతని దృష్టి పెళ్లి వైపు మళ్ళింది. అతను చాలా డబ్బు మనిషి. పైగా పిసినారి. మనిషికి కావలసింది మొదటగా డబ్బేనని అతని ఉద్దేశం. డబ్బుంటే సాధించలేనిది ఏదీ లేదని, అది ఉంటే కొండమీది కోతినైనా తీసుకొని రావచ్చు అనేది అతని అభిప్రాయం. అందుకని అతను డబ్బు సంపాదనలో పడిపోయాడు. పెళ్లి దానికి మొదటి మార్గంగా అతను ఎంచుకున్నాడు.

మంచి పేరున్న విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న తనను పెళ్లి చేసుకోవడానికి అమ్మాయి పెట్టి పుట్టి వుండాలని, మంచి అదృష్టవంతురాలై ఉండాలని ఈశ్వరరావు అనుకున్నాడు. తనని పెళ్లాడే అమ్మాయికి ముఖ్యంగా మూడు విషయాలుండాలని అతను నిబంధన పెట్టుకున్నాడు. అమ్మాయి అందంగా ఉండాలి, ఐశ్వర్యవంతురాలై ఎక్కువ కట్నంతో రావాలి, ఉద్యోగం చేస్తూ ఉండాలి. ఈ మూడు అతను తన పెళ్లి కోసం పెట్టుకున్న ప్రత్యేక నిబంధనలు. వీటితోపాటు అమ్మాయికి ఎలాంటి గర్వం గానీ అహంకారం గానీ లేకుండా తాను చెప్పినట్లుగా వినాలి. తన మాటకు ఎదురు చెప్పకూడదు అనేది కూడా అతను ఒక నిబంధనగా పెట్టుకున్నాడు.

యూనివర్సిటీలో ఉద్యోగం ఎలాంటి చీకూ చింతలేని ఉద్యోగం, సెలవులు బాగా ఉంటాయి, పెద్దగా పని ఉండదు, జీతం బాగా వస్తుంది, యూనివర్సిటీ ప్రొఫెసర్ కు తమ కూతురిని ఇస్తే అమ్మాయి బాగా సుఖపడుతుంది అనే ఉద్దేశంతో చాలామంది ఆడపిల్లల తల్లిదండ్రులు తమ అమ్మాయిని ఈశ్వరరావుకు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అయితే

ఇలా వచ్చిన వాళ్లలో ఈశ్వరరావు కోరుకున్న నాలుగు లక్షణాలు ఎవరికీ లేవు. అమ్మాయి అందంగా ఉంటే డబ్బు ఉండటం లేదు, అలాంటివారు ఎక్కువ కట్నం ఇవ్వలేరు, కొంత మంది అమ్మాయిలకు ఉద్యోగం లేదు, మరికొందరికి అందం లేదు, మరి కొందరు ఈశ్వరరావు కోరుకున్నట్లుగా అణగి మణగి ఉండేవాళ్ళుగా అనిపించలేదు. అతను కోరుకున్న నాలుగు లక్షణాల్లో ఏ ఒక్కటి లోపించినా ఆ సంబంధాలను తిరస్కరిస్తూ వచ్చాడు.

ఈశ్వరరావుకు మొదట్లో చాలా సంబంధాలు వచ్చాయి. పెళ్లిళ్ల పేరయ్యలు, మధ్యవర్తులు చాలామంది తమకు తెలిసిన వారి సంబంధాలను గురించి అతని దగ్గర చెప్పేవారు. అతని చుట్టూ చాలా మంది అమ్మాయిల తల్లిదండ్రులు తిరిగారు. అతనికి చాలా డిమాండ్ ఏర్పడింది. అది చూసిన ఈశ్వర్ రావుకు మరింత గర్వం పెరిగింది. తాను కోరుకున్నట్లుగా నాలుగు లక్షణాలు తప్పనిసరిగా ఉండాలని మరింత గట్టిగా అతను నిర్ణయించుకున్నాడు. అయితే అతను చెప్పిన మొదటి మూడు లక్షణాలు ఎవరికీ లేవు. చాలా తక్కువ కాలంలోనే అతని సంబంధం కోసం తిరిగిన వారందరికీ అతని మనస్తత్వం తెలిసింది. అతను పూర్తిగా డబ్బు మనిషని, పరమ పిసినారి అని, అలాంటి వానికి పిల్లనివ్వటం ఒకరకంగా ప్రమాదమని వారు భావించారు. అంతేకాకుండా పెళ్ళిళ్ళ పేరయ్యలు మధ్యవర్తులు అతన్ని గురించిన ఆ విషయాలు చెబుతూ చెడుగా ప్రచారం చేశారు. దానితో అమ్మాయిల తల్లిదండ్రులు అతనితో సంబంధానికి వెనకడుగు వేసేవారు, రావడం తగ్గించారు. ఇలాగా ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. అతనికి 32 సంవత్సరాలు దాటాయి. అతని గురించి అతని పెళ్లి గురించి అతనికి తెలిసిన వాళ్ళు పరిశోధకులు, విద్యార్థులు అతని మీద జోకులు వేయడం ప్రారంభించారు. అది తెలిసి ఈశ్వరరావుకు దిగులు పట్టుకుంది. బాధపడటం ప్రారంభించాడు

తనకు సంబంధాలు రాకపోవడంతో ఈశ్వర్ రావు తాను అనుకున్న మూడిట్లో ఒకటైన అమ్మాయి అందంగా ఉండాలన్న నిబంధన

వదులుకున్నాడు. అమ్మాయి ఉద్యోగం చేస్తూ ఉండాలి, కట్నం ఎక్కువ ఇవ్వాలి అనే రెండింటి మీద దృష్టి పెట్టాడు. అతనికి సంబంధాలు రాకపోవడంతో తనే పెళ్ళిళ్ల పేరయ్యేల దగ్గరికి, పెళ్ళిళ్ల బ్యూరోల దగ్గరికి వెళ్లి తన గురించి చెప్పి తనకు సంబంధాలు చూడమని చెప్పడం ప్రారంభించాడు. అతనికి 32 సంవత్సరాల దాటిపోవడంతో అతని వయసుకు తగ్గ అమ్మాయిలు దొరకడం కష్టమైంది. అతని వయసుకు తగిన అమ్మాయిలు అంటే , 27 సంవత్సరాలు దాటిన అమ్మాయిలు చాలా తక్కువ మంది ఉండేవారు. వాళ్లలో ఉద్యోగం చేసే వాళ్ళు , కట్నం ఎక్కువ ఇచ్చే వాళ్ళు దొరకడం మరీ కష్టమైంది. అలాగా మరో ఐదు సంవత్సరాలు గడిచిపోయి అతనికి 37సంవత్సరాల వయస్సు వచ్చేసింది. దీనితో జగదీశ్వరరావుకు దిగులు ఎక్కువైంది. తనకు పెళ్లి యోగం లేదేమోనని బాధపడటం ప్రారంభించాడు.

దాంతో ఈశ్వరరావు తన నిబంధనలో మరొకటైన అమ్మాయి ఉద్యోగం చేస్తూ ఉండాలన్న దాన్ని వదులుకున్నాడు. ఎక్కువ కట్నంతో రావాలని అతను కోరుకుంటున్నాడు. అయినప్పటికీ అతనికి పిల్లను ఇవ్వటానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దానికి కారణం అతను పిసినారిగా ప్రసిద్ధి చెందడం వయసు ముదిరిపోవడం. అతని వయసుకు తగిన అమ్మాయిలు అంటే 32 సంవత్సరాల వయసు ఉన్నవాళ్లు ఎవరూ లేకపోవడం అందులోనూ కట్నం ఇచ్చే వాళ్ళు దొరకనే లేదు. అలాగ మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. అతనికి 40 సంవత్సరాలు వచ్చాయి.

40 సంవత్సరాల వయసులో అతను పెళ్ళి ప్రయత్నాలు చేస్తూ ఉంటే అందరూ నవ్వుకోవడం ప్రారంభించారు. చివరికి అతను తన మూడవ నిబంధన అమ్మాయి కట్నంతో రావాలన్న దాన్ని కూడా వదులుకున్నాడు. తనకు పెళ్లయితే చాలు అనే నిర్ణయానికి అతను వచ్చాడు. అతను వచ్చాడు గానీ అతనికి పిల్లను ఇవ్వడానికి ఎవరు ముందుకు రావడం లేదు. దానికి కారణం వయసు ముదిరిపోవడం పిసినారిగా ప్రసిద్ధి

చెందటం. అలాగ మరో ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. అతనికి 45 సంవత్సరాలు వచ్చాయి.

ఆ వయసులో ఈశ్వర్ రావు పెళ్లి ప్రయత్నం చేస్తూ ఉంటే నవ్వులాట అయిపోయింది. అయినప్పటికీ అతను తన పెళ్లి ప్రయత్నాలు మానలేదు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అలాగా మరో అయిదు సంవత్సరాలు గడిచిపోయాయి. అతనికి 50 సంవత్సరాల వయస్సు వచ్చింది. ఇక తనకు పెళ్లి యోగం లేదనే నిశ్చయానికి అతను వచ్చాడు. తన పెళ్లి ప్రయత్నాలు విరమించుకున్నాడు. దానితో అతను అవివాహితుడుగా మిగిలిపోయాడు.

అతని దురాశే అతని కొంప ముంచింది.

మాయ సెజ్ కంపెనీ

కొత్తగా వచ్చిన ప్రభుత్వాధినేత రాష్ట్రంలోని నగరాల భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి డబ్బు చేసుకోవాలని చూస్తున్నాడు. అందులో భాగంగా హైదరాబాదుకు నగరానికి సుమారు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఆరు వందల ఎకరాల భూమిని సెజ్ (SEZ, Special Economic Zone, ప్రత్యేక ఆర్థిక మండలి) పేరుతో సేకరించాలని నిర్ణయం తీసుకున్నాడు. అందుకోసం ఒక ఐఏఎస్ అధికారిని నియమించాడు. ఆ అధికారి స్థానిక రెవెన్యూ అధికారులైన తాసిల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లకు ఆ బాధ్యతను అప్పగించాడు.

సెజ్ కంపెనీ పేరుతో ప్రభుత్వ పెద్దలు సేకరించాలనుకున్న భూమి మూడు గ్రామాలకు చెందిన రైతులది. వాళ్లందరూ సన్నకారు రైతులు. వాళ్ళు ఆ భూముల్లో జొన్న, మిరప, కంది, పత్తి, వేరుశెనగ మొదలైన పంటలు పండించుకొని బతుకుతున్నారు. వారందరికీ ఆ భూముల్లో వ్యవసాయం చేసి బతకడం తప్ప మరొక బతుకుతెరువు లేదు.

ఐఏఎస్ ఆఫీసర్ ఆదేశాల ప్రకారం తాసిల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తమ జమాబంది బలగంతో ఆ గ్రామాలకు వచ్చి ప్రభుత్వం సెజ్ కోసం ఆరు వందల ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయం తీసుకుందని గ్రామస్తులకు చెప్పి, తాము తీసుకోబోతున్న భూముల వివరాలను ఆయా భూముల యజమానులకు ఇచ్చారు.

ఒక వారం తర్వాత తాసిల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రభుత్వం తీసుకోబోతున్న భూముల యజమానులతో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో తాసిల్దారు ప్రభుత్వం తీసుకునే భూమికి మార్కెట్ విలువ ప్రకారం డబ్బు ఇస్తామని, సెజ్ కంపెనీ రావటం వల్ల ఆ ప్రాంతమంతా వ్యాపారపరంగా బాగా అభివృద్ధి చెంది ప్రజల బతుకు తెరువుకు చాలా అవకాశాలు ఏర్పడుతాయని కాబట్టి ఆ భూమిని ప్రభుత్వానికి ఇయ్యాలని చెప్పాడు.

వాళ్లలో వెంకటయ్య అనే రైతుకు మూడు ఎకరాల పొలం ఉంది. కొంత అక్షర జ్ఞానం ఉంది. అతను ఇలా చెప్పాడు.

“అయ్యా ఆఫీసర్లు మాకు ఆపొలమే ఆదారం. ఆ పొలం మీరు తీసుకుంటే మేం ఏం తినాలి. ఎట్లా బతకాలి? మాకు ఎవసాయం చేయడం తప్ప ఇంకొక పని రాదు. మీరు మా పొలం తీసుకుంటే మాకు సావు తప్ప వేరే మార్గం లేదు. కావట్టి మీరు మా పొలం జోలికి రావద్దు. మీరు పెట్టాలనుకునే సెజ్జు కంపెనీ ఇంకో దగ్గర పెట్టుకోర్రి” అన్నాడు.

అక్కడున్న రైతులందరూ వెంకటయ్య చెప్పిన దాన్ని సమర్థించి మేమెవరం భూములు ఇయ్యమని చాలా గట్టిగా చెప్పారు.

తాసిల్దారు రైతులు చెప్పిన విషయాన్ని ఐఏఎస్ ఆఫీసర్ కు చెప్పాడు. ఐఏఎస్ ఆఫీసర్ భూములకు మార్కెట్ విలువ ప్రకారం డబ్బు ఇవ్వడంతో పాటు భూమి ఇచ్చిన రైతు కుటుంబంలో ఒకరికి పెట్టబోయే సెజ్ కంపెనీలో ఉద్యోగం ఇస్తామని రైతులకు చెప్పమని చెప్పాడు.

తాసిల్దారు మళ్లీ ఒకసారి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి డబ్బులతో పాటు భూమి ఇచ్చిన రైతు కుటుంబంలో ఒకరికి సెజ్ కంపెనీలో ఉద్యోగం ఇస్తామని నమ్మకంగా చెప్పాడు. దానితో చాలా మంది రైతులు తమ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తుందన్న ఆశతో తమ భూములను ప్రభుత్వానికి ఇయ్యడానికి అంగీకరించారు. కొందరు రైతులు అంగీకరించలేదు.

“ఎక్కువమంది రైతులు భూమిని ఇస్తున్నారు. ఇచ్చిన భూములను మేము స్వాధీనం చేసుకుంటాం. మిగిలిన వాళ్ళు ఇయ్యకపోతే ఆభూముల్లోకి మీరు వెళ్ళటానికి దారి ఉండదు. మేము దారి ఇయ్యం. కాబట్టి మీరందరూ తప్పనిసరిగా మీ భూములను ఇయ్యాల్సిందే” అని తాసిల్దారు రైతులను భయపెట్టాడు.

దాంతో రైతులు భయపడిపోయి అందరూ తమ భూములను ప్రభుత్వానికి ఇయ్యడానికి అంగీకరించారు. భూములు ఇయ్యడానికి రైతులు అంగీకరించిన విషయాన్ని ఐఏఎస్ ఆఫీసర్ కు తాసిల్దారు చెప్పాడు.

ప్రభుత్వాధినేత ఆ భూములను వంద కోట్లకు స్వర్గసీమ రియల్ ఎస్టేట్ యజమాని రాజారెడ్డికి ఇచ్చాడు.

రాజారెడ్డి “భాగ్యా సెజ్ కంపెనీ” పేరుతో ఒక మాయ కంపెనీ కార్యాలయాన్ని నగరంలో తెరిచాడు. తన పేరు గానీ తాను గానీ బైటికి రాకుండా వెంకటరెడ్డి అనే వ్యక్తిని తెచ్చి ఆ సెజ్ కంపెనీ యజమానిగా రైతులకు పరిచయం చేయించాడు. కొందరు రైతులు వెళ్లి ఆ కార్యాలయాన్ని చూసి నిజంగా సెజ్ కంపెనీ తమ భూముల్లో వస్తుందని నమ్మారు. రాజారెడ్డి మనుషులు తాసిల్దార్ తో కలిసి రైతులకు ఒక్కొక్క ఎకరాకు 50 వేల రూపాయలు చొప్పున మొదటి విడతగా అడ్వాన్స్ చెల్లించి భూములను భాగ్యా సెజ్ కంపెనీకి ఇస్తున్నట్లుగా రాయించుకున్నారు. ఆరు వందల ఎకరాల్లో ఇంచుమించుగా వంద ఎకరాలు ప్రభుత్వ బంజరు

భూమిగా తేలింది. బంజరు భూములకు డబ్బులు ఇయ్యమని తాసిల్దారు చెప్పాడు. మిగిలిన ఐదు వందల ఎకరాలకు ఎకరాకు యాభైవేల రూపాయలు చొప్పున మొత్తం రెండు కోట్లా యాభై లక్షల రూపాయలను రైతులకు ఇచ్చారు. తర్వాత వారం రోజులకు మరొక 50,000 చొప్పున రైతులకు ఇచ్చారు.

రాజారెడ్డి ఆరు వందల ఎకరాల భూమిని భాగ్యా సెజ్ కంపెనీ నుంచి తన స్వర్ణసీమ రియల్ ఎస్టేట్ కంపెనీ కొనుక్కున్నట్లుగా కాగితాలు సృష్టించాడు. మాయ భాగ్యా సెజ్ కంపెనీ కార్యాలయాన్ని మూసివేశాడు. తర్వాత రాజారెడ్డి 600 ఎకరాల భూమిని బ్యాంకుల్లో తనఖా పెట్టి ఎకరాకు ఐదు లక్షల చొప్పున మొత్తం ముప్పై కోట్ల రూపాయలను లోన్ గా తీసుకున్నాడు.

రాజారెడ్డి 600 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని దాని చుట్టూ పెద్ద ప్రహరీ గోడ కట్టించి ఆ భూముల్లోకి రైతులు ఎవరిని రానివ్వకుండా తన మనుషులను పోలీసులను కాపలా పెట్టాడు.

రాజారెడ్డి ఆ భూముల్లో రోడ్లను వేయించి 200 గజాలు 300 గజాలు చొప్పున ఇండ్ల స్థలాలు వేయించాడు. రైతులు అక్కడికి వచ్చి సెజ్ కంపెనీ పెట్టాలని, అందులో తమ పిల్లలకు ఉద్యోగాలు ఇయ్యాలని గొడవ చేశారు. రాజారెడ్డి పోలీసుల రక్షణలో అక్కడికి వచ్చి సెజ్ కంపెనీ యజమాని ఆ భూమి మొత్తాన్ని తనకు అమ్మేశాడని సెజ్ కంపెనీ విషయం తనకు తెలియదని చెప్పాడు. దానితో రైతులు తాము మోసపోయామని లబోదిబోమని మొత్తుకున్నారు. పోలీసులు రైతులను చెదరగొట్టారు.

అప్పటిదాకా అక్కడ పనిచేసిన తాసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బదిలీ అయి దూరంగా వేరే ఊర్లకు వెళ్లిపోయారు. కొత్తగా వచ్చిన తాసిల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆ భూముల గురించి తమకు తెలియదని చేతులెత్తేశారు. రైతులు తమ భూముల గురించి వాటికి రావలసిన డబ్బులు గురించి

ఎవరిని అడగాలో తెలియక ఎం.ఆర్.ఓ ఆఫీస్ చుట్టూ, రాజారెడ్డి ఆఫీస్ చుట్టూ తిరిగారు. కొంతమంది రైతులు తమ స్థలానికి డబ్బులు ఇవ్వాలని రాజారెడ్డి కంపెనీ మీద కోర్టులో కేసులు వేశారు. రాజారెడ్డి రైతులు పెట్టుకున్న లాయర్లను కొనేసి ఆ కేసులు ఎప్పటికీ తేలకుండా పెండింగ్ లో ఉండేటట్లు చేశాడు.

రాజారెడ్డి ఆ భూముల్లో వేసిన ఇళ్ల స్థలాలను ఒక్కొక్క గజం పదివేలు చొప్పున అమ్ముకున్నాడు. ఇల్లు కట్టుకోవడం తెలియని వారికి తానే ఆ స్థలాల్లో ఇల్లు కట్టించి ఇచ్చాడు. అదే స్థలంలో అపార్ట్మెంట్లు కట్టి అమ్మాడు. ఇలాగా రాజారెడ్డి ఆ భూముల్లో అనేక రకాలుగా డబ్బులు సంపాదిస్తూ సుమారు వెయ్యి కోట్ల దాకా వెనకేసుకున్నాడు.

భూములు కోల్పోయిన రైతులు కొంతమంది నిర్వాసితులై నగరానికి వెళ్లిపోయి అక్కడ కూలి పని చేసుకుంటున్నారు. కొంతమంది రైతులు రాజారెడ్డి కడుతున్న ఇళ్లకు రాళ్లు ఇటుకలు సిమెంటు మోస్తూ జీవనం వెళ్ళదీస్తున్నారు.

వివక్ష

సూర్యారావు ప్రవీణ్ రావు మంచి మిత్రులు. ఇద్దరూ ఒకే అపార్ట్మెంట్ లో పక్కపక్కన ఉన్న ఫ్లాట్ లలో ఉంటున్నారు. ఇద్దరూ హేతుబద్ధమైన ఆలోచన ఉన్నవారు. వీలున్నప్పుడల్లా ఇద్దరూ ఒకచోట కూర్చుని అనేక అంశాల మీద మాట్లాడుకుంటూ ఉంటారు. ఒక సాయంత్రం వారిద్దరూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వారి మాటల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు ప్రవచనాలు ప్రసక్తం అయ్యాయి. ఈ విషయంలో ఒక రకమైన వివక్ష ఉందని ప్రవీణ్ రావు చెప్పాడు. ఏమిటా వివక్ష అన్నాడు సూర్యారావు.

హిందూమతంలో ఆధ్యాత్మిక ప్రసంగాలు, ప్రవచనాలు బ్రాహ్మణులే చెప్పాలి. ఇలాంటివి వాళ్ళు చెబితేనే ప్రజలు వింటారు. వాళ్ల ప్రసంగాలు జరిగే సభలకు జనం తండోపతండాలుగా హాజరై వారి కాళ్లకు పోటీలు పడి నమస్కరిస్తూ ఉంటారు. బ్రాహ్మణేతరులు ఎవరైనా ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తే వాళ్ళ ప్రసంగాలకు జనం పెద్దగా రారు. వచ్చినా విని వెళ్లిపోతారు, వాళ్ళ కాళ్ళకు నమస్కారాలు మొదలైనవి చేయరు. ఇది హిందూ మతంలోని ఒక రకమైన వివక్ష అని ప్రవీణ్ రావు చెప్పాడు.

ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే బ్రాహ్మణులకు బ్రాహ్మణేతరులకు మధ్య వివక్ష ఉందని చెప్పడానికి ఏదైనా ఆధారముందా అని సూర్యారావు అడిగాడు

ఉంది. గుడివాడలో నాగేశ్వరరావు గారని ఒక ఆయన రమణ మహర్షి భక్తుడు ఉండేవారు. ఆయన రమణ మహర్షి బోధనలను చాలా చక్కగా చెప్పేవారు. ఆయన రమణ మహర్షి బోధనలు వివరిస్తూ రమణ వాణి అనే పక్షపత్రికను నడిపేవారు. ఆయన బ్రాహ్మణ కులానికి చెందిన వారు అనుకొని కృష్ణాజిల్లాలో చాలామంది అతన్ని తమ ఊరికి తీసుకొని వెళ్లి రమణ మహర్షి బోధనల మీద ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయించేవారు. ఆయన ప్రసంగాలు వినడానికి వచ్చిన వాళ్ళలో కొంతమంది ఆయన పాదాలకు నమస్కరించేవారు. ఆయన బ్రాహ్మణుడు కాదు. ఆ విషయం తర్వాత తెలిసింది. అప్పటినుంచి ఆయనను ఆధ్యాత్మిక ప్రసంగాలకు పిలవడం తగ్గిపోయింది. కొందరు పిలిచినప్పటికీ పాదాలకు నమస్కారం చేయడం మొదలైనవి చేసేవారు కాదు అని ప్రవీణ్ రావు చెప్పాడు.

బ్రాహ్మణులు బ్రాహ్మణేతరుల మధ్య మరొక వివక్ష కూడా ఉందని ప్రవీణ్ రావు చెప్పాడు.

ఏమిటది అని సూర్యారావు అడిగాడు.

ప్రవీణ్ రావు చెప్పాడు.

బ్రాహ్మణులను ద్విజులు అంటారు. అంటే రెండు జన్మలు కలవారు అని అర్థం. బ్రాహ్మణ బాలురకు నిర్ణీత వయసులో ఉపనయనం చేస్తారు. దీన్నే వడుగు అని కూడా అంటారు. ఉపనయనం వరకు ఒక జన్మ, ఉపనయనం తర్వాత మరొక జన్మ అని బ్రాహ్మణుల ఉద్దేశం. ఉపనయనం కాకముందు వరకు ఆ బాలుడు శూద్రుని కిందే లెక్క. ఉపనయనం తర్వాత ద్విజుడు అవుతాడు, అంటే బ్రాహ్మణుడు అవుతాడు. ఉపనయనం బాలురకు మాత్రమే చేస్తారు. అమ్మాయిలకు చేయరు. బ్రాహ్మణ స్త్రీలకు

ఉపనయనం లేదు కాబట్టి వారందరూ శూద్రుల కిందే లెక్క అని వేమన కింది పద్యంలో చెప్పాడు.

“తల్లి గన్న తల్లి తన తల్లి పిన తల్లి
తండ్రి గన్న తల్లి తాత తల్లి
ఎల్ల శూద్రులైరి యేటి బ్రాహ్మడు తాను
విశ్వదాభిరామ వినురవేమ”

అమ్మమ్మ, అమ్మ, చిన్నమ్మ, నానమ్మ ,తాతను గన్న అమ్మ మొదలైన స్త్రీలందరూ శూద్రులైతే వారికి పుట్టిన పురుషులు బ్రాహ్మణులు ఎలా అవుతారు అని వేమన పై పద్యంలో బ్రాహ్మణుల బ్రాహ్మణత్వాన్ని కడిగేసాడు. అలాగే మరొక పద్యంలో వేమన ఈ ఉపనయనాన్ని ఇలా గేలి చేశాడు

“త్రాడు మెడకు వేసి తనకు శూద్రత్వంబు
పోయెననుట ఎల్ల బుద్ధిలేమి
మది నిలుపక త్రాడు మరి వన్నె దెచ్చునా
విశ్వదాభిరామ వినురవేమ”

ఉపనయనం చేసిన వాళ్లకు జందెం తాడు మెడలో వేస్తారు. జందెం మెడలో వేసుకుంటే శూద్రత్వం పోయి బ్రాహ్మణత్వం వచ్చిందని అనుకోవడం బుద్ధి లేకపోవడమే. బ్రాహ్మణుడు అంటే ఏకాగ్రత సాధించిన వాడు అని అర్థం, అంటే బ్రహ్మజ్ఞానం పొందినవాడు. బ్రహ్మజ్ఞానం జందెం తాడు వేసుకున్నంత మాత్రాన రాదు. అది లేకుండా వట్టి జందెం తాడు వేసుకుంటే దానివల్ల ఎలాంటి ఉపయోగం లేదు అని వేమన బ్రాహ్మణుల ఉపనయనాన్ని పరిహసించాడు.

వడుగు లేక ఉపనయనం బ్రాహ్మణులే కాకుండా క్షత్రియులు వైశ్యులు శూద్రుల్లో కొన్ని కులాల వారు ముఖ్యంగా స్వర్ణకారులు, వడ్రంగులు,

పద్మశాలీలు, దేవాంగులు మొదలైన కులాల వారు కూడాచేయించుకుంటారు. కానీ వీళ్ళను ఎవరినీ ద్విజులు అనరు. బ్రాహ్మణులను మాత్రమే ద్విజులు అంటారు. ఇది కూడా ఒక రకమైన వివక్షే అని ప్రవీణ్ రావు చెప్పాడు.

ఇలాంటి వివక్షతలు ఇంకా ఏమైనా ఉన్నాయా అని సూర్యారావు అడిగాడు. ఉన్నాయని ప్రవీణ్ రావు చెప్పాడు.

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి గారు బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం ప్రారంభించి బ్రాహ్మణేతరులు బ్రాహ్మణులను పెళ్లిళ్ల మొదలైన శుభకార్యాలకు పురోహితులుగా పిలువకూడదని, బ్రాహ్మణేతరులు తమ కులంలోని వ్యక్తులను పురోహితులుగా తయారు చేయాలని చెప్పారు. వారు స్వయంగా చాలా మంది కమ్మ బ్రాహ్మణులను కాపు బ్రాహ్మణులను తయారు చేశారు. ఆయన మాట మన్నించి కమ్మ కులస్తుల్లో కమ్మ పురోహితులు, కాపు కులస్తుల్లో కాపు పురోహితులు తయారయ్యారు. వారు ఆయా కులాల వారి పెళ్ళిళ్లకు పౌరోహిత్యం చేసేవారు. ఆ ఉద్యమం సద్దుమణిగిన తర్వాత కమ్మ పురోహితులకు, కాపు పురోహితులకు పెద్దగా ఆదరణ లేకపోయింది. కమ్మవాళ్ళు, కాపువాళ్ళు తమ పెళ్ళిళ్ళకు మళ్లీ బ్రాహ్మణులనే పురోహితులుగా పిలుచుకోవడం ప్రారంభించారు. అయినప్పటికీ ఇప్పటికీ కొంతమంది బ్రాహ్మణేతర కులాల వారు పౌరోహిత్యం నేర్చుకొని పురోహితులుగా ఉన్నారు. అయితే వీళ్ళు తాము బ్రాహ్మణేతరులమని చెప్పుకోవడం లేదు. అలా చెప్పుకుంటే వీళ్లను ఎవరూ పెళ్లిళ్ల చేయించడానికి పిలవడం లేదు. వీరు తమ కులాన్ని దాచుకొని పౌరోహిత్యం చేస్తున్నారు. ఇది కూడా వివక్షనే అన్నాడు ప్రవీణ్ రావు.

అవును, నిజమే, నువ్ చెబుతూ వుంటే నాకు మరొక విషయం గుర్తుకు వస్తూ వుంది. ఇలాంటి వివక్ష మరొక విషయంలో కూడా ఉంది అన్నాడు సూర్యారావ్.

అదేంటో చెప్పు అన్నాడు ప్రవీణ్ రావు.

కోస్తా జిల్లాల్లో బ్రాహ్మణేతర కులాలకు చెందిన స్వామీజీలున్నారు. వాళ్ళు ఆధ్యాత్మిక ప్రసంగాలు ప్రవచనాలు బాగానే చేస్తారు. వాళ్ళు తమ ప్రసంగాల్లో అనేక శ్లోకాలను, పద్యాలను అలవోకగా చెబుతూ ఉంటారు. కానీ బ్రాహ్మణ కులానికి చెందిన స్వామీజీలకు ప్రజల్లో ఆదరణ ప్రసిద్ధి ఉన్నట్లుగా ఈ బ్రాహ్మణేతర కులాలకు చెందిన స్వామీజీలకు లేదు. అసలు సొంత కులాల వారు కూడా ఈ బ్రాహ్మణేతర స్వామీజీలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అంతేకాదు బ్రాహ్మణ కులానికి చెందిన కవులకు రచయితలకు ఉన్న ప్రసిద్ధి, ఆదరణ బ్రాహ్మణేతర కులాలకు చెందిన కవులకు రచయితలకు లేదు. ఇది అందరికీ తెలిసిన విషయమే అన్నాడు సూర్యారావు.

ఈ దేశంలో బ్రాహ్మణుల సంఖ్య చాలా తక్కువ. బ్రాహ్మణులు ఒక్క శాతం కూడా లేరు. మరి ఎందుకని బ్రాహ్మణేతర కులాల వారు బ్రాహ్మణులకు బ్రాహ్మణేతరులకు మధ్య ఇలాంటి వివక్షను చూపిస్తున్నారు. దీనికేమైనా కారణముందా అని సూర్యారావు ప్రవీణ్ రావును అడిగాడు.

దీనికి కారణం మన వేదాలు వేదాంగాలు పురాణాలు రామాయణ భారత భాగవతాది గ్రంథాల్లో బ్రాహ్మణులు భూసురులుగా అంటే భూమిలో పుట్టిన దేవతలుగా, అగ్రజన్ములుగా చెప్పబడడం, బ్రాహ్మణులు మాత్రమే దేవాలయాల్లో పూజారులుగా ఉండడం. బ్రాహ్మణేతర కులాల వారిలో సంప్రదాయ దాస్యం, బ్రాహ్మణ దాస్యం, భావ దాస్యం ఉండడం, వీరిలో హేతుదృక్పథం, తార్కిక దృక్పథం లేకపోవడం దీనికి ప్రధాన కారణం అని ప్రవీణ్ రావు చెప్పాడు.

ఈ వివక్షత ఎలా పోతుంది ఎప్పుడు పోతుంది అని సూర్యారావు అడిగాడు.

హిందూమతంలో ఉన్న కుల వ్యవస్థ అంతరించాలి. లేదా బ్రాహ్మణేతర కులాల వారిలో హేతుదృక్పథం, తార్కిక దృక్పథం పెరిగి సంప్రదాయ

దాస్యం, బ్రాహ్మణ దాస్యం తొలగిపోయినప్పుడు ఈ వివక్షత పోతుంది. అంతవరకు ఇది పోదు. కనుచూపు మేరలో హిందూమతంలో కులవ్యవస్థ అంతరించే అవకాశం లేదు. అలాగే బ్రాహ్మణేతర కులాల వారిలో సంప్రదాయ దాస్యం, భావదాస్యం కూడా ఇప్పుడిప్పుడే తొలిగిపోయే అవకాశం లేదు. కాబట్టి ఈ వివక్షత కూడా ఇప్పుడిప్పుడే తొలిగిపోయే అవకాశం లేదు అని ప్రవీణ్ రావు చెప్పాడు.

మనుషుల విషయంలోనే కాదు, జంతువులు పక్షుల విషయంలో కూడా ఇలాంటి వివక్షత ఉందని ప్రవీణ్ రావు అన్నాడు.

జంతువులు పక్షుల విషయంలో ఇలాంటి వివక్షత ఉందా, ఎలా ఉందో చెప్పు అన్నాడు సూర్యారావు.

మనలో 90 శాతం మంది గేదె పాలను పెరుగును గేదె నెయ్యిని తింటున్నాం. ఆవు పాలను పెరుగును నెయ్యిని తినేవాళ్లు చాలా తక్కువ, అయినప్పటికీ మనం గేదెలను పూజించడం లేదు. ఆవులను పూజిస్తున్నాం. మనకు బాగా ఉపయోగపడుతున్న గేదెలను కాదని అవును పూజించడం వివక్షతే. దీనికి కారణం మన పూర్వ గ్రంథాల్లో బ్రాహ్మణులతో పాటు ఆవులను కూడా పవిత్రంగా చెప్పారు. దాన్ని అనుసరించి హిందువులు ఆవులను పూజిస్తున్నారు.

"గంగిగోవు పాలు గంటె డైనను చాలు
కడివెడైననేమి ఖరము పాలు
భక్తి గలుగు కూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ వినురవేమ"

అని వేమన ఆవుపాలకు గాడిద పాలకు ఉన్న భేదాన్ని చెప్పాడు. కానీ నేటి పరిశోధనల ప్రకారం ఇది యదార్థం కాదనిపిస్తూ వుంది. వేమన పై పద్యంలో చెప్పినట్లుగా గాడిద కడివెడి పాలు ఇవ్వదు. అది చాలా

తక్కువ పాలు ఇస్తుంది. గంగిగోవు అంటే పెద్ద ఆవు కడివెడు పాలను ఇవ్వవచ్చు అని ప్రవీణ్ రావు చెప్పాడు.

ఆ తర్వాత ప్రవీణ్ రావు గాడిద పాల వల్ల ఉపయోగాలను గురించి చెప్పాడు.

గాడిద పాలు చాలా శ్రేష్ఠమైనవి. అవి తల్లిపాల వంటివి, వాటిలో ఔషధ గుణాలు చాలా ఎక్కువగా ఉన్నాయి కాబట్టి అవి రోగనిరోధక శక్తిని బాగా పెంచుతాయి. వాటిలో క్యాలరీలు కొవ్వు చాలా తక్కువగా ఉంటాయి. ఆ పాలలో విటమిన్ ఏ, డి, బి1, బి12 , ఇ లు పుష్కలంగా లభిస్తాయి. శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ను పెంచే సామర్థ్యం గాడిద పాలలో ఎక్కువగా ఉంది. బీ.పి ని నియంత్రించడంతోపాటు రక్తనాళాల పనితనాన్ని పెంచేలాగా చేసి హృద్రోగాలు రాకుండా రక్షిస్తాయి. ఆ పాలలో షుగర్ వ్యాధిని నియంత్రించే గుణం ఉంది, అంతేకాకుండా ఆ పాలను సౌందర్య సాధనాల తయారీలో కూడా ఉపయోగిస్తున్నారు. పిల్లలకు ఆ పాలు తాపితే పిల్లలు చాలా గట్టి పడతారు. వాళ్లకు రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది. గాడిద పాల వల్ల ఇన్ని ఉపయోగాలు ఉండడం వల్లనే లీటర్ గాడిద పాలు అయిదు వేల రూపాయల నుంచి ఏడు వేల రూపాయల వరకు ధర పలుకుతూ వుంది. గాడిద పాలతో చేసిన పనీర్ ధర అక్షరాల కిలో 78 వేల రూపాయలు ఉంటుంది. విదేశాల్లో గాడిదపాలకు చాలా డిమాండ్ ఉంది. గాడిద పాలతో సబ్బులను కూడా తయారు చేస్తున్నారు అని ప్రవీణ్ రావు చెప్పాడు.

గాడిద పాల వల్ల ఇన్ని ఉపయోగాలున్నాయా? అని సూర్యారావు ఆశ్చర్యంతో అడిగి ఇదంతా నీకు ఎలా తెలిసింది అన్నాడు.

ఈ వివరాలన్నీ ఆంధ్రజ్యోతి దినపత్రిక 19 జూన్ 2022 ఆదివారం పుస్తకంలో "అవును గాడిదల్ని కాస్తున్నాడు" అనే శీర్షిక కింద ఇచ్చారు.

గాడిద పాలే కాదు గాడిద మూత్రం కూడా ఔషధంగా ఉపయోగ పడుతుందని, దీని ధర లీటరు 500 నుంచి 600 వరకు పలుకుతుందని ఆ పుస్తకంలోనే చెప్పబడింది.

గాడిదల వల్ల ఇన్ని ఉపయోగాలుండటం వల్లనే కర్ణాటకలోని శ్రీనివాస గౌడ అనే వ్యక్తి వివిధ రకాల గాడిదలను పెంచుతున్నాడు. ఇతను కొంతకాలం ఐ.టీ రంగంలో పనిచేశాడు. తర్వాత అది మానేసి దక్షిణ కన్నడ జిల్లా "ఇరా"గ్రామపంచాయతీ పరిధిలోని "పర్లడ్క"అనే గ్రామంలో గాడిదలను పెంచుతున్నాడు. అతని గురించి రాస్తూ గాడిదలకు సంబంధించిన పైవివరాలన్నింటిని ఆ పుస్తకంలో ఇచ్చారు.

గాడిద పాలే కాదు గాడిద మాంసం కూడా చాలా బలవర్ధకం. ఆమాంసం తిన్నవాళ్ళు చాలా శక్తివంతులవుతారు. బాగా పరిగెత్తగలరు, దెబ్బలకు బాగా తట్టుకుంటారు, అందుకనే దొంగలు ఎక్కువగా గాడిద మాంసాన్ని తింటున్నారు. ఈ కారణం వల్లనే గాడిద మాంసం కేజీ రెండు వేల రూపాయలకు పైగా ధర పలుకుతూ వుంది. గాడిదల వల్ల ఇన్ని ఉపయోగాలు ఉండడం వల్లనే ప్రపంచ వ్యాప్తంగా గాడిదలకు మంచి డిమాండ్ పెరుగుతూ ఉంది అని ప్రవీణ్ రావు చెప్పాడు.

అలాగే మొన్నమొన్నటి దాకా గాడిదలు బరువును మోయడానికి చాలా ఉపయోగపడ్డాయి. చాకలి వాళ్లు బట్టలను మోయడానికి గాడిదలను ఇప్పటికీ ఉపయోగిస్తున్నారు. కొండలను ఎక్కేవారు పర్వతాలను ఎక్కేవారు తమ వస్తువుల బరువును మోయడానికి ఇప్పటికీ గాడిదలనే ఉపయోగిస్తున్నారు.

ఇన్ని ఉపయోగాలున్న గాడిదలను మనవారు చాలా చులకనగా చూస్తున్నారు. అడ్డగాడిద, గాడిద చాకిరి, గాడిద బరువు, గాడిద గత్తర మొదలైన మాటలతో గాడిదలను చులకనగా మాట్లాడుతున్నారు. గాడిదను గుర్రంతో పోల్చి "గాడిద గుర్రం ఒకటేనా" అని గుర్రాన్ని ఎక్కువ చేసి

గాడిదను తక్కువ చేసి చెబుతున్నారు. గాడిద వల్ల ఉన్నన్ని ఉపయోగాలు గుర్రం వల్ల లేవు. అయినప్పటికీ మన వాళ్లు గుర్రాన్ని పొగుడుతున్నారు, గాడిదను తిడుతున్నారు. ఇది కూడా వివక్షతే అని ప్రవీణ్ రావు చెప్పాడు.

పక్షుల విషయంలో వివక్ష ఎలా ఉంది అని సూర్యారావు ప్రశ్నించాడు.

పక్షుల విషయానికొస్తే కాకి మనందరికి బాగా పరిచయమైన పక్షి. పొద్దున్నే కాకులు కా కా అనే అరుపులతో మనల్ని మేల్కొల్పుతాయి. పల్లెటూర్లలో స్త్రీలు కుండలను కడుగుతూ అందులో అన్నం మెతుకులను ఇంటి ముందు పారేస్తుంటారు. ఆ అన్నం మెతుకులను కాకులు తిని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయి.

బ్రాహ్మణులు తమ తాత తండ్రులకు వారు చనిపోయిన రోజున పిండ ప్రదానం చేస్తుంటారు. ఆ పిండాలను కాకులు తింటే చనిపోయిన తాత తండ్రులు తిన్నట్టుగా భావిస్తుంటారు. ఇది అనాదిగా వస్తున్న ఒక నమ్మకం. ఈ నమ్మకంలో కాకుల పాత్ర ప్రధానమైనది. ఈ నమ్మకాన్ని వేమన కింది పద్యంలో ఎగతాళి చేశాడు.

"పిండములను జేసి పితరుల తలపోసి
కాకులకును పెట్టు గాడ్దెలారా
పెంట దినెడు కాకి పితరుడెట్లాయరా
విశ్వదాభిరామ వినురవేమ"

వేమన ప్రజా కవి కావడం చేత ఇలాంటి మూఢనమ్మకాలను చాలా వాటిని కాదన్నాడు. వేమన నిరసన ఎలా ఉన్నప్పటికీ కాకి మన నిత్యజీవితంలో ఒక భాగంగా ఉన్నది అనేది స్పష్టం. ఇలాంటి కాకిని మనవాళ్లు ఛీ పాడుకాకి అని తిడుతుంటారు. కాకులకు పిండాలను పెట్టే బ్రాహ్మణులు కూడా కాకులను చిన్నచూపు చూస్తున్నారు. కోకిల వసంత కాలంలో మాత్రమే మనకు కనిపిస్తూ "కువూ" అని అరుస్తూ ఉంటుంది. కానీ దాని అరుపును

పెద్దవాళ్ళెవరూ పట్టించుకోరు. పిల్లలు మాత్రం దానితోపాటు కువూ అని అరుస్తూ దాన్ని ఉడికిస్తుంటారు. మనవాళ్లు కాకిని కోకిలతో పోలుస్తూ "కాకి కోకిలవుతుందా" అని కాకిని తక్కువ చేసి మాట్లాడుతుంటారు. హంస మనకు అసలు కనపడదు, అది ఎక్కడో మానససరోవరంలో ఉంటుందట. మనం దాన్ని చూడనే లేదు. మనకు నిత్యం కన్పించే కాకిని అలాంటి హంసతో పోలుస్తూ "కాకిలా కలకాలం బతికేదాని కంటే హంసల ఆరు నెలలు బతకడం మేల"ని చెబుతుంటారు. హంస ఎలా బతుకుతుందో ఈ మాటలు చెప్పే వారికి తెలియదు. అయినప్పటికీ ఆ మాట చెబుతూ ఉంటారు. హంస తెల్లగా ఉండడం కాకి నల్లగా ఉండడం దీనికి కారణం కావచ్చు అని ప్రవీణ్ రావు చెప్పాడు.

అతని మాటలు విన్న సూర్యారావు వివక్షతకు సంబంధించిన చాలా విషయాలు బాగా చెప్పావు ప్రవీణ్, నీకు ధన్యవాదాలు అన్నాడు.

తెగింపు

(వ్యవసాయం లోకి ట్రాక్టర్లు రాని కాలానికి చెందిన కథ)

అది రాయలసీమలోని ఒక మారుమూల పల్లెటూరు. ఆ ఊర్లో పెద్దిరెడ్డి చెప్పిందే వేదం, ఆయన మాటే శాసనం. అతనికి నూరు ఎకరాలకు పైగా పొలముంది. అతనికి యాభై సంవత్సరాల వయసుంటుంది. అతను చెప్పిన పని చేయడానికి చాలా మంది రౌడీలు అతని దగ్గరున్నారు. వాళ్లలో మాల మాదిగలతో పాటు ఇతర కులాల వాళ్ళు కూడా ఉన్నారు. అతనికి ఎదురు తిరిగిన వాళ్ళు ఆ ఊర్లో బతికి బట్ట కట్టలేదు. అతను కోరుకున్న ఆడది అతని పక్కలోకి రావలసిందే. చాలామంది ఆడవాళ్లను బలవంతంగా పాడు జేశాడు. అతను చేసిన అరాచకాలకు అన్యాయాలకు అంతులేదు. గత ఇరవై సంవత్సరాల నుంచి ఆ ఊరికి అతనే ప్రెసిడెంటు. అతనికి పోటీగా నిలబడే వారే లేరు.

"వాడు ఎప్పుడు సచ్చిపోతాడా" అని ఆ ఊరి ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పెద్దిరెడ్డికి అయిదు గాండ్ల ఎద్దులు, ఇరవైకి పైగా గేదెలు, ఐదు ఆవులు ఉన్నాయి. సేద్యం చేయడానికి నలుగురు జీతగాళ్ళు ఉన్నారు.

ఇంట్లో ఎద్దుల కింద గేదెల కింద ఆవుల కింద పేడా రొచ్చు తీయడానికి ఇంకొక జీతగాడున్నాడు. నలుగురు జీతగాళ్లలో ఇద్దరు మాదిగ కులానికి చెందిన వాళ్ళు. వాళ్లలో ఒకరి పేరు ఓబులేసు, అతన్ని అందరూ ఓలేసు అని పిలుస్తుంటారు. చిన్నప్పటినుంచి కష్టపడి పనిచేయడం వల్ల అతను చాలా బలంగా ఉంటాడు. బాగా తెగింపు ఉన్నవాడు. ధైర్యవంతుడు.

ఇద్దరు మాదిగ జీతగాళ్ల భార్యలు ప్రతిరోజు పెద్దిరెడ్డి ఇంటికి వచ్చి పెద్దిరెడ్డి భార్య చెప్పిన పనులు చేసి వెళ్ళిపోతూ ఉంటారు. ఓబులేసు భార్య పేరు అచ్చమ్మ. ఆమెను పెద్దిరెడ్డి ఇంట్లో వాళ్ళు "అచ్చి"అని పిలుస్తుంటారు. ఇరవై ఏళ్ల వయసుతో ఆమె అందంగా ఉంటుంది. పెద్దిరెడ్డి కన్ను ఆమెపై పడింది. అతని చూపులను బట్టి ఆ విషయం ఆమె గ్రహించింది. అదే విషయాన్ని భర్త ఓబులేసుకు చెప్పింది.

"రెడ్డయ్య్య నా దిక్కు సూసే సూపులు బాగ లేవు. వాని కన్ను నా మీంద ఉన్నట్లుగా అనిపిచ్చుంది. వాడు శానా దుర్మార్గుడు. వాని కన్నుబడిన ఆడది వాని బారి నుంచి తప్పించుకోవడం శానా కష్టం. ఏం జేయాల్నో నాకు తెల్సడంలే. వాని బారి నుంచి ఎట్ల తప్పించుకోవాల్నో నువ్వే యాదైనా దావ సెప్పాల" అని అచ్చమ్మ చెప్పింది.

"ఇంతకు ముందు వాడు చానా మంది ఆడోళ్ళను పాడు జేసినాడు. వాని పాపం పండింది. వాని సావు నా సేతిలో రాసి పెట్టుంది. అందుకే వాడు నీ మీంద కన్నేసినాడు. రెడ్డయ్య్య నీమీంద సెయ్యేచ్చే వాన్ని సంపడమో, నేను సావడమో సేయాల, అంతే, ఇంగ సెప్పేదేం లేదు. ఎప్పుటికప్పుడు అన్ని ఇషయాలు నాకు సెప్తూ వుండు" అన్నాడు ఓబులేసు.

అచ్చమ్మ "సరే" అనింది

రెండు రోజుల తర్వాత పెద్దిరెడ్డి అచ్చమ్మతో " ఏమ్యా అచ్చి, సింతసెట్టు సేను రెండెకరాలు జొన్న ఏసినాం, ఆసేలో కలుపు శానా పడింది, రేప్పోయి నువ్ ఆసేన్లో కలుపు తియ్యాల" అన్నాడు.

“రెడ్డయ్యా, నేనొక్కదాన్నే పాలేను, నాకు శానా బయం, ఇంగొకర్ని ఎవర్నన్నా తోడు పంపియ్యి, ఇద్దరం కల్సి పోతాం” అని అచ్చమ్మ చెప్పింది.

“ల్యా ల్యా నీకు తోడు ఎవురూ రారు, నువ్వొక్కదానివే పోవాల, నిన్నెవరూ ఎత్తకపార్లే, రేప్పొయి ఆసేన్లో కలుపు తియ్యి” అన్నాడు పెద్దిరెడ్డి.

“నేనొక్కదాన్నే పాలేను రెడ్డయ్యా” అని అచ్చమ్మ చెప్పింది.

పెద్దిరెడ్డికి చాలా కోపం వచ్చింది “ఏమ్యా, నాకే ఎదురు సెప్తండావ్, అంత పొగురెక్కిందా నీకు, నోర్మూసుకొని సెప్పిన పని సెయ్” కోపంగా అన్నాడు పెద్దిరెడ్డి.

అచ్చమ్మ భయంతో వణికిపోతూ “సరే రెడ్డయ్యా” అని అయిష్టంగానే చెప్పింది.

అచ్చమ్మ ఇంటికి పోయి జరిగిన విషయమంతా ఓబులేసుకు చెప్పింది. ఓబులేసు ఏం చేయాలో అచ్చమ్మకు చెప్పాడు.

“వాడు సెప్పినట్టుగా రేపు నువ్వు సేనికి కలుపు తీయడానికి పో, వాడు వచ్చి నిన్ను బలంతం సేత్తే కాలితో గట్టిగా వాని ఇజాల మీంద తన్ను. నేను ఆ దగ్గర్నే ఉంటాను. ఇద్దరం కల్సి వాన్ని సంపుదాం. వాడు సచ్చిపోతే ఊరికి పట్టిన శనిపీడ ఇరగడయితాది. ఊర్లో జనాలు సంతోసపడతారు. మన కాసం ఊరి కాసం మనం ఈ మాత్రం తెగింపు సేయాల్సిందే, మనకు ఏరే దావ లేదు. వాడు నీ మీద కన్నేసినాడు కాబట్టి నిన్ను చెడగొట్టే దాకా వదలడు. దానికన్న సావడం మేలు. మనం సచ్చిపోవడం కంటే వాన్ని సంపడం మంచిది. వాడు రాచ్చసుడు. వాన్ని సంపితే మనకు ఏం పాపం రాదు. అంతా పుణ్ణెమే వచ్చాది. ఊర్లో వాళ్ళందరూ మనల్ను వీరోలు అని పొగుడుతారు” అన్నాడు ఓబులేసు.

“వాన్ని సంపి మన ఊర్లో బతుకుతామా, మనల్ను పోలీసోల్లు పట్టుకొనిపోయి జైల్లో ఏచ్చారు గదా, మన బతుకు ఏమైతాది” అచ్చమ్మ అనింది.

"వాన్ని సంపినాక మనమే పోయి పోలీస్ టేషన్లో లొంగిపోదాం. మనకు తొమ్మిదేండ్లో పదేండ్లో జైలు శిచ్చ పడతాది. మనం జైలు నుంచి వచ్చేటప్పటికి మనూర్లో శానా మార్పులు వచ్చుంటాయి. ఊర్లో మార్పులు వచ్చిన రాకపోయినా మనం మనూర్లో ఉండొద్దు. మనూర్లో మనకు ఏముంది, ఏమీ లేదు. జైల్ నుంచి వచ్చినాక మనం ఏదైనా పట్నంలో పని సేసుకుని బతుకుదాం''.

అచ్చమ్మ సరే అనింది.

మరుసటి రోజు అచ్చమ్మ కొడవలి తీసుకుని కలుపు తీయడానికి జొన్న చేనుకు వెళ్ళింది. జొన్నపైరు మనిషి ఎత్తుకు పెరిగింది. నిజానికి ఆ చేలో కలుపు తీయవలసిన అవసరం లేదు. పెద్దిరెడ్డి అచ్చమ్మను బలాత్కారం చేయడానికే ఆమెను ఒంటరిగా ఆ చేనుకి కలుపు తీయడానికి పంపించాడు. ఆ విషయం అచ్చమ్మకు ఓబులేసుకు అర్థమైంది. అందుకనే వాళ్ళు పెద్దిరెడ్డిని చంపడానికి నిర్ణయించుకున్నారు.

అచ్చమ్మ చేలో వంగి కలుపు తీస్తూ వుంది. పెద్దిరెడ్డి ఆమె వద్దకు వచ్చి ఆమె చేయి పట్టుకొని కౌగిలించుకోబోయాడు. అచ్చమ్మ చెయ్యి విడిపించుకొని దూరంగా జరిగి "రెడ్డయ్యా, నేను అట్టాటిదాన్ని కాదు. నీబిడ్డట్లాటి దాన్ని, నన్ను పాడు సేయొద్దు. నన్నిడిసిపెట్టు, నీకాళ్ళకు మొక్కుతా'' అని చెప్పింది.

"నువ్ నాబిడ్డట్లాటిదానివేందే, మీ మాల మాదిగ ఆడోళ్ళందరూ ఉన్నదే మాకోసం. నేన్నిడిసిపెట్టను, నువ్ నాక్కావాల్సిందే, నేను కోరుకున్న ఆడది నాకు దక్కకపోతే నేనూర్కోను. నువ్ నాపక్కన పండుకోవడం నీఅదృష్టం, నువ్వొప్పుకోకపోతే నిన్నిక్కడ్నే సంపిపారేచ్చాను'' అని పెద్దిరెడ్డి ఆమెను వెల్లకిలా తోసి ఆమె మీద పడబోయాడు.

అచ్చమ్మ తన శక్తి కొద్దీ, బలంకొద్దీ తన మీద పడబోతున్న పెద్దిరెడ్డి ఇజాల మీద కుడికాలితో గట్టిగా తన్నింది. పెద్దిరెడ్డికి చుక్కలు కనిపించాయి.

బాధతో అమ్మా అని అరుస్తూ కింద పడిపోయి రెండు చేతులతో ఇజాల దగ్గర పట్టుకున్నాడు. అచ్చుమ్మ లేచి నిలబడింది. అప్పుడు ఓబులేసు గొడ్డలి పట్టుకొని అక్కడికి వచ్చాడు. గొడ్డలి పట్టుకొని యముని లాగా నిలబడిన ఓబులేసును చూసి పెద్దిరెడ్డి అదిరిపోయాడు. భయంతో నోట మాట రాలేదు.

ఓబులేసు అన్నాడు.

"ఏందిరా, మా మాల మాదిగల పెళ్ళాలు మీ పక్కలో పండుకోవాల్నా, మరి మీ పెళ్ళాలు ఎవరి పక్కలో పండుకుంటారు, మా దగ్గర పండుకుంటారా? ఈ ఊరికి పట్టిన పెద్ద శనిగానివి నువ్వు, నిన్ను సంపి ఈవూరికి నీ పీడ లేకుండా సేచ్చా. నువ్వు సచ్చిపోతే ఈ ఊర్లో వాళ్ళందరూ ఆనందంగా పండగ సేసుకుంటారు. నువ్వు సచ్చిపోతే ఈవూర్లో మీ వాళ్ళు తప్ప ఏడ్చేటోళ్ళు ఎవరూ లేరు'' అని ఓబులేసు పెద్దిరెడ్డిని చంపడానికి గొడ్డలి పై కెత్తాడు.

వెంటనే పెద్దిరెడ్డి ఓబులేసు కాళ్ల మీద పడి "ఓలేసు నన్ను సంపొద్దు, నీకేం గావాలంటే అదిచ్చా, బూమి గావాలంటే బూమి, లెక్క గావాలంటే లెక్క ఎంత గావాలంటే అంతిచ్చా, నన్ను సంపొద్దు'' అన్నాడు.

"ఒరే పెద్దిగా నీ సంగతి నాకు తెల్సురా, నువ్ ఉత్త బెదురు నాకొడుకువు, అందితే జుట్టు అందకపోతే కాళ్ళు పట్టుకునేటోనివి, నిన్నిప్పుడు ఇడిసిపెడ్తే నువ్వేంజేచ్చావో నాకు తెల్సు, మమ్ముల్ని నువ్ బతకనిచ్చావా? నిన్నిడిసిపెట్టేదే లేదు'' అని ఓబులేసు గొడ్డలితో పెద్దిరెడ్డి తల మీద మూడు దెబ్బలు కొట్టాడు. పెద్దిరెడ్డి మాటల్లేకుండా పడిపోయాడు. పెద్దిరెడ్డి తన చేయి పట్టుకొని కౌగిలించుకున్నందుకు అచ్చుమ్మకు అతని మీద చాలా కోపముంది. ఆకోపం తీర్చుకోవడానికి ఆమె ఓబులేసు చేతిలోని గొడ్డలి తీసుకొని బలంగా పెద్దిరెడ్డి గొంతు మీద నరికింది. పెద్దిరెడ్డి చనిపోయాడు.

ఆ ఊరికి పెద్దిరెడ్డి రూపంలో పట్టిన శని వదిలిపోయిందని అచ్చుమ్మ ఓబులేసు సంతోషించి పోలీస్ స్టేషన్ కు వెళ్లి లొంగిపోయారు.

తొందరపాటు

రాంబాబు రాఘవరావు విజయకుమార్ లు ఒకే కాలనీలో పక్కపక్కనే నివసిస్తున్నవారు. మంచి మిత్రులు. ముగ్గురు వేరువేరు ఆఫీసుల్లో పని చేస్తున్నారు. తరచుగా ముగ్గురూ కలిసి ఏదైనా విషయం గురించి చర్చించుకుంటూ ఉంటారు. మాట్లాడుకుంటూ ఉంటారు.

"మనం కొన్ని విషయాల్లో తొందరపాటుగా ఒక నిర్ణయానికి వస్తూ ఉంటాం. ముఖ్యంగా మన ఇంట్లో ఏవైనా వస్తువులు కనిపించకుండా పోయినప్పుడు మన ఇంట్లో పని చేస్తున్న పనిమనుషులను అనుమానిస్తూ ఉంటాం. ఇలా అనుమానించడంలో మన తొందరపాటు కనిపిస్తూ ఉంటుంది'' అని రాఘవరావు అన్నాడు. మిత్రులిద్దరూ రాఘవరావ్ తో ఏకీభవించారు. అప్పుడు రాంబాబు "నువ్వు ఈ మాట అంటున్నావంటే అలాంటి సంఘటన ఏదో మీ ఇంట్లో జరిగి ఉండాలి'' అన్నాడు

అవును, జరిగింది అని రాఘవరావు తన ఇంట్లో జరిగిన విషయాన్ని చెప్పాడు.

ఒకసారి మాఆవిడ ఒక బంగారు గొలుసును అల్మారాలో ఒక దగ్గర పెట్టింది. ఆ తర్వాత అక్కడి నుంచి తీసి మరో దగ్గర దాచిపెట్టింది. రెండోసారి దాచిపెట్టిన విషయాన్ని ఆమె మర్చిపోయింది. ఆ తర్వాత

కొద్ది రోజులకు ఆమె ఆ బంగారు గొలుసు కోసం మొదటిసారి పెట్టిన దగ్గర వెదికింది. అది కనిపించలేదు. దాంతో కంగారుపడుతూ అక్కడే చాలాసార్లు వెదిగింది. అక్కడ ఎన్నిసార్లు వెదికినా అది కనిపించలేదు. నాకు చెబితే నేను కూడా వెదికాను. కనిపించలేదు. ఇరవై వేల రూపాయల విలువచేసే బంగారు గొలుసు అది. ఆమెకు కంగారు ఎక్కువై ఇంట్లో చాలాచోట్ల వెదికింది. కనిపించలేదు.

ఆమె బాగా ఆలోచించింది. ఆ సమయంలో మా ఇంట్లోకి కొత్త వాళ్ళు ఎవరూ రాలేదు. ఇంట్లో మనుషులు కాకుండా ఇంట్లో అంతటా తిరిగేది పనిమనిషి ఒకతే. ఇంట్లో మనుషులు ఎవరూ బంగారు గొలుసును దొంగలించరు, కాబట్టి పనిమనిషి మీద ఆమెకు అనుమానం వచ్చింది. ఆ విషయం నాతో చెప్పింది. ఆమె తీసి ఉండదేమో, నువ్వే ఎక్కడైనా పెట్టి మరిచిపోయి ఉండొచ్చు అని నేను అన్నాను. కానీ మా ఆవిడ నా మాటను నమ్మలేదు, పనిమనిషే తీసుకొనివుంటుందని ఆమె గట్టిగా నమ్మింది. పనిమనిషిని అడగాలని నిశ్చయించుకుంది. కానీ పనిమనిషిని అడగడం ఎలాగా అనే విషయంలో రెండు మూడు రోజులు తర్జనబర్జన పడిన తర్వాత చివరకు మా ఆవిడ పనిమనిషిని అడిగింది. పనిమనిషి పేరు ఆదిలక్ష్మి. మా ఆవిడ ఆదిలక్ష్మిని అడిగినప్పుడు నేను అక్కడే ఉన్నాను.

“ఆదిలక్ష్మి , అల్మారాలో పది రోజుల కిందట బంగారు గొలుసు పెట్టాను. కానీ అది కనిపించడం లేదు. పెట్టిన దగ్గర చాలాసార్లు వెదికాను. అక్కడే గాకుండా ఇంట్లో గూడా చాలా చోట్ల మళ్లీ మళ్లీ వెదికాను. కన్పించలేదు. అప్పటినుంచి ఇంట్లోకి కొత్త వాళ్ళు ఎవరూ రాలేదు. ఇంట్లో మాతోపాటు తిరుగుతున్నది నువ్వు ఒక్కదానివే. అందువల్ల నిన్ను అడుగుతున్నాను, ఆ గొలుసును నువ్వేమైనా చూసావా? “ అని మా ఆవిడ అడిగింది. ఆవిడ అడిగిన విధానాన్ని బట్టి “చూసావా” అనే మాటలో “తీశావా” అనే అర్థం ధ్వనిస్తూ ఉంది.

“లేదమ్మ గారూ, నేను ఏ గొలుసునూ సూడ్లేదు, అసలు నేను అల్మార తలుపులే తెరవను కదా, తలుపులు తెరవకుండా అల్మారా లో

పెట్టిన గొలుసు నేనెట్లా సూత్తాను. నేను సూడ్నేలేదమ్మా, మీరే ఎక్కడో పెట్టి మరిచిపోయి ఉంటారు. మళ్ళీ ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి, అది కనిపిత్తుంది" అని ఆమె మా ఆవిడ వైపు ఒకసారి చూసి మళ్ళీ తలవంచుకుని చెప్పింది.

పనిమనిషి చెప్పిన దాంట్లో నిజముందని నాకు అనిపించింది. అదే విషయాన్ని నేను మా ఆవిడకు చెప్పాను.

"ఆదిలక్ష్మి చాలా కాలంగా మన ఇంట్లో నమ్మకంగా పని చేస్తూ ఉంది. ఆమె మీద ఎప్పుడూ ఇలాంటి కంప్లైంట్ లేదు. అంతేకాకుండా ఆమె అల్మారా తలుపులు ఎప్పుడూ తెరవదు. తలుపులు తెరవకుండా అల్మారాలో పెట్టిన గొలుసును ఎలా తీసుకుంటుంది. నువ్వే గొలుసును ఎక్కడో పెట్టి ఆ పెట్టిన చోట మరిచిపోయి ఉంటావు. జాగ్రత్తగా ఆలోచించి గుర్తుకు తెచ్చుకో, గొలుసు దొరుకుతుంది" అని చెప్పాను.

కానీ మా ఆవిడ మాత్రం నమ్మలేదు. ఇంట్లో మనిషి కాని వ్యక్తి పనిమనిషి ఒకతే కాబట్టి ఆమే తీసి ఉండాలని మా ఆవిడ గట్టిగా ఆదిలక్ష్మిని అనుమానించింది. ఆదిలక్ష్మి మీద పోలీసులకు కంప్లైంట్ చేద్దామని చెప్పింది. కానీ నేను వద్దని వారించాను. ఎందుకంటే ఆమె తీసిందీ లేనిదీ స్పష్టంగా తెలియదు. స్పష్టంగా తెలియకుండా ఒక వ్యక్తిని అనుమానించి పోలీస్ కంప్లైంట్ ఇచ్చి వాళ్ళ చేత కొట్టించడం దుర్మార్గమని నా ఉద్దేశం. అందువల్ల నేను వారించడం చేత పోలీస్ కంప్లైంట్ చేయలేదు. కానీ రోజులు గడిచే కొద్దీ ఆదిలక్ష్మే గొలుసును తీసిందని మాఆవిడ చాలా గట్టిగా నమ్ముతూ వచ్చింది. అప్పటినుంచి ఆదిలక్ష్మి మా ఇంట్లో పని చేస్తున్నంత సేపు ఆమె మీద ఒక కన్నేసి ఉంచింది.

ఆదిలక్ష్మి తీసి ఉండదని నేను నమ్ముతూనే ఉన్నా ఎక్కడో ఒక మూల ఆమె తీసిందేమో అనే అనుమానం నన్ను గూడా కెలుకుతూనే ఉంది. ఎందుకంటే గొలుసు ఇంట్లో లేకపోతే ఎవరో ఒకరు తీసి ఉండాలి కదా, ఆ సమయంలో మా ఇంటికి కొత్త వాళ్ళు ఎవరూ రాలేదు. మరి ఉన్నది బయటి వ్యక్తి పనిమనిషి ఆదిలక్ష్మి ఒకతే. అందువల్ల ఆమె తీసిందేమో అనే అనుమానం నాకు కూడా కొంచెం ఉండేది.

రెండు నెలలు గడిచిన తర్వాత నేను ఏదో వస్తువు కోసం వెదుకుతూ మా ఆవిడ బంగారు గొలుసును రెండోసారి దాచిపెట్టిన చోట నాకు కావలసిన వస్తువు కోసం వెదికాను. నేను వెదుకుతున్న వస్తువు దొరకలేదు కానీ పోయిందనుకున్న ఆ బంగారు గొలుసు నాకు కనిపించింది. అది తీసుకొని మా ఆవిడకు చూపించాను. ఆమె మొదట ఆశ్చర్యపోయింది, పోయిందనుకున్న బంగారు గొలుసు దొరికినందుకు చాలా సంతోషించింది.

"నేనే అక్కడ దాచి పెట్టాను, ఆ విషయం మరిచిపోయి నేను మొదట పెట్టిన దగ్గర వెదికానండీ'' అని మాఆవిడ చెప్పింది.

తొందరపాటుతో అనవసరంగా పనిమనిషిని అనుమానించినందుకు నాకు చాలా బాధ కలిగింది. బంగారు గొలుసు దొరికిన విషయం పనిమనిషికి చెప్పమని నేను మా ఆవిడకు చెప్పాను.

"ఎంతోకాలంగా మన ఇంట్లో చాలా నమ్మకంగా పనిచేస్తున్న ఆదిలక్ష్మిని నీ మతిమరుపు వల్ల గొలుసును దొంగతనం చేసిందని అనుమానించావు. ఆమె తీసి ఉండదని నేను చెబుతూనే ఉన్నాను. కానీ నువ్వు నమ్మలేదు. నీ మాట నమ్మి పోలీసులకు కంప్లైంట్ చేసి ఉంటే ఎంతగోల, ఎంత రచ్చ అయ్యేది. పోలీసులు ఆమెను గొలుసు గురించి చెప్పమని ఎంతగా హింసించే వారు, ఆపాపమంతా మనకే వచ్చేది. పోలీస్ కంప్లైంట్ ఇవ్వకుండా మంచి పని చేశాం. గొలుసు దొరికింది కాబట్టి ఆదిలక్ష్మిని అనుమానించినందుకు ఆమెకు సారీ చెప్పడం కనీస సంస్కారం. పోయిన గొలుసు ఆమెకు చూపించి సారీ చెప్పి ఒక వేయి రూపాయలు ఆమెకు ఇవ్వు'' అని మా ఆవిడతో చెప్పాను.

"నేను చెప్పనండి, పనిమనిషికి సారీ చెప్పడమేంటి, నా స్థానంలో ఎవరున్నా అలాగే అనుమానిస్తారు. అయినా నేను ఆదిలక్ష్మిని గొలుసు చూసావా అని అడిగాను. తీశావా అని అడగలేదు. కాబట్టి నేను ఆమె మీద దొంగతనం నేరం మోపలేదు'' అని మా ఆవిడ చెప్పింది.

"నువ్వు చెప్పకపోతే నేను చెబుతాను'' అన్నాను నేను.

దానితో మా ఆవిడ పనిమనిషికి సారీ చెప్పడానికి అంగీకరించింది.

అప్పుడు నేను అక్కడే ఉన్నాను.

"లక్ష్మి, పోయిందనుకున్న గొలుసు దొరికింది. నేను వేరే చోట పెట్టి ఆ పెట్టిన చోటు మరిచిపోయి ఇంకోచోట వెదికాను. దానివల్ల దొరకలేదు, మా ఆయన వేరే వస్తువు కోసం వెదుకుతూ వుంటే గొలుసు కనిపించింది. గొలుసు గురించి నిన్ను అడిగినందుకు ఏమీ అనుకోవద్దు, సారీ" అని మా ఆవిడ ఆదిలక్ష్మితో చెప్పి, వెయ్యి రూపాయలు ఆదిలక్ష్మి చేతిలో పెట్టింది.

ఆదిలక్ష్మి వెయ్యి రూపాయలు వెనక్కి తిరిగిస్తూ "డబ్బులు వద్దమ్మా, మీ ఇంట్లో మళ్లీ ఎప్పుడైనా ఏదైనా వస్తువు కనిపించకుండా పోతే నన్ను అనుమానించొద్దు, నన్ను అడగొద్దు, అది చాలు" అని ఆదిలక్ష్మి కన్నీటితో పలికింది.

ఆదిలక్ష్మి పలికిన ఆ మాటలతో మేము ఆమెను అనుమానించి నందుకు ఆమె ఎంత బాధ పడిందో నాకు అర్థమైంది. మా ఆవిడ ఆమె మాటలను మామూలుగా తీసుకుంది. నేను మామూలుగా తీసుకోలేక పోయాను. మా తొందరపాటుకు నేను చాలా బాధపడ్డాను అని రాఘవరావు చెప్పాడు.

నా అనుభవంలో కూడా ఇలాంటి సంఘటన ఒకటి జరిగింది, నా ఒక్కడి అనుభవమే కాదు, చాలా మంది జీవితాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి అన్నాడు విజయకుమార్.

అదేందో చెప్పమని మిత్రులు ఇద్దరూ అడిగారు

విజయకుమార్ చెప్పడం ప్రారంభించాడు.

చాలా రోజుల తర్వాత నేను ఒకసారి మా ఊరికి వెళ్లాను. మా ఊర్లో వున్న మా ఇంట్లో చాలా కాలంగా ఎవరూ లేరు. అందువల్ల ఇల్లు మొత్తం బాగా దుమ్ము బూజు పట్టి ఉంది. నేను తీసుకుపోయిన బ్యాగులు

సూట్ కేసు ఒక మంచం మీద పెట్టాను. దగ్గర్లోనే వున్న సచివాలయంలో స్వీపర్ గా పనిచేస్తున్న ఒక దళితురాలిని మా ఇల్లు శుభ్రం చేయడానికి పిలిపించాను. ఆమె వచ్చి శుభ్రం చేసి శుభ్రం చేసినందుకు డబ్బు తీసుకొని వెళ్ళిపోయింది .

ఆమె వెళ్ళిపోయిన తర్వాత ఇంట్లో వస్తువులు సర్దుతూ ఉన్నప్పుడు నా చేతి గడియారం కనిపించలేదు. అది మా అబ్బాయి తనకు ఉద్యోగం వచ్చిన కొత్తలో నాకు కొని పెట్టాడు. మా అబ్బాయి నాకు చాలా ఖరీదైన గడియారం కొనిపిస్తానన్నాడు. నాకు టాటా కంపెనీ వాళ్ళ ఉత్పత్తులంటే చాలా ఇష్టం. అందువల్ల నాకు ఖరీదైన గడియారం వద్దని టైటాన్ గడియారం చాలని అన్నాను.

నేను మా ఆవిడ మా అబ్బాయి టైటాన్ షో రూమ్ కి వెళ్ళాం. అందులో టైం తో పాటు తేదీ, వారం ఉన్న ఖరీదైన గడియారాన్ని మా వాడు ఎంపిక చేశాడు. ఖరీదైన వస్తువులు నాకు ఇష్టముండదు. అందుకని కేవలం సమయాన్ని తెలిపే సామాన్యమైన గడియారాన్ని నేను ఎంచుకున్నాను. అంత మామూలు గడియారాన్ని నాకు బహుమతిగా కొనడం మావాడికి ఇష్టం లేదు, నా మాట కాదనలేడు. చివరికి అయిష్టంగా మా అబ్బాయి నేను ఎంచుకున్న గడియారాన్ని కొనిపెట్టాడు.

అలా మా అబ్బాయి కొనిపెట్టింది కావడం వల్ల ఆ గడియారం నాకు చాలా ఇష్టమైంది. అది కనిపించకపోవడంతో దాని కోసం చాలా వెతికాను, సూట్ కేసులో బ్యాగ్ లో ఉన్న వస్తువులన్నీ తీసి రెండు మూడు సార్లు వెతికాను. కనిపించలేదు ఏమైందో అర్థం కాలేదు. అప్పుడు నేను మా ఇల్లు శుభ్రం చేసిన దళితురాలు ఏమైనా తీసి ఉంటుందా అని అనుమానించాను. ఇల్లు శుభ్రం చేసే సమయంలో వేరెవరూ మా ఇంటికి రాలేదు. చేతి గడియారం కనిపించకుండా పోయిందంటే తప్పనిసరిగా ఆమే తీసి ఉండాలని నాలుగైదు రోజుల కల్లా గట్టి నిర్ణయానికి నేను వచ్చాను. చేతి గడియారం గురించి ఆమెను అడుగుదామా? వద్దా? అని బాగా ఆలోచించాను. ఒకవేళ ఆమె తీసి వుంటే ఎలాగూ నేను తీయలేదని అబద్ధం చెబుతుంది. తీయకుండా వుంటే ఆమెను అనుమానించి

అడిగినందుకు బాధపడుతుంది. ఆమెను బాధ పెట్టడం ఇష్టం లేక నేను ఆమెను అడగదల్చుకోలేదు, అందువల్ల అడగలేదు. కానీ ఆమే తీసివుంటుందని నేను గట్టిగా నమ్మాను. సరే గడియారం పాతదే గదా పోతే పోయిందిలే అని నేను దాని గురించి మర్చిపోయాను.

ఒక సంవత్సరం తర్వాత ఏదో పనిమీద ఒక పెద్ద జిప్ బ్యాగును తీసి దానికి పక్కన ఉన్న చిన్న జిప్ ను తీసి చూస్తే అందులో పోయిందనుకున్న నా చేతి గడియారం కనిపించింది. నాకు చాలా సంతోషం కలిగింది. అంటే ఆరోజు మా ఊర్లో నేను నా గడియారాన్ని ఆ చిన్న జిప్ లో పెట్టి, ఆ సంగతి మరిచిపోయి పెట్టిన దగ్గర కాకుండా మిగిలిన అన్ని చోట్ల వెతికాను. కనిపించలేదు, కనిపించకపోవడంతో అమాయకురాలైన దళితురాలిని అనుమానించాను. గడియారం గురించి ఆమెను అడగకుండా చాలా మంచి పని చేశానని నేను అప్పుడు అనుకున్నాను. ఆమెను అనుమానించడం నిజంగా నా తొందరపాటే, నా తప్పే అని విజయ్ కుమార్ తన తప్పును ఒప్పుకున్నాడు.

మీరిద్దరూ చాలా మంచి వాళ్ళు , మీ తొందరపాటును త్రికరణశుద్ధిగా అంగీకరిస్తున్నారు అని రాంబాబు అన్నాడు. ఇందులో మా మంచితనం ఏమీ లేదు, అలాంటి విషయాల గురించి మన మధ్య చర్చ జరిగింది కాబట్టి, మా అనుభవంలో జరిగిన విషయాన్ని చెప్పి మా తొందరపాటును అంగీకరించాం అంతే అని మిత్రులిద్దరూ చెప్పారు.

నిర్లక్ష్యం

రాజు ఏ విషయాన్ని సీరియస్ గా తీసుకోడు. ఏదైనా పని చేస్తున్నప్పుడు దానికి సంబంధించిన సాధకబాధకాలను జాగ్రత్తగా ఆలోచించడు. ఆలోచించకుండా నిర్లక్ష్యంగా పనులు చేస్తుంటాడు. తద్వారా చిక్కుల్లో పడుతూ వుంటాడు. అలాగని అతను చిన్న పిల్లవాడు కాదు, చదువు లేని వాడు గూడా కాదు. ఎమ్.ఎస్సీ చదివాడు.

రాజు పేరుకు మాత్రమే రాజు, అతను చాలా బీదవాడు. కష్టపడి ఎమ్.ఎస్సీ వరకు చదివాడు. అతనికి ఉద్యోగం చాలా అవసరం, ఎమ్.ఎస్సీ అయిపోయిన తర్వాత సంవత్సరం వరకు ఏ ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నాడు. ఖాళీగా ఉండటం ఇష్టం లేక కొంతకాలం మెడికల్ రెప్రెజెంటేటివ్ గా పని చేశాడు. అయితే ఆ వృత్తిలోని అబద్ధాలు చెప్పడం, ఊర్లు తిరగడం, డాక్టర్ల దగ్గర గంటలు గంటలు వేచి ఉండటం మొదలైనవి అతనికి నచ్చలేదు. ఆ ఉద్యోగం వదిలేశాడు. మరొక ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. అయితే ఉద్యోగాల ప్రకటనలు కనపడటం లేదు.

అతను ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి కూడా అతన్ని ప్రేమించింది. వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. పెళ్లి చేసుకోవడానికి ఉద్యోగంతో ముడి పెట్టుకున్నారు. అందువల్ల రాజుకు అత్యవసరంగా ఉద్యోగం కావాలి. దానికోసం అతను ఇంటర్వ్యూ ఎక్కడ ఉన్నా ఎంత దూరంలో ఉన్నా వెళ్లాలని నిశ్చయంగా నిర్ణయించుకున్నాడు

రాజు కేంద్ర ప్రభుత్వంలోని ఒక ఉద్యోగానికి దరఖాస్తు చేశాడు. దానికి సంబంధించిన రాత పరీక్ష రాసి అందులో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ ఉద్యోగానికి సంబంధించిన ఇంటర్వ్యూ కోసం ఎదురు చూస్తున్నాడు. కొద్ది రోజుల తర్వాత ఆ ఉద్యోగానికి సంబంధించిన ఇంటర్వ్యూ లెటర్ అతనికి వచ్చింది. **1:2** పద్ధతిలో ఉద్యోగానికి అభ్యర్థులను పిలిచారు. అందువల్ల ఆఉద్యోగం తప్పనిసరిగా తనకు వస్తుందని రాజు భావించాడు. ఇంటర్వ్యూ హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర రాజధాని సిమ్లాలో ఏర్పాటు చేశారు.

అది డిసెంబర్ నెల, చలికాలం. సిమ్లాలో వాతావరణం చాలా తొందరగా మారిపోతూ ఉంటుంది. ఒక్కొక్క రోజు చలి చాలా ఎక్కువగా ఉంటుంది. ఒక్కొక్క రోజు అంత ఎక్కువగా ఉండదు. మంచు బాగా పడుతూ ఉంటుంది. టూరిస్టులు మంచును చూడడానికి చాలా ఎక్కువ మంది సిమ్లాకు వెళుతుంటారు. అలా వెళ్లే వాళ్లందరూ ఊలు స్వెటర్లు, కాళ్లకు బూట్లు, చేతులకు గ్లోవ్స్ తలకు మంకీ క్యాప్, రాత్రిపూట పడుకునే సమయంలో కప్పుకోవడానికి ఊలు దుప్పట్లు మొదలైనవి తీసుకొని వెళ్తూ ఉంటారు. ఇంకా చలికి తట్టుకోవడానికి అనేక రకాల జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు.

రాజు అలాంటి జాగ్రత్తలేవీ తీసుకోలేదు. అతనికి బూట్లు లేవు, ఊలు స్వెటర్లు దుప్పట్లు లేవు. చేతులకు గ్లోవ్స్, తలకు మంకీ క్యాప్ లేదు. రాత్రిపూట కప్పుకోవడానికి మామూలు దుప్పటి మాత్రం తీసుకొని వెళ్ళాడు. రాజు న్యూఢిల్లీ వరకు ఒక రైల్లో ఢిల్లీ నుంచి సిమ్లాకు రెండు రైళ్లు మారి సిమ్లా చేరుకున్నాడు. అతను వెళ్ళినప్పుడు చలి మరీ అంత

ఎక్కువగా లేదు. ఆ మరుసటి రోజు అంటే ఇంటర్వ్యూ రోజు అక్కడ వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. టెంపరేచర్ మైనస్ డిగ్రీలకు పడిపోయింది. చలి బాగా పెరిగింది.

రాజు చలిని, వాతావరణాన్ని గురించి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా మామూలు బట్టలతో, కాళ్లకు స్లిప్పర్లు వేసుకొని ఇంటర్వ్యూ జరిగే ప్రదేశానికి వెళ్ళాడు. ఆవేశంతో వచ్చిన అతన్ని చూసి అక్కడ ఉన్న వాళ్ళు చాలా ఆశ్చర్యపోయారు. రాజు ఇంటర్వ్యూ అయిపోయింది. అతను అక్కడ నుంచి నడుచుకుంటూ తాను దిగిన లాడ్జికి బయలుదేరాడు. అంత చలిలో ఎలాంటి ఉన్ని దుస్తులు ధరించకుండా నడుచుకుంటూ రావడం ఎంత ప్రమాదమో అతను ఊహించలేదు. కొద్దిసేపటికే చలికి అతనికి కాళ్లు చేతులు కొంకర్లు పోతున్నాయి. చలికి నోరు తెరవడానికి వీలు లేకుండా ఉంది. ఒళ్లంతా పూర్తిగా చల్లబడిపోయింది. రక్తప్రసరణ దాదాపు ఆగిపోయినట్టుగా అయిపోయింది. మెదడు మొద్దు వారింది. నడవలేని స్థితికి చేరుకున్నాడు. రాజు తన పని అయిపోయిందనుకున్నాడు. తను అక్కడే చలికి చనిపోతానని నిశ్చయానికి వచ్చాడు. ఒక పది నిమిషాలు అలాగే ఉంటే అతని అవయవాలన్నీ చలికి పనిచేయడం మానేసి చనిపోయి ఉండేవాడు. అతని అదృష్టం బాగుండబట్టి, భూమ్మీద అతనికి ఇంకా నూకలు ఉండబట్టి ఒక మహాతల్లి అతని దుస్థితి చూసింది. పరిగెత్తుకుంటూ వెళ్లి అతన్ని తన ఇంట్లోకి తీసుకొని వెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టింది. సలసల కాగిపోతున్న నీటి పాత్రను తెచ్చి అతని ముందు పెట్టి అతని కాళ్లు ఆ పాత్రలో పెట్టింది. మొదట అతని కాళ్ళకు వేడి తగల్లేదు. అతని పాదాలు మొద్దుబారి ఉన్నాయి. పది నిమిషాల తర్వాత అతని కాళ్లకు మెల్లగా వేడి తగిలింది. మెల్లమెల్లగా రాజు అవయవాలు పని చేయడం మొదలు పెట్టాయి. ఆ తర్వాత ఆమె రాజుకు ఒక పెద్ద పింగాణీ గ్లాసుతో వేడివేడి టీ తెచ్చి ఇచ్చింది. రాజు ఆ టీ తాగి కాసేపటి తర్వాత మామూలు స్థాయికి చేరుకున్నాడు.

ఆమె రాజుతో హిందీలో మాట్లాడింది. ఎలాంటి జాగ్రత్తలు లేకుండా చలిలో అలా వచ్చినందుకు ఆమె రాజును బాగా మందలించింది. రాజుకు ఆమె చెప్పేది అర్థం అవుతూ ఉంది కానీ, హిందీలో తిరిగి సమాధానం చెప్పలేకపోతున్నాడు. అతనికి హిందీ మాట్లాడటం రాదు. తన పరిస్థితిని తన పేదరికాన్ని ఇంటర్వ్యూకు వచ్చిన విషయాన్ని రాజు ఇంగ్లీష్ లో ఆమెకు చెప్పాడు. ఆమెకు ఇంగ్లీషు పెద్దగా రాకపోయినా అతను చెప్పిన దాన్ని బట్టి కొంతవరకు అర్థం చేసుకుంది.

ఆ తర్వాత ఆమె రాజుకు ఊలు స్వెట్టరు, చేతులకు గ్లోవ్స్, తలకు మంకీ క్యాప్, కాళ్లకు బూట్లు ఇచ్చింది. రాజు వాటిని వేసుకున్నాడు. అతను తినడానికి వేడి వేడి ఆహార పదార్థాలు పెట్టింది. రాజు ఆమెకు ఇంగ్లీషులో చాలా సార్లు ధన్యవాదాలు చెప్పి తాను ఊరికి వెళ్ళిపోయిన తర్వాత ఆమె ఇచ్చిన వస్తువులకు డబ్బులు పంపిస్తానని చెప్పాడు. ఆమె వద్దని చెప్పింది. రాజు ఆమెకు ధన్యవాదాలు తెలియజేసి అక్కడ నుంచి లాడ్జికి వచ్చి రైల్లో తన ఇంటికి చేరుకున్నాడు.

ఆనంద నవ్వులు

పదవ తరగతి పరీక్షా ఫలితాలు వచ్చాయి. ప్రభాకర్ రావు ఇద్దరు కుమారులు పదవ తరగతి పరీక్ష రాశారు. పెద్దకొడుకు ఆనంద్ పరీక్ష తప్పాడు. చిన్న కొడుకు కృష్ణ మొదటి తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు. తమ్ముడు మొదటి తరగతిలో పరీక్ష పాస్ అయినందుకు ఆనంద్ తమ్మునికి శుభాకాంక్షలు చెప్పాడు. తాను తప్పినందుకు చాలా బాధపడ్డాడు.

ప్రభాకర్ రావు ఆనంద్ ను పిలిచి “పరీక్ష తప్పటం నేరం కాదు. నువ్వు పరీక్ష ఎందుకు తప్పావో బాగా ఆలోచించు. తర్వాత పరీక్ష తప్పకుండా ఎలా రాయాలో నేర్చుకో. బాధపడటం సమస్యకు పరిష్కారం కాదు. నాకంటే చిన్నవాడు తమ్ముడు పాస్ అయ్యాడు, నేను ఫెయిల్ అయ్యాను అని ఎప్పుడూ తమ్మునితో పోల్చుకోవద్దు. తమ్మునితోనే కాదు ఎవరితోనూ నిన్ను నువ్వు పోల్చుకోవద్దు. నీకు నువ్వుగా ఉండు, నీకు నువ్వుగా జీవించు, నీకు నువ్వుగా చదువుకో. తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలందరూ తెలివితేటల్లో సమానంగా ఉండరు. కొందరు బాగా తెలివి కలిగిన వాళ్ళుగా ఉంటారు. వాళ్ళు చదువులో బాగా రాణిస్తారు. కొందరు తెలివితేటలు తక్కువ

కలిగిన వాళ్ళుగా ఉంటారు. వాళ్లు చదువులో బాగా రాణించకపోవచ్చు. చదువులో రాణించని వారు జీవితంలో పైకి రాలేరని చెప్పడానికి లేదు. తెలివితేటలు కలిగిన వాళ్ళందరూ జీవితంలో పైకి వస్తారని చెప్పడానికి లేదు. కానీ కనీస చదువు చాలా ముఖ్యం. కనీసం చదువు డిగ్రీ. కాబట్టి డిగ్రీ వరకు నువ్వు చదువుకోవాలి. ఆ తర్వాత నీకు ఇష్టమైన పని నువ్వు చేసుకోవచ్చు. చదువు మీద నీకు ఆసక్తి ఉంటే ఆతర్వాత ఇంకా పైచదువులు చదువుకోవచ్చు. లేదా వేరే పని మీద నీకు ఆసక్తి ఉంటే ఆ పని చేసుకోవచ్చు. కాబట్టి ముందు డిగ్రీ వరకు చదువుకోడానికి గట్టిగా ప్రయత్నించు. చదువు మీద మనసు పెట్టి గట్టిగా ప్రయత్నిస్తే ఫెయిల్ కావడం జరగదు. కాబట్టి సప్లిమెంటరీ పరీక్షల్లో మనసుపెట్టి బాగా చదువు. నువ్వు తప్పకుండా పాస్ అవుతావు అని చెప్పాడు.

ఫెయిల్ అయినందుకు తండ్రి బాగా తిడతాడని భయపడుతున్న ఆనంద్ కు తండ్రి మాటలు మంచి ఉత్సాహాన్ని ఇచ్చాయి. “అలాగే నాన్నగారు మీరు చెప్పినట్లుగా తప్పకుండా మనసుపెట్టి బాగా చదివి పాస్ అవుతాను”అని తండ్రితో చెప్పాడు. తండ్రి ప్రోత్సాహం అతనికి కొండంత బలాన్ని ఇచ్చింది.

ఆనంద్ పెద్ద తెలివైనవాడు కాదు. అతనికి చదువు మీద ఆసక్తి లేదు. అతనికి నటన అంటే చాలా ఇష్టం. అందులోనూ హాస్యం అంటే మరీ ఇష్టం. ఆ ఆసక్తితో ఇష్టంతో అతను చిన్నప్పటి నుంచి సినిమాల్లోని హాస్య నటీనటులను బాగా అనుకరిస్తూ తోటి విద్యార్థులను నవ్వించేవాడు. బడిలో తమకు చదువు చెబుతున్న ఉపాధ్యాయులను వారు మాట్లాడే తీరును, వారు చదువు చెప్పే విధానాన్ని హాస్యభరితంగా అనుకరిస్తూ విద్యార్థులను నవ్వించేవాడు. తెలుగులో ధారాళంగా హాస్య యుక్తంగా మాట్లాడేవాడు. అతని మాటలకు చేష్టలకు నటనకు తోటి విద్యార్థులు చాలా బాగా నవ్వేవారు, సంతోషించేవారు. పాఠశాలలో సభలు సమావేశాలు జరిగినప్పుడు ఆనంద్ తన హాస్య నటనతో ప్రసంగాలతో ప్రేక్షకులను

రంజింపజేసేవాడు. విద్యార్థులు చప్పట్లతో అతన్ని బాగా ప్రోత్సహించేవారు. దానితో అతను చదువు మీద దృష్టి పెట్టలేదు. పదవ తరగతి పరీక్ష ఫెయిలయ్యాడు.

హాస్య నటన పట్ల ఆనంద్ కు ఉన్న ఆసక్తిని అతని చేష్టలను కృష్ణ ఎప్పటికప్పుడు ప్రభాకర్ కు చెబుతూనే ఉన్నాడు. ప్రభాకర్ చాలామంది తండ్రుల్లాగా తన కుమారులు మెడిసిన్, ఇంజనీరింగ్ లాంటివే చదవాలని భావించేవాడు కాదు. పిల్లలు వారికి ఇష్టమైన, ఆసక్తి ఉన్న చదువులు చదువుకోవాలని, ఆ అంశాల మీదనే వారు జీవితంలో పైకి రావాలని అతను భావించాడు. అందువల్ల అతను ఆనంద్ ను హాస్య నటన పట్ల అతనికి గల ఆసక్తిని ఎప్పుడు కించపరచలేదు, వద్దని చెప్పలేదు. జీవితంలో పైకి రావడానికి, మానసిక పరిపక్వతకు డిగ్రీ వరకు చదువు చాలా అవసరమని అతని అభిప్రాయం. ఎవరికైనా తత్వం బోధపడడానికి స్వానుభవం చాలా అవసరం. ఆనంద్ ను “ముందు నువ్వు బాగా చదువుకో, నటన తర్వాత చూసుకోవచ్చు” అని అంటే ఆనంద్ బాధపడవచ్చు, వినకపోవచ్చు. అందుకని అతను ఆ సమయంలో బాగా చదువుకోమని ఆనంద్‌కు ఉద్బోధ చేయలేదు. అంతేకాకుండా ఆనంద్ చేస్తున్న నటన పట్ల తిరస్కారం ప్రదర్శించనూ లేదు, ప్రోత్సహించనూ లేదు. పదవ తరగతి పరీక్ష తప్పిన తర్వాత ఆనంద్ బాధపడుతున్నప్పుడు ప్రభాకర్ అతనికి జీవితంలో పైకి రావడానికి డిగ్రీ వరకు చదువు అవసరమని ఉద్బోధ చేశాడు. ఆ ఉద్బోధ బాగా పనిచేసింది.

పదవ తరగతి పరీక్ష తప్పిన తర్వాత తండ్రి చెప్పిన మాటలతో ఆనంద్ తన తప్పు తాను తెలుసుకున్నాడు. అతను సప్లిమెంటరీ పరీక్షల్లో బాగా చదివి 10వ తరగతి పాస్ అయ్యాడు.

అప్పటి నుంచి ఆనంద్ చదువును నిర్లక్ష్యం చేయలేదు. చదువు పట్ల చాలా శ్రద్ధ వహించాడు. ఇంటర్మీడియట్ లో చాలామంది విద్యార్థుల

లాగా అతను ఎంపీసీ, బైపీసి లాంటి సైన్స్ గ్రూపు తీసుకోలేదు. నటన పట్ల తన ఆసక్తికి అనుగుణంగా తెలుగు, హిస్టరీ, సివిక్స్ గ్రూప్ తీసుకున్నాడు. తెలుగులో సృజనాత్మకతను సాధించాలని, దాన్ని పెంపొందింపజేసుకోవాలని అతను భావించాడు. దానికి అనుగుణంగా తెలుగు మాస్టారు సలహాలు తీసుకొని అతను చెప్పిన కొన్ని కథలు నవలలు నాటకాలు అందులో ముఖ్యంగా హాస్య ప్రధానమైన రచనలను చదవడం ప్రారంభించాడు. దానితో అతనికి తెలుగు సాహిత్యం పట్ల, హాస్య రచనల పట్ల చక్కటి అవగాహన మెల్లమెల్లగా వచ్చింది. ఇంటర్మీడియట్ అతను మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. ఇంటర్మీడియట్ చదివేటప్పుడు ఆనంద్ కళాశాలలో సభలు సమావేశాలు జరిగినప్పుడు తన ఏకపాత్రాభినయంతో చక్కటి హాస్యాన్ని కలిగించి ప్రేక్షకులను రంజింపజేసేవాడు. అతను మెల్లమెల్లగా స్వయంగా హాస్య సన్నివేశాలను తయారు చేసుకుని నటించేవాడు. ఇది అతనికి మంచి పేరు తెచ్చిపెట్టింది.

ఇంటర్మీడియట్ పాస్ అయిన తర్వాత ఆనంద్ తెలుగు ప్రధానమైన సబ్జెక్ట్ గా, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ ఆన్సిలరీ సబ్జెక్టులుగా తీసుకొని బి.ఎ.లో చేరాడు. ఈ గ్రూపులో తెలుగు సబ్జెక్టులో తెలుగుకు సంబంధించిన వ్యాకరణం, భాష, కవిత్వం, నాటకాలు, విమర్శ మొదలైన అంశాలు ఉంటాయి. బి.ఏ. లో మూడు సంవత్సరాల పాటు వీటిని అధ్యయనం చేయడం వల్ల ఆనంద్ కు తెలుగు సాహిత్యం పట్ల, తెలుగు విమర్శ పట్ల అవగాహన వచ్చింది. అంతేకాకుండా అతనికి ఇష్టమైన హాస్య రచన మీద పరిణతి వచ్చింది.

దీనితో అతను రెండు మూడు పాత్రలతో పావుగంట, అరగంట నిడివి గల హాస్య సన్నివేశాలను సొంతంగా రాసి అందులో తాను ప్రధానమైన పాత్రగా ప్రదర్శన చేసి, ఆ ప్రదర్శనను సెల్ ఫోన్ తో షూట్ చేసి యూట్యూబ్ లో అప్లోడ్ చేయడం నేర్చుకున్నాడు. అతని ప్రదర్శనలకు యూట్యూబ్ లో ఎక్కువ లైక్ లు వచ్చాయి . దానితో అతను యూట్యూబ్ లో "ఆనంద

నవ్వులు" అనే పేరుతో సొంతంగా ఒక చానల్ ను ప్రారంభించాడు. బి.ఎ. డిగ్రీ పూర్తి అయ్యేనాటికి ఆనంద నవ్వులు చానల్ కు మంచి పేరు వచ్చింది. ఆనంద్ నిజ జీవితంలో ఎదురయ్యే సంఘటనలను ఆధారంగా చేసుకుని హాస్య సన్నివేశాలను రాసి వాటిని చిత్రీకరించి తన ఆనంద నవ్వులు చానల్లో అప్లోడ్ చేసేవాడు. అవి ప్రజలకు బాగా నచ్చాయి. దానితో ఆనంద్ కు హాస్య రచయితగా, హాస్య నటుడుగా చాలా మంచి పేరు వచ్చింది.

తన ఈ ప్రదర్శనలను ఆనంద్ తెలుగులో బాగా ప్రసిద్ధి పొందిన టీవీ ఛానల్ వారికి పంపించాడు. ఆ ఛానల్ వారు ఆనంద్ ను హాస్యం ప్రధానంగా ఉన్న ఒక షోకు యాంకర్ గా నియమించుకున్నారు. ఆనంద్ ఆ షో ద్వారా బాగా ప్రసిద్ధిలోకి వచ్చాడు. దీనితో అతనికి తెలుగు సినిమాలలో నటించే అవకాశాలు కొన్ని వచ్చాయి. కొందరు సినిమా దర్శకులతో అతనికి పరిచయం ఏర్పడింది. ఆనంద్ హాస్య సన్నివేశాలను రాసి సినిమా దర్శకులకు చూపించడం ప్రారంభించాడు. ఆ సన్నివేశాలు సినిమా దర్శకులకు బాగా నచ్చాయి. వారు ఆనంద్ కు మంచి రెమ్యూనికేషన్ ఇచ్చి ఆ సన్నివేశాలను తమ సినిమాల్లోకి తీసుకున్నారు. అంతే కాకుండా ఆ సన్నివేశాల్లో నటించే అవకాశాన్ని కూడా ఆనంద్ కు ఇచ్చారు.

సినిమాల్లో తనకొచ్చిన అవకాశాలను ఆనంద్ బాగా సద్వినియోగం చేసుకున్నాడు. అతను కష్టపడి చక్కగా నటిస్తూ హాస్యనటుడుగా తనకంటూ ప్రత్యేకంగా ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. దానితో అతనికి సినిమాల్లో చాలా అవకాశాలు వచ్చాయి. ఆ తర్వాత అతను వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం కలగలేదు. దాదాపు తెలుగులో వచ్చిన అన్ని సినిమాల్లో అతను నటించాడు. తెలుగు సినిమాల్లోనే కాదు తమిళం కన్నడం మలయాళం హిందీ సినిమాల్లో కూడా నటించాడు. సినిమాల్లో అతను చాలా బిజీ నటుడు అయిపోయాడు. అతను డబ్బులు బాగా సంపాదించాడు.

అయినప్పటికీ ఆనంద్ తన ఆనంద నవ్వులు ఛానల్ ను నిర్లక్ష్యం చేయలేదు. అతను కొంతమంది యువనటులను చేరదీసి వారితో హాస్య సన్నివేశాలను చిత్రీకరించి తన ఆనంద నవ్వులు చానల్లో అప్లోడ్ చేయించేవాడు. దానితో చాలామంది హాస్య నటులుగా పరిచయమయ్యారు. వారిలో కొందరు టీవీ ఛానల్ లో హాస్యనటులుగా, మరి కొంతమంది యాంకర్లుగా స్థిరపడ్డారు. కొంతమందికి సినిమాల్లో నటించే అవకాశం వచ్చింది. అలా ఆనంద్ తన ఛానల్ ద్వారా చాలామందికి సహాయం చేశాడు. చేస్తూనే ఉన్నాడు.

ఆనంద్ తాను చదువుకున్న పాఠశాలకు, జూనియర్ కళాశాలకు, డిగ్రీ కళాశాలకు ధారాళంగా విరాళాలు ఇచ్చాడు. కళాశాల విద్యార్థులు కళాశాలలో జరిగే సభలకు ఆనంద్ ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించేవారు. ఆ సభల్లో ఆనంద్ తన గురించి చెప్పి విద్యార్థులు తమకు ఇష్టమైన, ఆసక్తికరమైన అంశాల్లో గట్టిగా కృషి చేస్తే తన లాగా పైకి వస్తారని చెబుతూ ఉంటాడు. తమ పిల్లలు డాక్టర్లు ఇంజనీర్లు మాత్రమే కావాలని కోరుకోకూడదని, పిల్లల ఇష్టాన్ని బట్టి వారికి ఆసక్తి ఉన్న చదువులను చదవడానికి పిల్లలకు అవకాశం కలిగించాలని అతను తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తూ ఉంటాడు.

అనాయాస మరణం

రంగరాజు డిగ్రీ కళాశాలలో రీడర్ గా ఉద్యోగ విరమణ చేశాడు. అతనికి ఒక కూతురు, కొడుకు. కూతురు పెద్దది. వాళ్ళిద్దరినీ బాగా చదివించాడు. కూతురు డిగ్రీ కళాశాల లెక్చరర్ గా ఉద్యోగం చేస్తూ వుంది. అల్లుడు కూడా డిగ్రీ కళాశాలలో లెక్చరర్ గా పని చేస్తున్నాడు. వాళ్ల వేరే ఊర్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కొడుకు కోడలు వేరే నగరంలో ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్ లుగా ఉన్నారు. కూతురుకు, కొడుకుకు పిల్లలు కలిగారు. రంగరాజుకు ఎలాంటి చీకు చింత లేవు. పింఛను బాగానే వస్తుంది. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు. రాజు భార్యతో కలిసి అప్పుడప్పుడు కూతురు దగ్గరకు వెళ్లి కొద్ది రోజులు, కొడుకు దగ్గరికి వెళ్లి కొద్ది రోజులు ఉండి మనుమలతో మనుమరాళ్ళతో గడిపి వస్తుంటాడు. అతని ఉద్యోగ విరమణ జీవితం సుఖంగా సంతోషంగా సాఫీగా సాగుతూ ఉంది.

రంగరాజు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ఉద్యోగం ప్రారంభించాడు. ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నప్పుడు అతను చాలా గ్రామాలకు బదిలీ అయ్యేవాడు. ఆ గ్రామాల్లో సరైన సదుపాయాలు ఉండేవి కావు. పిల్లలకు ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు ఉండేవి కావు. మొదట్లో పిల్లలను తనతో పాటే అంటే తాను పనిచేస్తున్న ఊర్లోని తెలుగు మీడియం బడిలో చదివించేవాడు. దానితో పిల్లల చదువులు కొంత ఆటంకంగా సాగుతూ ఉండేది. అందువల్ల అతను పిల్లలను దగ్గర్లో ఉన్న పట్నంలోని ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చేర్పించి భార్యను పిల్లలను పట్నంలో ఉంచి తాను ఉద్యోగం చేస్తున్న ఊరికి ప్రతి రోజూ వెళ్లి వస్తుండేవాడు. కొన్నిసార్లు పట్నానికి తాను పని చేస్తున్న ఊరికి దూరం ఎక్కువగా ఉండటం వల్ల రోజు వెళ్లి రావడం కుదిరేది కాదు. అలాంటి సందర్భంలో అతను వారానికి ఒకసారి మాత్రమే కుటుంబం దగ్గరికి వెళ్లేవాడు. తాను పనిచేస్తున్న ఊర్లో వంట చేసుకుని ఉద్యోగం చేయడం అతనికి చాలా కష్టంగానే ఉండేది. అయినప్పటికీ పిల్లల చదువులను వారి క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ కష్టాన్ని సహించేవాడు. అతని భార్య సావిత్రి అనుకూలవతి. అతను భార్యతో తమ పిల్లలు బాగా చదువుకొని పెద్ద ఉద్యోగాల్లో స్థిరపడాలని చెబుతూ ఉండేవాడు. ఆయన పిల్లల భవిష్యత్తును గురించి అనేక రకాలుగా ఆలోచిస్తూ ఉండేవాడు. అతని భార్య కూడా అతని ఆలోచనలకు తగినట్లుగానే ప్రవర్తిస్తూ ఉండేది.

రంగరాజు ఉపాధ్యాయుడుగా ఉద్యోగం చేస్తూనే ఎం.ఏ. పూర్తి చేసి మొదట జూనియర్ కళాశాలలో లెక్చరర్ అయ్యాడు. ఆ తర్వాత డిగ్రీ కళాశాలలో లెక్చరర్ అయ్యాడు. పీహెచ్.డి. చేశాడు. ఆ తర్వాత ప్రమోషన్ మీద రీడర్ అయ్యాడు.

రంగరాజుకు పుస్తక పఠనం ఒక వ్యసనం. ఆ వ్యసనంతో అతను అనేక తెలుగు ఇంగ్లీష్ పుస్తకాలను బాగా చదివి ఆ రెండు భాషల్లోనూ మంచి ప్రావీణ్యం సంపాదించాడు. అతనికి ఆధ్యాత్మిక గ్రంథాలంటే

చాలా ఇష్టం. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత అతను కొన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను తెలుగు నుంచి ఇంగ్లీష్ కు ఇంగ్లీష్ నుండి తెలుగుకు అనువాదం కూడా చేశాడు. మనిషి చివరి దశలో అనాయాస మరణాన్ని కోరుకోవాలని చాలా ఆధ్యాత్మిక గ్రంథాల్లో చదివాడు. అదే అనాయాస మరణం తనకు తన భార్యకు కలగాలని రంగరాజు కోరుకుంటూ ఉండేవాడు. ఆ విషయాన్ని తన భార్యకు కూడా చెప్పేవాడు.

"సావిత్రీ, ఇంతవరకు మన జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సంతోషంగానే సాగింది. మన పిల్లలు ఉద్యోగాలు చేసుకుంటూ సంతోషంగా ఉన్నారు. వారిని గురించిన దిగులు మనకేమీ లేదు. నేను రిటైర్ అయి ఐదు సంవత్సరాలు అవుతూవుంది. నాకు 65 సంవత్సరాలు వచ్చాయి, నీకు 63 వచ్చాయి. మనిద్దరికీ బీ.పి, షుగర్ ఉన్నాయి. పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదు. అది సృష్టి ధర్మం, మనం కూడా ఏదో ఒక రోజు చనిపోతాం. 65 సంవత్సరాలు దాటిన తర్వాత ఎప్పుడు ఏం జరుగుతుందో ఏమీ చెప్పలేం. ఈ దశలో మనం కోరుకోవాల్సింది అనాయాస మరణం. వృద్ధాప్యంలో మంచాన పడి ఇతరుల చేత సేవ చేయించుకుంటూ, వారిని ఇబ్బంది పెడుతూ, వారి చేత నిందలు పడుతూ తాను కష్టపడి ఇతరులను కష్టపెడుతూ ఉండే దానికంటే సుఖంగా కూర్చున్న వాడు కూర్చున్నట్లుగా లేక నిద్రపోతున్న వాడు నిద్రపోతునట్లుగా చనిపోతే చాలా గొప్ప అదృష్టం. అలాంటి అదృష్టం అందరికీ పట్టదు. ఆ అదృష్టం మనకు పట్టాలని నేను త్రికరణశుద్ధిగా కోరుకుంటున్నాను. అయితే మన కోరిక నెరవేరుతుందని చెప్పలేం. నెరవేరితే అంతకంటే మించిన భాగ్యం మరొకటి లేదు'' అని రంగరాజు భార్యతో చెప్పాడు.

"నాకు అలాంటి కోరికలేవీ లేవు. నేను ఇప్పుడే చనిపోవాలను కోవడం లేదు. ఇంకా చాలా కాలం బతకాలి. నా మనుమల పెళ్లి, మనుమరాళ్ళ పెళ్ళి చూడాలి. మీరు నాకంటే ఇంకా ఎక్కువ కాలం బతకాలి. నేను చనిపోవడం జరిగితే మీ కంటే ముందుగానే పుణ్యస్త్రీగా చనిపోవాలని

నేను కోరుకుంటాను. అయినా మనం కోరుకున్నట్టుగా జరుగుతుందా? మన నుదుట ఎలా రాసి ఉంటే అలా జరుగుతుంది'' అని సావిత్రి భర్తతో చెప్పింది.

"నాకు కూడా ఇప్పుడే చనిపోవాలనే కోరిక ఏమీ లేదు. మనుమలు మనుమరాళ్ళ పెళ్లి చూడాలనే కోరిక నాకు కూడా ఉంది. ఒకవేళ చనిపోవడం జరిగితే అనాయాస మరణం కావాలని నేను కోరుకుంటున్నాను. నువ్వు అన్నట్లుగా మనం కోరుకున్నవన్నీ జరుగుతాయా? మన ప్రారబ్ధం ఎలా ఉంటే అలా జరుగుతుంది, దాన్ని ఎవరు తప్పించలేరు'' అని రంగరాజు భార్యతో అన్నాడు.

రంగరాజుకు చాలా కాలంగా పళ్ళ సమస్య ఉంది. ఆ సమస్య రానురాను ఎక్కువైంది. అతని పళ్ళు ఒకటొకటిగా ఊడిపోవడం ప్రారంభించాయి. ఉన్న కొన్ని పళ్ళు కూడా ఎక్కువగా నొప్పి పెడుతూ ఉంటే రంగరాజు పళ్ళన్నీ పీకి వేయించుకొని కట్టుడు పళ్ళు పెట్టించుకున్నాడు.

సావిత్రి కి బీ.పి ఎక్కువైంది. షుగర్ వ్యాధి కూడా అదుపులో ఉండడం లేదు. మందులు వాడుతున్నప్పటికీ ఇవి రెండు పూర్తిగా సాధారణ స్థితికి రావడం లేదు. ఒకరోజు అర్ధరాత్రి ఆమెకు కుడి వైపు పక్షవాతం వచ్చింది. కుడి చెయ్యి కుడికాలు పడిపోయాయి. కుడివైపు ముఖంలో కూడా తేడా వచ్చింది. అత్యవసరంగా ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. మందులు వాడారు, కొంత వరకు నయమైంది. పూర్తిగా నయం కావడానికి ఆరు నెలల నుంచి సంవత్సరం పడుతుందని దానికి మందులు వాడుతూ ఫిజియోథెరపీ చేయించుకోవాలని వైద్యులు చెప్పారు. కూతురు అల్లుడు కొడుకు కోడలు వచ్చి చూసి వెళ్లారు. ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

భార్య పరిస్థితి చూసి రంగరాజు చాలా వేదనకు గురయ్యాడు. ఆమె మంచంలోనే ఉండవలసి వచ్చింది. మలమూత్రాలు మంచంలోనే జరిగేవి.

నోరు వంకర పోవడం వల్ల ఆహారం తీసుకోవడం కష్టంగా ఉండేది. అన్నాన్ని మెత్తగా పిసికి ద్రవ రూపంలో తాపించేవాడు. అది కూడా ఎక్కువగా వెళ్ళేది కాదు. ఈ పనులన్నీ రంగరాజు స్వయంగా చేసేవాడు. ఆయన తన భార్యను చిన్నపిల్లలాగా చూసుకుంటూ చాలా ప్రేమతో ఎలాంటి విసుగు లేకుండా ఈ పనులన్నిటినీ చేసేవాడు. భర్త చేత ఈ పనులు చేయించుకోవడానికి సావిత్రికి చాలా బాధగా ఉండేది. కానీ తప్పలేదు.

సావిత్రి పక్షవాతానికి మందులు వాడుతున్నారు. ఫిజియోథెరపీ చేసే వ్యక్తి ఇంటికి వచ్చి ఫిజియోథెరపీకి సంబంధించిన వ్యాయామాలు చేయిస్తున్నాడు. ఆరు నెలలు దాటింది, కానీ ఆమె పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదు. అన్నీ మంచం మీదనే జరిగేవి. రంగరాజు ఆమెను ఓదారుస్తూ అన్ని సపర్యాలు చేసేవాడు. ఆయన ఎక్కడికి వెళ్లకుండా భార్య దగ్గరే ఉంటున్నాడు. వంట చేయడానికి, ఇల్లు శుభ్రం చేయడానికి ఒక ఆడ మనిషిని పెట్టుకున్నాడు. కూతురు, కొడుకు అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్ళిపోతున్నారు. వారి నుంచి పెద్దగా స్పందన లేదు. తల్లి పట్ల కూతురు, కొడుకుల ఈ ప్రవర్తనకు రంగరాజు చాలా బాధపడేవాడు. అయినా వారిని ఏమీ అనేవాడు కాదు.

ద్రవ రూపంలో ఆహారం కొద్దిగా తీసుకోవడం వల్ల సావిత్రి రోజురోజుకు నీరసించి బాగా చిక్కిపోయింది. రోజురోజుకు నీరసించిపోతున్న భార్యను ఆ స్థితిలో చూడలేక రంగరాజు తల్లడిల్లిపోయేవాడు. ఏం చేయాలో తోచక కుమిలిపోసాగాడు. తాను కోరుకున్న అనాయాస మరణం భార్యకు రానందుకు ఆయన చాలా విచారించాడు. దాదాపు ఒక సంవత్సరం పాటు సావిత్రి మంచం మీదనే ఉండి బాగా నీరసించి చివరకు గుండె ఆగి చనిపోయింది. కూతురు అల్లుడు కొడుకు కోడలు మనుమలు మనుమరాళ్ళు అందరూ వచ్చారు. కొడుకు తల్లికి అంత్యక్రియలు నిర్వహించాడు. చిన్నదినం, పెద్దదినం కార్యక్రమాల తర్వాత వచ్చిన వాళ్ళందరూ వెళ్లిపోయారు.

రంగరాజు తన ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఒంటరి జీవితం అతనికి చాలా కష్టంగా ఉంది. అతనికి అనుక్షణం భార్య గుర్తుకు రాసాగింది. ఆ బాధను మర్చిపోవడానికి అతను పుస్తకాలు చదివేవాడు. అయితే మునుపటిలాగా ఏకాగ్రతగా చదవలేక పోతున్నాడు. తన భార్య మంచాన పడితే తాను దగ్గరుండి ఆమెకు సేవ చేశాడు. కానీ తాను మంచాన పడితే తనకు ఎవరు సేవ చేస్తారు? అందువల్ల తనకు అనాయాస మరణం రావాలని ఎక్కువగా కోరుకునేవాడు.

అతను కొద్ది రోజులు కూతురు దగ్గరికి మరి కొద్ది రోజులు కొడుకు దగ్గరికి వెళ్ళాడు. కోడలు అతనితో ముభావంగా ఉండేది. అందుకని అతను కొడుకు దగ్గర ఎక్కువ రోజులు ఉండేవాడు కాదు. కూతురు అతన్ని బాగానే చూసుకునేది. అయినప్పటికీ అతనికి ఒంటరితనం పోలేదు. భార్య జ్ఞాపకాలు పోలేదు. దిగులు వల్ల వేదనవల్ల అతనికి బీ.పి, షుగరు వ్యాధులు అదుపులోకి రాలేదు. అతను కూతురు దగ్గర ఉన్నప్పుడు ఒకరోజు తెల్లవారుజామున అతనికి కుడివైపు పక్షవాతం వచ్చింది. కుడి కాలు చేయి పడిపోయాయి. నోరు కూడా వంకర పోయింది. వెంటనే ఆసుపత్రికి తీసుకుపోవడం వల్ల ముప్పు తప్పింది. నెలరోజులపాటు ఆసుపత్రిలో ఉండవలసి వచ్చింది. దాదాపుగా 70 శాతం వరకు శరీరం అదుపులోకి వచ్చింది. అతన్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. మందులు వాడటం వల్ల ఫిజియోథెరపి వ్యాయామం వల్ల మిగిలిన 30 శాతం జబ్బు తగ్గిపోతుందని డాక్టర్లు చెప్పారు.

రంగరాజు దాదాపు ఆరు నెలల పాటు మందులు వాడాడు. ఫిజియోథెరపీ వ్యాయామాలు చేయించుకున్నాడు. దానివల్ల 10 శాతం మాత్రం మెరుగయింది. కాలు చేయి నోరు పూర్తిగా స్వాధీనంలోకి రాలేదు. నోటిలో పళ్ళు ఊడిపోవడం వల్ల నోరు స్వాధీనంలోకి రాకపోవడం వల్ల అతనికి నోటి నుంచి చొంగ కారుతూ ఉండేది. మాట స్పష్టంగా వచ్చేది కాదు. నడిచేటప్పుడు కాలు ఎగురవేస్తూ నడిచేవాడు. చేయి కూడా పూర్తిగా సహకరించేది కాదు.

ఆరు నెలల తర్వాత కూతురు రంగరాజును విసుక్కోవడం ప్రారంభించింది. అంతేకాకుండా తాను తండ్రిని చూసుకోలేనని వచ్చి నాన్నను తీసుకొని వెళ్ళమని తమ్ముడికి ఉత్తరం రాసింది. రంగరాజు కొడుకు వచ్చి రంగరాజును తీసుకొని వెళ్ళాడు. రంగరాజును ఒక గదిలో ఉంచారు. కోడలు రంగరాజు మొహం కూడా చూసేది కాదు. అంతేకాదు తన పిల్లలను కూడా రంగరాజు దగ్గరికి వెళ్ళనిచ్చేది కాదు. భోజనం పెట్టడం మొదలైనవన్నీ కొడుకే చూసేవాడు. అతను ఆ గదికి పరిమితమైపోయాడు. కొడుకు కోడలు కాలేజీకి, మనవడు మనవరాలు స్కూలుకు వెళ్లేవారు. రంగరాజు ఒంటరిగా ఉండవలసి వచ్చింది. ఆ పరిస్థితి అతనికి చాలా దుర్భరంగా ఉండేది.

రంగరాజు ఒంటరితనాన్ని భరించలేక, కొడుకును బాధ పెట్టడం ఇష్టం లేక అతను డబ్బులు చెల్లించే ఓల్డ్ ఏజ్ హోమ్ లో చేరాడు. అక్కడ చాలా మంది వృద్ధులున్నారు. వారితో మాట్లాడటం వల్ల, కష్టం సుఖం చెప్పుకోవడం వల్ల అతనికి బాగానే ఉండేది. హోమ్ లో భోజనం కూడా బాగానే ఉండేది. రంగరాజుకు రోజులు బాగానే గడిచిపోతున్నాయి. అలా మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పుడప్పుడు కూతురు కొడుకు వచ్చి చూసి వెళ్లేవారు. అయితే రోజులు గడిచే కొద్దీ వృద్ధాప్యం వల్ల, బీ.పి, షుగర్ వ్యాధుల వల్ల అతను చిక్కిపోసాగాడు. కొద్దిరోజుల తర్వాత అతనికి రెండవసారి పక్షవాతం వచ్చింది. కుడి వైపు శరీర భాగమంతా పూర్తిగా చచ్చుబడిపోయింది. అతన్ని ఆసుపత్రిలో చేర్పించారు. నెలరోజుల పాటు ఆసుపత్రిలో ఉన్నాడు. మందులు వాడుతున్నారు, అయినా అతనిలో ఎలాంటి మార్పు కనపడలేదు. చివరకు నెలరోజుల తర్వాత అతను గుండె ఆగి చనిపోయాడు.

రంగరాజు కోరుకున్న అనాయాస మరణం అతనికి వచ్చినట్లేనా?



ANUBHAVAALA KATHALU

- Short Stories

by

Prof. M. Jayadev

D.Lit.

ఆచార్య జయదేవ్ గారు నాకు తెలిసినంతవరకు గొప్ప పరిశోధకులు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా, శాఖాధ్యక్షులుగా సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. ప్రాచీన, ఆధునిక, జానపద సాహిత్యాలపై లోతైన అధ్యయనం ఉన్నవారు.

జయదేవ్ గారు తన నిత్య జీవితంలో గమనించిన అనేక జీవన సత్యాలను 20 కథలుగా రాసి వాటిని “జయదేవ్ కథలు” పేరుతో 2022లో ఒక కథా సంపుటిని తీసుకొచ్చారు. ఇప్పుడు మళ్లీ 20 కథలను “అనుభవాల కథలు” పేరుతో కథా సంపుటిని తీసుకొస్తున్నారు. ఈ 20 కథలను చదివిన తర్వాత మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మనం గమనిస్తే ప్రతి జీవితమూ ప్రతి సంఘటన ఒక కథగా రాయొచ్చనిపిస్తుంది. కథా సాహిత్యంలో కొత్తగా ప్రవేశించిన వారికి కథలు ఎలా రాయాలో చెప్పడానికి ఈ కథలు మోడల్ గా పని చేస్తాయి. రచయిత మన కుటుంబాల్లో నిత్యం జరిగే సత్యాలను కథలుగా మన ముందుంచారు. ఈ కథల్లో విద్యాసంస్థల్లో జరుగుతున్న లొసుగులను చెప్పి వాటికి తీసుకోవలసిన పరిష్కారాలను పరోక్షంగా మనకు సూచిస్తున్నారు. స్త్రీల సమస్యలను చిత్రించడంలో రచయిత ఒక తండ్రిగా ఎంతో ఆర్ద్రతతో చెబుతూనే అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తిగా కనిపిస్తారు. సమాజంలో ఉన్న వర్గాధిపత్యాన్ని భూస్వామ్య స్వభావాన్ని ఈ కథల్లో రచయిత స్పష్టంగా చెప్పారు. ఉన్నత చదువులు చదివి ఉన్నతోద్యోగాలు చేస్తూ కూడా తనతో సమానంగా ఉద్యోగం చేస్తున్న స్త్రీల పట్ల పురుషులు వ్యవహరిస్తున్న తీరును వారిలో రావలసిన మార్పులను చెప్పేటప్పుడు రచయిత ఒక స్త్రీవాది లాగా కనిపిస్తారు. అంతలోనే అది స్త్రీవాదమో తిరుగుబాటో కాదని భార్యాభర్తల మధ్య ఉండవలసిన అవగాహన సర్దుబాటు అని సూచిస్తారు.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, తెలుగుశాఖాధ్యక్షులు,
హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం, హైదరాబాదు

ISBN:
isbn_978-93-5915-676-7